UNIVERSAL
LIBRARY
OU_206278
UNIVERSAL
LIBRARY

# పీఠిక.

రవీంద్రనాథ టాగూరు అను మహనీయుడు బంగాళీభాషలో ననేక కావ్యములు రచియించిన మహాకవియని యెల్లరకు తెలియును. ఆ మహాకవిచే రచియింపబడిన గ్రంథములలో ననేకము లనేక దేశభాషలలోనికి ఆయా దేశస్థులు మార్చుకొనుటయే వారి గ్రంథముల గొప్పతనమును చాటుచున్నది. ఇవియు నా కవిపుంగవునిచే బంగాళీభాషలో వ్రాయబడిన గ్రంథములనుండి యెత్తి వ్రాసిన కథలే.

ఇందున్న పది కథలును మన హిందూదేశమందున్న యాచారవ్యవహారములననుసరించియుండుటచే జదువరులకు సంతోషదాయకములుగా నుండుననుటకు సందేహములేదు. ప్రతి కథయు జదువనారంభించిన, ముందేమో వింతయున్నట్లు తోచుచు కడవరకు జదువనిది విడువ మనస్సొప్పదు. మఱియు, ఈ కథలన్నియు గంభీరోదారభావములను ప్రకటించుచు నీతిబోధకములై యుండుటచే ఆంధ్రదేశమందు చదువు నేర్చినవారందఱును చదువదగియున్నవి. ఈ గ్రంథపఠనము హైస్కూళ్లలోని విద్యార్థుల భాషాభివృద్ధికి తోడ్పడును.

Ch. S. PRAKASA RAO,
*Ag. Assistant Inspector of Schools,*
*Nellore District.*

# విషయసూచిక.


| | | |
|---|---|---|
| 1. | కాబూలువాలా ... ... ... ... | 1 |
| 2. | జన్మస్థానమునకు తిరిగి పోవుట .. ... ... | 9 |
| 3. | పూర్వమొక రాజుండెను .. ... ... | 16 |
| 4. | పోయిన పిల్లవాడు తిరిగి దొరకుట ... ... ... | 23 |
| 5. | హరలాలుడు ... ... .. ... | 33 |
| 6. | సుభాషిణి ... ... ... ... | 49 |
| 7 | పోస్టుమాస్టరు ... ... ... ... | 55 |
| 8 | భ్రష్టుడు ... ... ... ... | 61 |
| 9. | కాళీపాదుడు ... ... .. .. | 73 |
| 10. | నయనజోరు జమీందారులు . ... ... | 101 |

# STORIES FROM TAGORE

## రవీంద్రనాథ టాగూరు రచించిన

# కథలు.

### 1. కాబూలువాలా.

నాకైదేండ్లకూతురు కలదు. అది మాటలాడ నేర్చినదిమొదలొక్కక్షణము మౌనముతోఁ గాలము వమ్ముసేయలేదు. ఒక్క నిమిషమైనను మాట్లాడకూరకుండదు. తల్లి విసుగుజెంది దాని వాఁగుడు మాన్పింపఁ దలంచుఁగాని నేనట్టి నిర్బంధమంగీకరించువాఁడనుగాను. దాని నైజగుణమునకు విరుద్ధముగా నొక తృటికాలమూరకున్నయెడల నాకుమాత్రము తోఁచదు. కావుననే నే నెల్ల వేళలయందును దాని సహజములును మధురములునగు చిన్నతనపు ముద్దుమాటలే వినఁగోరుచుందును.

ఏనొకనాటి ప్రొద్దుటఁ గొలఁది దినములనుండి వ్రాయుచున్న నవలలోని పదునేఁడవ యధ్యాయము ముగించుచున్నకాలమందు నా కూతురు "మణి" నా గదిలోనికి నిశ్శబ్దముగ నేతెంచి నాకేలఁ గేలిడి "నాయనా!" మన వాఁకిలికాఁచు "రామదయాళుఁడు వెండియనుటకు ఎండియనును. వానికిఁ దెలివితేటలు లేవుసుమా!" అని నుడివి యందులకుఁ దగినకారణమును నేను తెల్పక పూర్వమే యా కథవదలి నాయనా! భోలుఁడు మేఘములలో నేనుగులున్నవనియు నవి త్రాగిన నీరు తొండములతోఁ జిమ్ముచుందుననియు నదియే వర్షమనియుఁ జెప్పెను. నిజమేనా? నీ యభిప్రాయమేమి? యని యడిగెను. దానికిఁ బ్రత్యుత్తరము చెప్పకముందే "మా యమ్మ నీకేలాటి బంధువు" అని యింకొక వింతప్రశ్నమడిగెను. నేను గొంచెము మొగమెఱ్ఱ చేసికొని "అమ్మాయీ! నేను వేఱు పనిమీఁదనుంటిని. నీవు పోయి భోలునితో నాఁడుకొనుము, పొమ్ము" అని పంపితిని. నా గదికిటికీనుండి రాజవీధి బాగుగఁ గన్పడును. నా కూతురు మరలవచ్చి నా వ్రాఁతబల్లకు సమీపమునఁ గూర్చుండి నా మోకాళ్లమీఁద మద్దెలమీఁద వాయించినట్లు వాయించుచు మెల్లఁగా

వాఁడుకొనుచుండెను. నేను నా నవలలో "కథానాయకుఁడైన ప్రతాపసింగు నాయకురాలైన కాంచనలతనుఁ దన భుజములపై నెత్తుకొని మేడ మూఁడవ యంతస్తునందున్న గవాక్షద్వారమునఁ బాఱిపోయిన కథాసందర్భమును దదేకదృష్టితో వ్రాయుచుంటిని" అప్పుడు మణి తటాలున లేచి కిటికీదగ్గరకుఁ బోయి "కాబూలువాలా, కాబూలువాలా" యని బిగ్గరగా నఱచెను. వదులైన మురికిబట్టలుకట్టి పొడవైన తలపాగఁబెట్టి వీపున నొక గుడ్డసంచి వ్రేలాఁడ ద్రాక్షపండ్లపెట్టె చేతంబట్టికొని యొక కాబూలుదేశస్థుఁ డొకఁడా వీధి వెంబడి పోవుచుండెను.

ఆ విదేశీయునిఁ జూచినయంతనే యా బాలిక మదిలో నేయూహ జనించెనో కాని యెలుఁగెత్తి వానిం బిలువసాగెను. వాఁడు లోనికివచ్చుననియు నా వ్రాఁత యాఁగిపోవుననియు నాకు దోఁచునంతలో వాఁడు మా యింటిలోనికి రాఁ జొచ్చెను. గడపయెక్కుచున్న వాని మొగముఁ జూచి బెదరి మణియు తల్లిదగ్గరకుఁ బరుగెత్తెను. లావైన పెద్దశరీరముగలవాని వీఁపుపై వ్రేలాఁడు సంచిలో నిద్దఱు ముగ్గురు పిల్లలుందురనియు, వాఁడు పిల్లల నపహరించుననియు దాని చిత్తమున భీతి యుదయించియుండెనోవు. అంతలో వాఁడును గడపదాఁ నగుమొగముతో నన్నెదుర్కొనెను. నాకును జీవితసంశయమందున్న నా నవలా కథానాయకుల కథ వ్రాయుట నంతతో ముగించి వానియొద్దనున్న వస్తువులు కొనవలయునను కోరిక వొడమినది. వానియొద్దనున్న సరకులలో గావలసినవి కొన్నింటిని గొని పిదప నాఫ్ఘనిస్థానమున కమీరగు "నబ్దుల్ రహిమాను"గారిని గుఱించియు నాంగ్లేయులకును ఋష్యావారికిని జరుగు రాజనీతిపద్ధతులను గుఱించియుఁ గొంతసేపు ప్రస్తావించితిని. అతఁడును దనకుఁ దెలిసిన సంగతులుచెప్పి సెలవుగైకొని యేగుచు నన్నుఁ బిలచిన బాలిక యెందున్నదని యడిగెను. నేను నీపాటికి దాని మదిలో జనించిన భయము తొలఁగి యుండవచ్చుంగదా! యని తలంచి యక్కడకు రావించితిని. వాని సంచిని వాని వేషమునుజూచి గడగడ వడంకుచు "మణి"యు నన్నుఁ గవుంగలించుకొనియెను. "కాబూలువాలా"యును నా కూతురును నొండొరులనుజూచుట కిదియే మొదలు. ప్రథమదర్శనమున నిట్లు భీతయైన మా మణియును నా కాబోలుదేశస్థుఁడును మఱికొన్నాళ్లకు మా గుమ్మమునందు నిర్భయముగా మాటలాడుచుండుట చూచి యబ్బురపడితిని. అంతకుమున్ను మా పిల్లదిసేయు నధికప్రసంగము నాసక్తితో వినుచుండువాఁడను నేనొకఁడనే. నేఁటికిఁ గాబూలుదేశస్థుఁ డింకొకఁడు తటస్థించెను. నేను జూచునప్పటికి మా కుఱ్ఱది

బల్లమీఁదఁ గూర్చున్నది. "కాబూలువాలా" దాని పాదములయొద్దఁ గూర్చుండెను. మా మణి పైటకొంగు వాఁడిచ్చిన బాదముకాయలతోఁడను, ద్రాక్షపండ్లతోఁడను నిండియుండెను. "ఆ పిల్లకుఁ బండ్లెందులకు నీవిచ్చితివి" అని కూకలిడి యా వర్తకునకు నేనొక యర్ధరూప్యమునొసంగితిని. వాఁడును నది తన చొక్కాజేబులో వైచికొనియె. నా పనిమీఁద నే నేఁగితిని. మరల నేనింటికొకగంటకు వచ్చునప్పటికి మా మణిచేతనున్న యర్ధరూపాయి మా యింట నొక్కలి తొందర కలుగఁజేసెను. నా భార్యయు, కుమార్తెను "నీకీ నాణెమెక్కడిది" అని భీకరవచనములతోఁ దర్జింపుచుండెను. కాబూలువాలా నాకిచ్చినాఁడని యది సంతోషముతోఁ జెప్పుచుండెను. కాబూలువాలా నీకిచ్చినాఁడా! ఎందులకిచ్చినాఁడు! ఇచ్చినను నీవేల పుచ్చుకొంటివి! అని తల్లి కుమార్తెను మఱింత కోపపడుచుండెను. ఆ సమయంబున నేనింటికివచ్చితిని. కోపపడవలదని నా భార్యను నివారించితిని. బాలికవలన జరిగినసంగతి గ్రహించితిని.

తరువాతఁగూడ వారిరువురకును సమావేశము ముగియలేదు. వాఁడు సంస్థులచిహ్నముగా నిచ్చుచుండుటయు, నది తినుచుండుటయు జరుగుచునే వచ్చెను. కొన్నాళ్లకు వారిరువురు స్నేహితులైరి. చిత్రవిచిత్రమైన మాటలు మాటాడుకొనుచు వారిరువురెప్పుడెప్పుడు వినోదించుచుండిరి. నీ సంచిలో నేమున్నదని మణి యడిగిన నతం డేనుగులున్నవని పరిహాసమునకై పలుకును. కాబూలుదేశీయునకు సహజములగు ముక్కుమాటలచే వాఁడు బదులుచెప్పుటయు బాలికకు మితిలేని యానందము కలుగఁజేయుట కాశ్చర్యమేమున్నది! వయస్సుమళ్లిన యా కాబూలువాలాతో శైశవమునందున్న బాలిక మాటలాడుచుండుట నాకును వినోదముగానే యుండెను. మా వంగదేశ బాలికలలోఁ జాలమంది చిన్నతనమునందే యత్తగారియిల్లని, మామగారియిల్లని కాపురముచేయుటయని మొదలగుమాటలు వినుచునేయుందురుగాని యీ కాలపు మార్పుల ననుసరించి మా మణికిమాత్ర మట్టిమాటలు తెలియకుండఁగనే గడపుచుంటిమి. ఒకనాడు మా పెద్దదానితో నా కాబూలు వర్తకుఁడు "మీ మామగారింటికెన్నఁడు వెళ్లెదవు?" అనఁగా మామగారింటికి వెళ్లుటయను సంగతియే యది యెఱుంగనిదగుట నా మాటకు బదులుచెప్పఁజాలక తొట్రుపాటు గలిగియుఁ దన నేర్పున నది బయలుపడకుండ "నీవక్కడికి పోగలవా?" యని యడిగెను. కాబోలు దేశభాషలో మామగారిల్లనఁగాఁ గారాగృహమునకుఁ గూడ నర్థము కలదు. జనులకు స్వంతధనము ఖర్చు కాకుఁడ సమస్తోపచారములు

జరుగుటకు మామగారియిల్లువంటిది లేదు. కారాగృహమునట్టిదే! కనుక నా రెండును మామగారియిండ్లేయని కాబూలీలు వ్యవహరింతురు. దానంజేసి యా వర్తకుఁడు బాలిక ప్రశ్నమునకు "ఖైదుకొట్టుకుఁ బోవుచున్నావా" యను నర్థముచేసికొని, మామగారా! మామగారా! మామగారువచ్చిన నీ పిడికిలితో నిట్లు రెండు గ్రుద్దులు గ్రుద్దెదనని తిరస్కరించుచు గడబిడసేయఁగా బాలికయుఁ బకపకనవ్వుచుఁ దన మనఃపటమునందు మామగారనఁగా గ్రుద్దులుఁ గ్రుద్ది పరాభవింపఁదగినవాఁడని చిత్రించుకొనెను.

ఒకప్పుడు రాజులు పరరాజులమీఁదికి దండయాత్రకు వెడలెడు శరత్కాలమువచ్చినది. నేను కలకత్తాలో నొకమూలనున్న మా యింటినుండి బయటికిఁ గదలకపోయినను నా మనంబుమాత్రము ప్రపంచమంతయుఁ దిరుగుచునేయుండును. ఇతరదేశపుఁ బేరువినినంతనే నా చిత్తమక్కడకుఁ బరువెత్తును. పరదేశి కన్పడినయెడల నాని దేశమునందలి కొండలు, పట్టణములు, కాననములు మున్నగునవియు, పర్ణశాలలయొక్కయు, నడవులయొక్కయు, నడవులయందలి మనుష్యులయొక్కయు సంగతులును నూహచే భావించికొనుచుందును. దానంజేసి నూతిలోని కప్పవలె జన్మభూమికదలక ప్రయాణమన్న బిఱుసుపడినట్లు భయపడు నాకు విదేశములయందలి రమ్యప్రదేశములన్నియు మనోనేత్రమునకుఁ గన్పడుచునేయుండును. కొండచరియలనుండి పట్టణములలోనికిఁ బణ్యవస్తువులు మోసికొనివచ్చు లొట్టిపిట్టలును, నాయుధపాణులై వానివెంట నరుదెంచు వర్తకులును, నా మనోనేత్రమునకుఁ జూపట్ట నొకనాడు కాబూలుదేశమునుగుఱించి యానందించుచున్న నాకడకు నా భార్య చనుదెంచి "కాబూలు వర్తకుడింకను వచ్చుచున్నాఁడా! జాగ్రత్తగానుండుడు" అని హెచ్చరించెను పాపము నా భార్య బెదరుగుండెకలది. ఆమె వీధిలోఁ జప్పుడు విన్పడినచో దొంగలో, త్రాగుబోతులో యింటఁ బడుచున్నారని భావించును. కంబళీపురుగులను, రోకలిబండలను జూచినప్పుడుకూడఁ బాములను, బులులను జూచినట్లు గజగజలాడును. ఇన్నియేండ్లు గడచినను సహజమగు భయమామెకు వదలలేదు. ఆమెకుఁ గాబూలువాలానుగుఱించి పెక్కు సందియములు కలవు. దానంజేసియే యతని చర్యలు జాగ్రత్తగాఁ గనిపెట్టుఁడని నన్నుఁ బ్రార్థించుచుండెడిది. "పిల్లలను మాయగాండ్రు మోసగించి యపహరించుటలేదా! కాబూలులో బానిసలున్నారను సంగతి యబద్ధమా! ఈ వర్తకుఁడీపగిది వచ్చి వచ్చి యెప్పుడో మన పిల్లను సంచిలోవైచికొని పాఱిపోయిన మనమేమి చేయఁగలము?" అని పెక్కు భయకారణములు కల్పించుచుండెడిది.

అట్టి సంగతులు కేవలమసత్యములు కాకపోయినను నీ వర్తకునియెడల భయపడ వలఁదని యెన్నిసార్లు నొక్కి వక్కాణించినను నామెను సందియము విడువ లేదు. అంతమాత్రమున కింటికివచ్చు వర్తకునితో మాటలాడవలదను టుచితము కాదని మా కుఱ్ఱదానిని మందలింపనైతిని.

ప్రతి సంవత్సరమును పుష్యమాసములో నీ వర్తకుఁడు స్వదేశమునకుఁ బోవుచుండుటాచారము. పోకముందింటింటికిఁదిరిగి తనకు రావలసిన బాకీలు వసూలుచేసికొనుచుండును. ఈ సంవత్సరమెంత పనియున్నను మా యింటికి వచ్చి మా కుఱ్ఱదానితో మాటలాడివెళ్లని దినములేదు. చూచినవారికీ యిరువురకు నింత యనుబంధముండుటకు హేతువేమో యని తోఁచక మానదు. పొడుగులైన నిల్వుటంగీ తొడిగికొని పెద్ద సరుకులసంచి మోయుచున్న యీ వర్తకుఁడు మా మణితో మాట్లాడుచుండుట చూచుచుండు నాకును నొక్కొకతఱి జంకు జనించునుగాని, నవ్వుచు మా కుఱ్ఱది వానితో సంభాషించుటచూచి మరల విస్రంభము కలుగుచుండెడిది.

కాబూలువాలా స్వదేశప్రయాణదినమునకు ముందొకనాఁటి ప్రొద్దుట నేను గదిలోఁగూర్చుండి, ముద్రింపఁబడిన నా నవల పుటలలోని తప్పులు దిద్దుకొనుచుంటిని. చలి యింకను వదలలేదు. సూర్యరశ్మి కిటికీద్వారా ప్రవేశించి నా మేనికి హాయి కలుగఁజేయుచుండె. నాలుగుగడియల ప్రొద్దెక్కినది. అరుణోదయకాలమునందే వాహ్యాళికై వెడలిన పాదచారులు మరల నింటికి వచ్చుచుండిరి. అంతలో వీధిలో నొక గోల వినఁబడినది. కిటికీలోనుండి చూడఁగా నిరువురు రక్షకభటులచేతను, వినోదమునకై గుంపుగుంపులైన బాలకులచేతను ననుగమ్యమానుఁడగు కాబూలువాలా కన్పడెను. వాని వస్త్రములు రక్తసిక్తములై యున్నవి. రక్షకభటునిచేతిలో నొక కత్తి యుండెను. వెంటనే వీధిలోనికిం బోతిని. వర్తకునకు గేస్తుఁడు కొంత ధనమీవలెననియు, దాని నడుగగా వాడు మాటలు మిగిలెననియు వర్తకుఁడు వానిం గత్తితోఁ గొట్టెననియుఁ దెలిసికొంటిని. వర్తకుఁడింకను నవతల వానిని బూతులు తిట్టుచునేయుండెను. ఈ సమయంబున మా పిల్ల దలవాటుచొప్పున గది వసారాలో నిలువంబడి "కాబూలువాలా, కాబూలువాలా" యని పిలచెను. వాడును శాంతవదనుఁడై బాలికవంకకుఁ జూచెను. వాఁడు వాని వీపుమీఁద సంచిలేకుంటచే "సంచిలో నేమున్న"దని యడుగక మామగారింటికిఁ బోవుచున్నావా! యని యడిగెను. వర్తకుఁడు నవ్వి "అమ్మాయీ! యిప్పుడు మామగారింటికే పోవుచున్నా"నని యెను. ఆ మాట బాలికకంత వినోదకరము కాకపోయెను. అతండును, "చేతు

లకు సంకెలలు దగిలించిరి గాని, లేనియెడ మామగారిని జావమోఁదుదు"ననియెను. తరువాత వానిపై "ఒక మనుజుని గత్తితో నఱికినాఁ"డని యభియోగము తేఁబడినది. కొన్ని సంవత్సరములు కారాగారవాసము విధించిరి.

పిదపఁ గొన్నియేండ్లు గడచినవి. మా పనులు మేము చేసికొనుచుంటిమి గాని యా వర్తకునిమాటయే మఱచితిమి. ఇచ్చవచ్చినట్లు కొండచరియలయందుండు నా వర్తకునకుఁ గారాగారవాసమెంత కష్టముగానుండునో యనుమాట నాకు స్ఫురింపలేదు "చంచలస్వభావురాలగు మా బాలికకూడఁ గ్రమక్రమముగా వర్తకునిమాట మఱచినది" అని మా చదువరులకుఁ దెలియఁజేయుటకు సిగ్గుపడుచున్నాను. ఆమె వయస్సు హెచ్చినకొలంది లాతికన్నెలతోనే వినోదించుచుండెను. తఱచుగ తండ్రినైన నా యొద్దకువచ్చుట సైతమామె మానినది.

ఈ విధముగాఁ గొన్నియేండ్లు దాటిన పిదప మా మణి పెండ్లియాడుకలదగుటచేఁ దగినవరుని గుదిర్చి యాశ్వయుజమాసములో వివాహముహూర్తము స్థిరపఱచి పెండ్లిప్రయత్నములు చేయసాగితిమి. పార్వతి హిమవంతుని గృహమునుండి శివునితోఁ గైలాసమున కేగినచందమున మా గృహచంద్రికయగు మణి యత్తింటికిఁబోయి పుట్టినిల్లు కటికచీఁకటిలో ముంచివేయుకాలము సమీపించినది.

ముహూర్తమాసన్నమయ్యెను. ఆ దినము శుభోదర్కమై కాన్పించెను. అంతకుమున్ను కురిసిన వానచేఁ జల్లఁబడిన గాలి నిర్మలముగా వీఁచుచుండె. ఆనాఁడు సూర్యకిరణములు మేలిమిబంగరు తీవలవలెనుండెను. వాని కాంతి కొంతసేపు కలకత్తాలోని చిన్న సందులలోనున్న యిండ్లకు బంగారుపూత పూసెను. సూర్యోదయమైనది మొదలు తౌర్యత్రికనాదములు మ్రోగుచుండెను. మంగళవాద్యములు మ్రోగినకొలంది నా గుండెలు కొట్టుకొనసాగె. కరుణారసభూయిష్ఠముగ భైరవిరాగములో సన్నాయి పాడినపుడు నాకుఁ బుత్త్రీవియోగక్లేశము హెచ్చుచుండెను. ఆనాటిరాత్రి వివాహముహూర్తము. ఉదయమునుండియు నిల్లు సందడిగానున్నది. ఒకమూలఁ దాటాకుపందిళ్లు వేయుచున్నారు. సంరంభమునకు మితిలేకున్నది. నా గదిలోఁ గూర్చుండి నేను కావలసిన సంభారములు, దగిన వ్యయమును బరిశీలించుకొనుచుండ హఠాత్తుగ నొకరు గదిలోఁ బ్రవేశించిరి. కన్నెత్తిచూడఁగా నతఁడు పూర్వపు గాబూలు వర్తకుఁడే, కాని రూపము మాఱియున్నది. ఒడలు సన్నగిల్లినది. నిడుదలైన తలవెంట్రుకలు లేవు. మొదట నేను గుర్తింపలేదుగాని వాఁడు

చిఱునవ్వు నవ్వినవెంటనే గుర్తించితిని. "నిన్న సాయంకాలమునందే చెఱసాల నుండి విముక్తుఁడనై వచ్చితి"నని యా వర్తకుఁడు చెప్పినమాటలు నాకుఁ గర్ణకఠోరములై యుండెను. నేనితరమనుష్యున కపాయముగావించినవారితో నెన్నఁడును మాటలాడి యెఱుంగను. ఇట్టి పాపాత్ముఁడుదయమునఁ గన్పించెఁగదా! యని వగచితిని. వానితోఁ బ్రశంసించుటకు నా మనస్సు చాల సిగ్గుపడెను. "నేఁడు మా యింట శుభకార్యము జరుగుచున్నది, నేనా తొందరలోనుంటిని. నీవు ఈపకడ రాలేవా' యని యడిగితిని. వాడును వెడలిపోవుచు "మీ బాలిక నొకసారి చూపింపరా!" యని యడిగెను. పాపమా వృద్ధుఁడు మా మణి యింకను బసిబిడ్డగానే యున్నదనుకొనియెఁ గాబోలు! కాబూలువాలా యని పిలుచుననుకొనియెఁ గాబోలు మున్నటివలెనే వేళాకోలము లాడుననుకొనియెఁ గాబోలు?

ఆ వర్తకుని చేతిలో నొక కాకితపు పొట్లమున్నది. వాడిప్పుడు వర్తకుఁడు కాకపోయినను మా మణికొఱకింకొకనియొద్ద కొన్ని బాదముకాయలు, కొన్ని ద్రాక్షపండ్లు తెచ్చెఁగాబోలు. "నేఁడు మాయింట శుభకార్యము. నాకు తీరిక లే"దని నేను చెప్పినతోడనే వాని మొగము ముకుళించెను. కొంతసేపు, నావంకకుఁజూచి, "బాబూ సలామ్" అని చెప్పి వెడలెను. నాకుఁ గొంత మోమోటముదయించి వానిని మరలఁ బిలువనంపవలెననుకొనుచుండఁగా నతఁడే మరల లోనికివచ్చి "బాబూ యీ పొట్లము మీ బాలికకిచ్చెదరా!" యని నా చేతికొసఁగెను.

దానిందీసికొని నేను కొంత సొమ్మీఁబోఁగా నతఁడు చేయిపట్టుకొని "బాబూ సొమ్ము వలదు, మీ దయకుఁ బాత్రుఁడను నన్ను మఱువకుఁడు, మీ బాలికవంటి బాలిక నాకు మా యింటఁ గలదు. దూరమందున్న నా పిల్లను స్మరించి నేను మీ పిల్లకీ యల్పవస్తువులొసంగితిని. లాభాపేక్షచే నీయలేదు" అని చెప్పెను.

ఇట్లు చెప్పి తన యంగీజేబునుండి యొక చిన్ని కాగిదపుముక్కను బైటికిఁ దీసి యది బల్లపైనుంచి ముడతలుతీరునట్లు సవరించెను. దానిమీఁద నొక బాలికహస్తము చిత్రింపఁబడియున్నది. అది ప్రతిరూపముకాదు. చిత్రము కాదు. చేయి, మసిలోనద్ది ముద్రించిన హస్తముద్ర. ప్రతియేట సరుకు లమ్ముకొనుటకై కలకత్తాకు వచ్చునప్పుడతఁడు తనకూతు హస్తముద్ర వేయించి తెచ్చుకొనుచుండునట. అదిచూచి నా నేత్రములనిండ కన్నీరునిండెను. నేనొక గ్రంథకర్తననియు, నతఁడు కాబూలుదేశపు వర్తకుఁడనియు నెచ్చుతగ్గు

మఱచితిని. ఈ గర్వమేటికి? వానికంటె నిందు నా యతిశయమేమున్నది? అందరము సంసారులమే. అపత్యప్రేమకలవారమే.

అతిదూరమునందున్న వర్తకునికూతురగు పార్వతి చేతిముద్ర, నన్ను నా కూతును స్మరింపఁజేసెను. వెంటనే యంతిపురికిఁ గబురుపంపితిని. కన్యక నన్య పురుషులయెదుటికిఁ బంపరాదని యంతఃపురకాంతలు ప్రతిషేధించినను రావించితిని. ఎఱ్ఱని పట్టుచీరకట్టించి మొగమున వివాహతిలకముంచి మనోహరమగు పెండ్లికూతురు వేసమలంకరించిన యా బాలికయుఁ దండ్రియెదుట సిగ్గుచేఁ దలవంచుకొని నిలుచుంబడెను. ఆ వేసమును, రూపమును, ప్రాయమును జూచి వర్తకుఁడు విస్మితుఁడై పూర్వస్నేహముఁ జూపించుటకు సాహసింపలేక తుట్టతుదకు, "అమ్మాయీ! మామగారింటికిఁ బోవుచున్నావా" అని చిఱునగవుతోఁ బల్కరించెను. నేఁడు మామగారిల్లనేదియో బాగుగఁ దెలిసినదగుటచే నా కన్యక బదులుచెప్పక తలవంచుకొనియే యుండెను.

మొదటిసారి వీరిరువురుకలసి మాటలాడినదినము నాకు స్మృతికిఁ దగిలి కొంత దుఃఖమును గలుగఁజేసెను. ఆ కన్య మరల నంతిపురికిఁ బోయినవెంటనే వర్తకుఁడు నిట్టూర్పు నిగిడించుచు నేలపైఁ జతికిలఁబడెను. దేశమువిడచి చిరకాలమగుటచే నాతఁడిట్లు తలపోసెను. "పార్వతికిఁగూడ యౌవనము వచ్చియుండును. నేను బోయిన నన్ను గుర్తింపలేదు. ఆమెతోఁ గ్రొత్తగాఁ బరిచయముచేసికోవలయును గాఁబోలు. రూపమందును, పరిమాణమందును జాల మార్పుఁగలుగును గాబోలు. ఎనిమిదివత్సరములైనది, అది యెట్లున్నదో" యని తలపోయుచు దీనాననుండై వర్తకుఁడు కూర్చుండెను. మేమును దూర్యధ్వనులు చెలరేఁగ సంతోషనిమగ్నులమై యుంటిమి.

పిదప నేనతని దీనావస్థఁజూచి తన కుమార్తెను జూచుటకై పరితపించుచున్నాఁడనియు స్వదేశమునకేగుటకై సొమ్ములేకున్నాఁడనియుఁ దెలిసికొని యొక ధనపత్రముఁదెచ్చి యతనిచేతికిచ్చి "నీవు శీఘ్రముగా మీ దేశమునకేఁగి మీ పిల్లను, భార్యనుజూచి సంతోషింపుము. మీరందరు సుఖంబుననుందురుగాక" అని చెప్పి యతనికి సెలవిచ్చి పంపితిని.

ఆ వర్తకునకుఁ గొంత సొమ్మిచ్చుటవలన నేను జేయఁదలచిన వివాహవ్యయము కొంత తగ్గింపవలసివచ్చెను విద్యుద్దీపములు, నాంగ్లేయవాద్యములు మొదలగు కొన్ని వ్యయములు తగ్గించినందుల కాడువాండ్రకు నాపైఁ గొంత కోపము వచ్చెనుగాని, యది లెక్కింపక, చిరకాల వియోగముచేఁ గృశించుచున్న తండ్రి కూతుండ్రకు పరస్పర సమాగమముఁ గలుగఁజేసితినిగదా యని

యానందముతో నేఁజేసిన నా కూఁతు వివాహము నాకు మఱింత సంతోషకరముగా నేయుండెను.

## 2. జన్మస్థానమునకు తిరిగిపోవుట.

చక్రవర్తికులమునఁ బొడమిన "పటీకు"డను బాలకుఁడు తన గ్రామమందున్న బాలురకెందఱకును నాయకుఁడు. అతనికిఁ బ్రతిదినమును క్రొత్తక్రొత్త యల్లరులు పిల్లలచేఁ జేయింపవలయుననియే సంకల్పము. పడవ తెరచాపకొయ్యకొరకుపయోగింపఁదగిన దూలమొకటి యొకచోటఁ బడియుండెను. దాని నక్కడనుండి బురదలోనికి దొర్లింపవలయునని బుద్ధిపుట్టి యతఁడొకనాఁడు పదిమంది పిల్లలను బ్రోవుచేసెను. ఈ దూలము దొరలించిన యజమానునకుఁ గోపమును, నాశ్చర్యమును గలుగుననియు, నదిచూచి మనము వినోదింపుదమనియు నందఱికి నుపదేశించెను. వారందఱును పటీకుని బుద్ధిచాతుర్యమునకు సంతోషించిరి.

ఈ క్రీడాకాలమునకు నారంభమగు సమయంబున "పటీకు"ని తమ్ముఁడు మాఘుఁడు మెలమెల్లగ నడచివచ్చి మాటాడకుండ నా దారువుమీఁదఁ గూర్చుండెను. బాలురందఱును సందేహించిరి. అందొకఁడుమాత్రము దూలమునుండి దిగుమని త్రోసెను గాని మాఘుఁడు లక్ష్యపెట్టనియట్లు కదలక కూర్చుండెను. "ఈ వినోదములు వ్యర్థము"లని తలపోయు జ్ఞానివలెఁ గదలక కూర్చున్న తమ్మునిం జూచి పటీకుఁడు క్రుద్ధుఁడై "నీవు జాగుసేయక దిగెదవా లేదా! దిగకున్నఁ దన్నెదను" అని యఱచెను. మాఘుఁడా దూలముమీఁదనే కొంత దూరము జరిగి మఱియొకచోటఁ గూర్చుండెను. బాలురయెదుటఁ దన పెద్దతనముఁ గనఁబఱచుటకై తన ప్రతిన నెఱవేర్చుకొనుటకై తగిన యుపాయము తోఁచక కొంతతడవాలోచించి తుదకు దూలము దొరలింపకూరకుండుట తన కప్రతిష్ఠయని యూహించి, మీఁదనున్న మాఘునితోఁ గూడఁ గొయ్య దొరలింపుఁడని బాలురకానతియొసఁగెను. మాఘుండును దూలమునుండి లేచినచో నాత్మగౌరవమునకు లోపము వచ్చునని కదలక బిగిసి కూర్చుండెను. కాని తన పట్టుదలవలన ననర్థము సంభవించునని యా మాఘునకుఁ దెలియలేదు. "నశ్వరమగు ప్రతిష్ఠ నపేక్షించి లోకములోఁ గొందఱిట్లే యాపదలపాలగుదురు."

బాలురు తమ శక్తులకొలంది దూలము దొరలించిరి. మాఘుని పట్టుదలతోడను, నాత్మగౌరవముతోడను దూలము దొరలిపోయెను. తక్కిన బాలకు

లందఱును గొంతులు బొంగురుపోవునట్లఱచిరి. పటీకుఁడుమాత్రము కొంచెము జడియుచుండెను. ముందు రాఁబోవునదియు నతఁడు గ్రహించెను. గ్రహించినట్లుగనే మాఘుఁడతి వేగమునఁ గోపముచే నొడలుతెలియకుండ, గర్జించుచు నేలనుండి లేచి యన్నమీఁదికి దుమికి మొగము రక్కి తన్ని యింటికేడ్చుచుఁ బోయెను. నాటకములో ప్రథమాంక మింతతో ముగిసెను.

తమ్మునిచే దెబ్బలుతిన్న పటీకుఁడు మొగముఁ దుడిచికొని బురదలో మునిఁగియున్న యొక చిన్న నావయంచుమీఁద గడ్డిపోఁచ యొకటి నమలుచుఁ గూర్చుండెను. రేవుపడవనుండి కొందఱు మనుజులు దిగిరి. వారిలో నరసిన తల వెంట్రుకలును, నల్లని మీసములునుగల యొక యేబదియేండ్లుగల పెద్ద మనుష్యుఁడు నావమీఁద నేదియో యాలోచించుచు గడ్డిపోఁచ నమలుచుఁ గూర్చున్న పిల్లవానింజూచి "కుట్టివాఁడా చక్రవర్తులవారి యిల్లేదరా" యని యడిగెను. పటీకుఁడును గడ్డిపోఁచ నమలుట మానకుండఁగనే నిర్లక్ష్యభావముతో "ఆ వైపుననున్నది" అని జవాబు చెప్పెనుగాని అది యే వైపో మాత్రము వ్రేలఁజూపలేదు. ఆ పరదేశియు దెలియక మరల నడిగెను. అతఁడు యథాప్రకారముగనే "పోయి కనుఁగొమ్ము" అనియెను.

ఈ నడుమ నొక పరిచారకుఁడువచ్చి "పటీకా! మీయమ్మ నిన్ను రమ్మన్న"దని పిలువఁగా నతఁడు రాననియెను. సేవకుఁడును సమయోచితముగఁ దర్జించి గట్టిగాఁ బట్టుకొనియెను. వాఁడును గాళ్లచేఁ దన్నుచుఁ దన్నుకొనుచు వదలిపించుకొనిపోవుటకెంత ప్రయత్నించినను సేవకుఁడుమాత్రము వానిని వదలకింటికి లాగికొనిపోయెను.

పటీకుని తల్లియు వానింజూచి, "ఓరీ పటీకా! మరలఁ దమ్మునిఁగొట్టుట మొదలిడితివా" యని కోపపడెను. "నేను కొట్టలేను. నీకెవ్వరుచెప్పిరి. ఇది కేవలమబద్ధము" అని గద్దరించుచున్న పెద్దకొడుకును బెదరించుచు, "నీవనృతమాడకుము. నాకుఁ దెలిసినది. నీవు కొట్టితివి" అని బిగ్గరగాఁ గూకలిడెను. పటీకుండును "నేను కొట్టలేదు. నిజము మాఘునివలననే తెలిపించుకొనుము" అని గద్గదస్వరముతో బదులుచెప్పెను. మాఘుండును కొట్టినమాట నిజమే నిజమేయని ఋజువుపడినంతట మాఘునిమీఁదంబడి పిడుగుమొత్తినట్లు మొత్తి "యసత్యమాడినందులకు నీకిదే శిక్ష" యని యఱచెను తల్లియు మాఘుపక్షపాతిరాలై వారిరువురి పోరాటమును మానిపించెను. పటీకుండును దల్లిని సైతము లెక్కింపక వెనుకకుఁ ద్రోసివైచి మరల మాఘునిమీదం బడఁబోవ, "నన్నే కొట్టెదవటరా యని యెలుగెత్తి తిట్టుచుండు సమయమునందే యా

ముదుసలి పరదేశి యింటికివచ్చి యెందులకీ గందరగోళము" అని యడిగినంతటఁ బటీకుండు దృష్టపూర్వుండగు నా ముదుసలిం జూచి సిగ్గుపడి తెల్లఁబోయెను.

పటీకుని తల్లియు వెంటనే లోనికిం బోయి తలుపుసందుననుండి యా పరపురుషునివంకకుఁ బరిశీలనాపూర్వకముగఁ జూచి తన యన్నయని గుర్తింపఁ గలిగెను. గుర్తించిన వెంటనే "అన్నా! ఎన్నాళ్లకుఁ గన్పడితివి? ఎందుండివచ్చితివి" అని యడుగుచు నతని పాదములకు సాష్టాంగమెఱఁగెను. ఈ సోదరుఁడీమె వివాహమయిన కొలఁదికాలములోనే జన్మభూమినివదలి బొంబాయిలో వ్యాపారముఁ జేయుటకై వెడలిపోయెను. నేటివఱకు నడుమ నెన్నఁడును రాలేదు. ఈమె కాపురమునకు వెళ్లుట, యిరువురు కుమారులు జనించుట, వైధవ్యము తటస్థించుటయు, నీ మధ్యకాలమునందే జరిగెనుగాని యవి యేవియు నీ బిషాంబరుఁ డెఱుఁగఁడు. బొంబాయివిడచి యితఁడు కలకత్తాకు వచ్చినవెంటనే తన చెల్లెలిందున్నదని తెలిసికొని చూచుటకై యేతెంచెను.

ఈ సోదరీసోదరులు సమావేశమైన పిదప నా యూరునందే సుఖముగాఁ గొన్నిదినములు గడచినవి. పదంపడి యొకనాఁడా బిషాంబరుఁడు చెల్లెలితో మేనయల్లుర విద్యావిషయమై కొంత ప్రశ్నించి వారిని చదివించుట మిగులఁ గష్టతరముగానున్నదని యామెవలన నెఱింగి పెద్దవాఁడు మందుఁడనియు, మూర్ఖుఁడనియు, స్వచ్ఛందచారియనియు, రెండవవాఁడు బుద్ధిమంతుఁడనియు, సౌమ్యుఁడనియు, వినయవంతుఁడనియుఁ దెలిసికొని తల్లికిఁ గొంత శ్రమ నివారణయగుననియు శిక్షించి తాను విద్యచెప్పింపఁ దలఁచియుఁ దనవెంటఁ బటీకునిఁ గలకత్తాకుఁ గొంపోయెను. పటీకుని తల్లియు నందుల కంగీకరించి మేనమామవెంబడి వానిని పంపించెను. కలకత్తా ప్రయాణమప్పుడు పటీకునకును బరమానందకరముగానుండెను. ప్రతిదిన మల్లరిచేయుచుఁ బెక్కుతంటాలుతెచ్చుచున్న యా పటీకుని ప్రయాణము తల్లికిని గొంత చిత్తశాంతిని గలుగఁజేసెను. అన్నదమ్ములకా సౌభ్రాత్రములేదు. తల్లియు మాఘుని నదిలో ముంచునో! తలఁ బగులఁగొట్టునో! ప్రాణాపాయకరమగు మఱియొకపని యేమి చేయునో! యని సర్వకాలములందు బెదరుచుఁ బటీకునియెడల సందేహించుచు నుండుటంజేసి మొట్టమొదట కొంచెము సంతసముఁ జెందెనేకాని తరువాత కొంచెము దుఃఖమును జెందకపోలేదు.

మేనమామతోఁ దాను కలకత్తాకుఁబోవుట నిశ్చితమైనపిదపఁ బటీకుఁ డమితానందముఁజెంది మామా! ఎప్పుడు ప్రయాణమని యడుగుచు నుత్కంఠపడుచు ముండ్లమీఁద నున్నట్లుండెనుగాని యది శాశ్వతసుఖముఁ గలుగఁజేయ

దనిమాత్ర మెఱుంగఁడు. ప్రయాణమగుచుఁ దాఁదాఁచుకొన్న గేలములు, గాలిపటములు, గోలీలు, బొంగరములు మొదలగునవి తమ్మునకిచ్చివైచెను. తమ్ముని యెడల మితిలేని ప్రేమయును జూపించెను.

మేనమామ మేనల్లులిద్దరును గలకత్తాచేరిరి. మేనత్త యీ పటీకుని నిదివరకెన్నఁడు చూచియుండనిదగుటచేఁ గొన్ని దినములు దయతోఁ జూచెను గాని తరువాతమాత్రము సంసారమునకుఁ గలిగిన యీ నూతనభారము సహింపలేక విసుగుకొనుచుండెను. తన ముగ్గురు పిల్లలకు సంరక్షణచేయుటే యామెకు భారముయినప్పుడు పైఁ బిల్లవాని కింకొకనికిగూడ సంరక్షణచేయుట భారము కాకయుండునా! అదియునుంగాక యీ పటీకుఁడు జానపదుఁడుగాని పౌరుఁడు కాడు. పల్లెటూరివాండ్ర యలవాటులు వేఱు, పట్టనస్థుల యలవాటులు వేఱు. ఇట్టి పిల్లవానిని బోషించుట యామె మనస్సునకుఁ గష్టముగానే యుండెను. బిషాంబరుఁడీవిషయములన్నియుఁ జుట్టనుదట నాలోచింపకుండుటయే మొదటి లోపము.

ఈ మనుష్య ప్రపంచమునం బదినాల్గు పదియేనుసంవత్సరముల ప్రాయము గల బాలుని యవస్థకంటె కష్టతరమగు నవస్థలేదు. శిశువువలెఁ బ్రేమాస్పదుఁడు కాడు. పెద్దవానివలె నుపయుక్తుడును గాడు. బాలునివలె నవ్యక్తాలాపములాడిన "నింకను జిన్నతనమేనా!" యని పరిహసింతురు. సువ్యక్తాలాపములాడినచో "అప్పుడే పెద్దమాటలు ప్రారంభించితివా!" యని ధిక్కరించి యవినీతుఁడందురు. అతఁడెట్లు మాటలాడినను నితరులకు ననూయయే జనించుచుండును. చిన్నవాఁటితప్పులు సహించినట్లు ప్రమాదకృతములగు తప్పులను సైతము సహింపరు. చిన్ననాటి గుస్తులా! పనికిరావు. స్వరము కొంత మార్దవమునుదప్పి పరుషమైయుండును. కోణములుతేలిన మొగము వికారములను సూచించుచుండును. స్వాభిమానముదయించును. తనకంటెఁ బెద్దవారితో మాటలాడుటకుఁ బ్రాగల్భ్యంబును వ్రీడయుఁగూడ జనించుచుండును. మన పటీకుఁడిప్పుడిట్టి యవస్థయందే యుండెను.

బాలకులీదృశతరుణావస్థయందే యన్యుల యాదరమును, ననురాగమును, బ్రేమమును గోరుచుందురు. తనయెడల నాదరముఁ జూపువారియెడల భక్తి చూపించును. వారికి సేవచేయును గాని యది లాలనముగాఁ బరిణమించుననియు లాలనమువలనఁ బిల్లలు చెడిపోదురనియు నట్టివారి నెవ్వరును బ్రేమింపరు. తిట్లతోడను, దర్జనభర్జనములతోడను యజమానుఁడులేని కుక్కవలె వాఁడు కాలము గడుపదగిన యీ యీడుబాలురకు స్వగృహనివాసమే సంతోష

కరముగాని పరస్పృహోవాసము సంతోషదాయకముకాదు. స్త్రీల దయా వీక్షణమునకుఁ బాత్రమై వారిచే నవమానింపఁబడకుండుటయే యానందమునకును, సంతోషమునకును బరమావధి. తన మేనమామయింట మేనత్తచేఁ దృణీకరింపఁ బడుచుఁ బరిభవింపఁదగిన సమయమందెల్లఁ బరిభవింపఁబడుచు భృత్యునికంటె నధముఁడుగానుండుట పటీకునకెంతో కష్టముగానుండెను. మేనయత్త యేదేనిఁ బనిచెప్పినప్పు డంతకంటె నెక్కువగా నా పనియందు మెప్పుకనపఱుప "చదువు మానుకొని నిన్నువరింత కష్టపడుమని"రని మందలించుటయుఁ దక్కువగాఁ జేసినయెడల నింత తెలివితక్కువవాడవని యెఱుఁగనని చీవాట్లుపెట్టుటయు సంభవించుచుండునేగాని మేనత్తవలన నతఁడెన్నఁడును మెప్పునఁ డయలేడయ్యె.

ఇట్లు వాఁడా మేనమామయింట స్వాతంత్ర్య మిసుమంతయు లేక యూఁపిరాడనట్లుండి నిర్మలవాయువులు వీచుప్రదేశమునకుఁ బోఁదలంచు చుండెఁగాని కలకత్తాపురమున వానికట్టి ప్రదేశమే కఱవయ్యె. నలువైపుల విశాలప్రదేశములతో నిండియున్న తన జన్మస్థానమగు జనపదమునకుఁ బోఁదలఁచి నిద్రయందుఁ దన యూరును తన యిల్లును బలవరించుచుండెను. పూర్వము గాలిపటములెగఱవైచిన రమ్యమగు శాద్వలప్రదేశములును, గోలీకాయ లాడు కొనిన నదీతటప్రదేశంబులును నిచ్చనచ్చినట్లు మునిఁగి యీఁదులాడిన చిన్న యేటికాలువను స్మరించుచు నిరంకుశాధికారివలెఁ బరిపాలించిన బాల్యమిత్ర సంఘమును దలంచుచుండెను.

తనయందు నిష్కారణద్వేషము సహించి మేనమామగారియింటికిఁ బంపిం చిన తల్లిని వాఁడు స్మరింపని గడియయేలేదు. తిర్యగ్జంతువులకు సైతము తమ నివాసస్థానమందు ప్రేమయుండక మానదు. ప్రేమించిన జనులయొద్ద నుండ వలెనను కుతూహలముండకపోదు. మనుష్యమాత్రుఁడయిన పటీకునకుఁ దన తల్లియందును దన జన్మస్థానమందును ప్రేమయుండుటకేమి యబ్బురము? కాని సర్వజనప్రకృతిసిద్ధమైన యీ ప్రేమ భయస్వభావుండును, ధైర్య హీనుండును, కృశాంగుండును, రూపహీనుండునునగు పటీకునకుమాత్రము మన స్సంక్షోభముఁ గలుగఁ జేసెను. ఆ సంక్షోభమెట్టిదో యతని హృదయమునకే యెఱుక. అది వాని హృదయమును సర్వదా శుష్కింపఁ జేయసాగెను.

బడిపిల్లలందఱిలోపలను పటీకునకంటె మందబుద్ధికలవాఁడు లేడు. గురు వేదేని ప్రశ్నమడిగినప్పుడు నోరుతెఱచి యూరకుండును. శక్తికిమించిన బరువుమోయు గాడిదవలె నెన్ని దెబ్బలకయినను వీఁపిచ్చును.

ఇతర బాలకులు వ్యాయామమునకై పురోద్యానములవంకకుఁ బోయి నప్పుడు తానుగూడఁ బోక యింటికప్పులను గంటిఱెప్ప వేయకుండఁ జూచుచు శూన్యహృదయుఁడై యుండును.

ఇట్లు కొంతకాలమతిగిన పిదప నొకనాఁడు ధైర్యముఁదెచ్చుకొని మేన మామయొద్దకువచ్చి, "మామా! నన్ను మా యింటికొకసారి పంపవా!" యని యడిగెను. "బడికి సెలవులిచ్చువరకాగుము, తరువాతఁ బంపెదను" అని మామ బదులు చెప్పెను. "సెలవు లాశ్వయుజమాసమువరకు రావుకదా! అంత దనుక పంపవా?" అని మరల పటీకుఁడడిగెను గాని యంతవరకు నిరీక్షింపక తప్పినది కాదు.

ఒకనాఁడు పటీకుని పాఠపుస్తకము పోయెను. పుస్తకమున్నప్పుడే వానికి పాఠములువచ్చుట కష్టముఁ; పుస్తకముపోయినపు డడుగవలసినదే మున్నది! పుస్తకము పోయినదని చెప్పిన నింటిదగ్గఱ చీవాట్లు. నిత్యము పంతులుగారి దెబ్బలు తప్పవు. ఈ రీతి వానిగతి యతి శోచనీయముగానుండె. మేనమామకొడుకులుగూడ వీనిని మేనత్తకొడుకని చెప్పుకొనుటకు సిగ్గుపడుచుండిరి. ఇతర బాలురకంటె వీరే యెక్కువగా బరిహాసించి యవమానించుచుండిరి. ఇట్లు కొన్నిదినములు గడచినపిదప "నా పుస్తకము పోయిన"దని మేనత్తతోఁ జెప్పెను. "ఓరీ! పల్లెటూరి గాడ్దా ఈ పట్టనములో నింతమందిని బోషించుకొనుటే నాకు దుర్భరముగానున్నది, నీకు నెలకైదుసార్లు పుస్తకములు కూడ నెక్కడఁ గొనియియ్య గలమురా?" అని తిరస్కారపూర్వకముగాఁ దర్జించెను.

సాయంకాలమగువఱకుఁ బటీకునకుఁ జలి, జ్వరము, కంపము, తలనొప్పి యునచ్చి బాధపెట్టఁదొడఁగె. తానక్కడఁ జబ్బుపడినయెడల మేనత్త మఱింత విసుగుకొనునను చింతకూడ బాధకుఁ దోడయ్యెను.

మఱునాఁడుదయమున బ్రాంతప్రదేశములయం దెంతివెదకినను బటీకుఁడు కానరాఁడయ్యె. పటీకునకు జ్వరమువచ్చిన రాత్రియంతయు వర్షధారలచే నిండియుండుటచే వానిని వెదుకఁబోయినవారందఱుఁ దడిసిరి.

మఱునాఁడిరువురు పోలీసుబంట్రోతులు పటీకుని వెంటఁబెట్టుకొని బీతాంబరునింటికి వచ్చిరి. తడిసినబట్టలను జ్వరముచే నెఱ్ఱఁబడిన కన్నులయుఁ జలిచే గజగజవణకుచున్న శరీరమునుగల మేనయల్లునిఁ జూచి చేతులచే నెత్తికొని బీతాంబరుఁడు తన భార్యకుఁజూపిన నామె "మొదటనుండియు వీనివలన మనకు శ్రమయే యధికమగుచున్నది, వీని నింటికిఁ బంపివేయఁగూడదా?"

యని యఱచెను. పటీకుండును "మామా! నేనింటికిఁ బోవుచుండఁగా మీరు బలాత్కృతిగా నన్ను మరలించి"రని యేడువసాగెను.

ఆ రాత్రికి జ్వరము మఱింత హెచ్చెను. భ్రాంతచిత్తుఁడై సంధి యెత్తినట్లు పలవరింపసాగెను. వైద్యులను రప్పించిరి. జ్వరముచే నెఱ్ఱఁబాఱిన నేత్రములతోఁ జాందినివంకఁ జూచుచు "మామా! సెలవులు వచ్చినవా?" యని పలవరించుచున్న మేనయల్లునిఁ జూచి బిషాంబరుఁడు కన్నీరు కాల్వలుగట్టఁ దుడిచికొనుచు జ్వరముచేఁ గ్రాగుచున్న వాని శరీరమును కౌగలించుకొని యా రాత్రి యంతయు వాని మంచముమీఁదనే కూర్చుండెను. "అమ్మా! నేను చెప్పుచున్నది నిజమే. నన్నుఁ గొట్టకుము తల్లీ!" అని పలవరింపసాగెను.

మరునాఁ డుదయమగువఱకు జ్వరము కొంత తగ్గెనుగాని ఎవరి రాకనో ప్రతీక్షించుచున్నట్లు ఎవరితోడనో మాటలాడుచున్నట్లు కన్నులట్టిటు త్రిప్పుచు నాశాభంగముచెందినవానివలె నొరగు ముండామీఁద శిథిలావయవములతోఁ జేర్గ బడియున్న పటీకుని హృదయమునందలి తలంపులన్నియు బిషాంబరుండు గుర్తించి పటీకా! మీ యమ్మకొఱకు వర్తమానము పంపితిని అని చెప్పెను.

ఆ దినము గడచెను. వైద్యుఁడుమాత్రము పటీకుని ప్రాణస్థితినిగుఱించి నమ్మకము లేదనియెను. పటీకుండును "మానసూత్రముతో నాలుగుబారలు." "మానసూత్రముతో మూఁడుబారలు" అని యఱవ మొదలిడెను. చిన్నతనంబునఁ బొగయోడమీఁదఁ బోవుచు నావికుఁడు నదిలోతు గొలుచుచు వేసిన కేకలు స్మృతికిఁదగిలి నేఁడవి పలవరించుచున్నట్లు సంసారసాగరము లోతు కొలువసాగెను.

వాఁడు మఱికొంతసేపునకు సుడిగాలివలె వాని తల్లి గదిలోఁబడి నా ముద్దుబిడ్డా! నా ముద్దులకొడుకా! యని బిగ్గరగా నేడువసాగెను. బిషాంబరుఁడెంత ప్రయత్నించినను నామె దుఃఖసాగరముపోటు నాఁపలేకపోయెను. పటీకుండును తల్లినిగుర్తించి "అమ్మా వచ్చితివా" యనెను. తల్లియు "నాయనా! వచ్చితినిరా కొడుకా! వచ్చితినిరా" యని బిట్టురోదనముచేయఁగాఁ బటీకుండామె వంకకుఁజూచుచు నొత్తిగిలి బహుహీనస్వరముతో "అమ్మా నాకు సెలవుదినములు వచ్చినవి నేను పోవుచున్నాననియెను."

## అర్థములు.

క్రీడాకౌతుకము = ఆటయందు ఉత్సాహము.
ప్రతిన = ప్రతిజ్ఞ.

నశ్వరము = అస్థిరము.
ప్రేమాస్పదుడు = ప్రేమ + అస్పదుడు.
శాద్వల = పచ్చికబయలు.
కృశాంగుడు = (కృశ + అంగ)—చిక్కిన శరీరముకలవాడు.

## 3. పూర్వమొక రాజుండెను.

పూర్వకాలంబునందొక రాజుండెను! మాకుఁ జిన్నతనంబునం దుబుసు పోకకై విను కల్పితకథలయందు "ఒక రాజు" అని వినుటయే యవసరమని గాని యా రాజు శిలాదిత్యుఁడో, శాలివాహనుఁడో, యతఁడుండునది కాశియో లేక కాన్యకుబ్జమో యడిగితెలిసికొనుటంత యవసరముకాద నియు నట్లడుగుట వ్యర్థమనియుఁ దోఁచుచుండెడిది. బాలుర హృదయము లను సంతోషమునం దోలలాడించునది. "అనఁగనఁగ నొక రాజు" అన్న మాటయేకాని యితర సంగతులు కావనుట సిద్ధాంతము.

ఈ కాలమునందలి చదువరులుమాత్రము కథ వినుటకై మొదలిడునపుడు యథార్థమెఱుంగఁగోరి "కథ సత్యమా! అసత్యమా!" అని సందియపడుదురు. ఆ సంశయాంధకార మాపరించిన వెంటనే యా పుక్కిటిపురాణములయందలి సత్యాసత్యములను దెలియుటకై తమ తెలివి యుపయోగించి "ఆ రాజెవరు" అని ప్రశ్నింతురు. ఇప్పటి కథకులుకూడఁ జదువరుల యూహాల కను కూలముగానే కథలయం దిప్పుడెగ్గులు లేకుండ నపరిమిత పాండిత్యమున్న వారివలె "అనఁగనఁగ నొక రాజు" అనియే మొదలిడక "అజాతశత్రువు అను పేరుగల యొక రాజు" అని కథ ప్రారంభింతురుగాని చదువరుల బుద్ధియు నంతతోఁ దనివిచెందక "ఏ యజాతశత్రువు" అని కథకునివంకకుఁ బుల్కు పుల్కునఁ జూచుచుఁ బ్రశ్నింపకమానదు.

మా చిన్నతనంబున మేము విన్న కల్పితకథలవలనఁ బ్రకృతియందలి రమ్యావస్తువులనన్నింటిని గ్రహింపఁగలిగితిమి. ఆ కథలయందలి మాధు ర్యమును జవిమాడఁగలిగితిమి. కథాతత్వమునందే మాకాదరముండెడిది కాని కథలోవచ్చు రాజులయు, మనుష్యులయు, ప్రదేశములయు నామములు వినుటయం దభిలాష యుండెడిదికాదు. ప్రపంచమునందలి మంచిచెడ్డ లెఱుంగని బాలకుల హృదయములుమాత్రము కావలసిన తత్వము గ్రహించుట

యందే యుత్సాహపడునుగాని యితర విషయములకుఁ బోవు. ఇప్పటి బాలురదియేమో కాని పొల్లుమాటలతో నింపఁబడిన సంగతులు వినుటకే యభి లాషపడుచుందురు.

కలకత్తాలో నా బాల్యమున నాకుఁ గల్పనాకథ లెప్పుడు చెప్పఁ బ్రారంభించిరో యా సాయంకాల మిప్పటికిని గన్నులకుఁ గట్టినట్లున్నది. ఒకనాడు ప్రాతఃకాలమందు వర్షము ప్రారంభమై విరామములేకుండ సుడిగాలివిసరి జడివాన కురియ నారంభించినది. పట్టనమంతయు జలమయమైనది. మా వీధిలో మోకాలిబంటినీరు ప్రవహింపఁజొచ్చినది. ప్రతిదినము నాకుఁ జదువు చెప్పుటకై యుపాధ్యాయుఁడువచ్చు సమయమదే కనుక నానాఁ డుపాధ్యా యుఁడు రాలేదుకదా! యని నాకుఁ గొంత సంతసము కలిగినదికాని వర్షములోనే వచ్చునేమో! యని నా గుండెలు దడదడ కొట్టుకొనసాగినవి. వీధివైపు వసారాలో నొకమూలఁ గూర్చుండి ప్రతినిమిషము వాన యెచ్చుచున్నదో, తగ్గుచున్నదో పరిశీలించుచు వాన తగ్గినప్పుడు "ఓ భగవంతుఁడా! నన్ను గురువు గారి బెత్తపుదెబ్బల కప్పగించెదవా! ఏడుగంటలన్నరవఱ కీలాగుననే వర్షముఁ గురిపింపవా!" అని ప్రార్థించుచుంటిని కలకత్తాలో నొక సందులో నొక మూలనున్న యొక బాలకున కుపాధ్యాయునివలని బెత్తపుదెబ్బలు తప్పిం చుటయే యీ వాన కుపయోగమనుకుంటినిగాని ప్రకృతి ననుసరించి లోకోప కారార్థ మీ వాన కురియుచున్నదని నే తలంపలేదు. వాన వెలియకుండుటకుఁ గూడ నేను చేసిన భగవత్ప్రార్థనయే హేతువనుకొంటిని. వాన వెలియలేదు, నా కడుపులో దడయు వదలలేదు.

ప్రతిదినమందు నొక నిమిషమైనను వేళతప్పకవచ్చు మా యుపాధ్యా యుఁ డాదినమందును రా మానలేదు. వర్షమువంకఁ జూచుచున్న నాకు మా గురువుగారి గొడుగు వీధిమొగలోఁ గన్పించినది; నా కడుపులో తాయి పడినది. నా హృదయము శిథిలమైనది నా యాశ కూలిపోయినది. మన మరణానంతర ముత్తరజన్మమనుచు నొకటుండి యందుఁ బూర్వజన్మకృతములగు పాపములకుఁ దగిన ఫలమనుభవించుటయే నిజమైన యెడల నింకొక జన్మమున మా గురువు నేనై నేను గురువై జన్మించెదము.

ఇట్లు గురువుగారి గొడుగు కన్పించిన వెంటనే పఱుగుపఱుగున నొక్క్రాం జంలో మా అమ్మ గదిలోవచ్చి పడితిని. ఆ సమయంబున మా యమ్మయు మా యమ్మమ్మయు నొండొరులకెదురుగాఁ గూర్చుండి దీపపువెలుఁగునఁ జీట్లపేక

యాడుకొనుచుండిరి. నేనును మా యమ్మకు దగ్గరనున్న మంచముమీఁదఁ బరుండి అమ్మా! పంతులు వచ్చినాడు, నాకుఁ దలనొప్పి యెక్కువగా వచ్చినది. ఈ యొక్కనాడు చదువు మానఁగూడదా! మానిపింపవా! అని యడిగితిని.

వివేకమురాని యే బాలకునిచేతను నిట్టివంటి కథ చదివింపరాదనియు బాలకులు చదువు పుస్తకములలో నీ కథ చేర్చరాదనియు నా తలంపు ఏలయః నేను నాఁడు చేసినపని చాల తప్పుపని. దానికిఁ దగినశిక్ష నేను పొందలేదు నేను చేసిన దురూహలు, దుష్టప్రయత్నములు సఫలములైనవి.

తరువాత మా జననియు పాఠము మానుటకుఁ దగినంత తలనొప్పి నాకు రాలేదని యెఱిఁగియు భృత్యునిం బిలిచి "ఓరీ! నీవు పోయి పంతులుతో నేఁడు పిల్లవానికిఁ బాగముఁ జెప్పనక్కఱలేదు అని చెప్పుమురా" అని కబురు పంపించి యామెమాత్రము యథాప్రకారము మాడుకొనుచునే యుండెనుగాని నా మాట నిజమో! అబద్ధమోయని విచారింపలేదు. నేనును పఱుపుమీఁద బోరగిలఁబడి కడుపుబ్బునట్లు నవ్వితిని. నాకు మా యమ్మ యశ్రద్ధయు నా మెకు నా కొంటెతనమును బయలుపడినవి.

లేనివ్యాధి ఉన్నట్లు నటించుట యేడేండ్లప్రాయముగల బాలునకెంత కష్టమో యుండఱకుఁ దెలిసినదే పిదప నింకొక నిమిషమునను మా యమ్మమ్మ యొద్దకువచ్చి నాకేదేని కథ యొకటి చెప్పవమ్మా! యని పెక్కుసార్లడిగితిని మా మాతామహియు నా మాటలు వినుపించుకొనలేదు. చీట్లాట మానలేదు తుదకు మాయమ్మ "అబ్బాయీ విసిగింపకుము. ఆట పూర్తిగాఁ గానిమ్ము" అని కసిరికొట్టగా నేనును "అమ్మా! ఆట రేపాడవచ్చును. అమ్మమ్మతో కథ చెప్పుమని చెప్పవే" అని బలవంతిపెట్టితిని. తుదకు మాయమ్మయుఁ జేక ముక్కలు క్రిందపాఱవైచి నేను వానిని నిరోధింపలేను అమ్మా! వానికొక కథ కావలయునఁట చెప్పుమని తన తల్లితో జెప్పెను.

మా అమ్మయు నిప్పగిది నాకు సంధీయఁగానే నేను మా ముసలమ్మ యొద్దకుఁ జనుదెంచి గంతులువైచుచుఁ జేయిపట్టుకొని, "రా అమ్మమ్మా! నాకుఁ గథ చెప్పుము" అని మంచముమీఁదికి లాగికొనివచ్చి కూర్చుండఁబెట్టి, పందిరి స్తంభము రెండుచేతులతో పట్టుకొని అట్టిటు దుముకుచుఁ గొంతవరకు సంతోషమునకుఁ దగిన బాల్యచేష్టలు గావించినపిదప "అమ్మమ్మా! కథ మొదలిడుము" అని అడిగితిని. ఆమెయుఁ గథ యిట్లు చెప్ప నారంభించెను.

"అనఁగనఁగా నొక రాజు. ఆ రాజునకొక భార్యకలదు." సామాన్యముగా గల్పితకథలలో నొకరాజున కనేకభార్యలు కలరు అని చెప్పుచుందురు. ఒకనికిద్దరు భార్యలున్నారని వినినతోడనే మన హృదయములు విచారములోఁ గ్రుంగును. ఇరువురు భార్యలుండిన నొకతె విచారగ్రస్తురాలు కాకతప్పదు. ఆ రాజున కొక్కతెయే భార్యయగుటచే మా అమ్మమ్మ చెప్పినకథలో నీ యపాయముమాత్రము తప్పినది. తరువాత మా అమ్మమ్మ. "ఆ రాజు పుత్రసంతానములేక మిగుల విచారింపఁదొడఁగెను" అని చెప్పెను. ఏడేండ్ల వయసుకల నాకు పుత్రసంతానము లేనిచో విచారింప నవసరమున్నట్లుమాత్రము తోఁచలేదు. పెక్కుకార్యములకుఁ బుత్రుఁడు ప్రతిబంధకుఁడగుననికూడ ననుకొంటిని. పదంపడి "పుత్రప్రాప్తికొఱకుఁ దపమాచరించుటకై యా రాజరణ్యమునకేగె"నని చెప్పినతోడనే చదువు చెప్పుటకై వచ్చు నుపాధ్యాయుని బారినుండి తప్పించుకొనుటకై బాలకుఁ డరణ్యమునకుఁ బోవలసినదేకాని యితరకార్యములకొఱకెవ్వరు నడవికిఁ బో నవసరములేదని నాకుఁ దోఁచెను. "ఇంట భార్యనొదలి రాజు విపినంబునకుఁ బోవునప్పటికా రాజున కొక కుమార్తెకలదు" ఆ రాజకన్యక శుక్లపక్ష చంద్రరేఖవలెఁ బెరిగి మిగులఁ జక్కనిదై పండ్రెండేండ్ల ప్రాయముకలిగి వివాహమునకుఁ దగియుండినను రాజుమాటయే మఱచి తపంబు వదలి యింటికి రాకయుండెను. రాజమహిషియుఁ గూతునకు సంపూర్ణ యౌవనము వచ్చుటయు భర్త యింకను దపంబువిడచి రాకుండుటయుఁ జూచి, "బంగారముకంటె నా ముద్దుఁగూతురు వివాహము కాకుండఁగనే మృతిఁజెందవలసివచ్చునా! యేమి భగవంతుడా! నాగతి యెట్లున్నదో" అని పెనవగతో దుఃఖించుచు "ఒక్కరాత్రిమాత్రము రాజభవనములో భుజించి క్రమ్మఱఁ బోవచ్చును గావున నొక్కసారి యింటికి దయచేయుమని భర్తకడ కొక్కదూతను బంపఁగా నతం డందులకు సమ్మతించి యింటికేతెంచెను."

భార్యయుఁ బెనిమిటి చనుదెంచునాటి రాత్రికై వేచియుండి యాహారం స్వయముగ భర్తకై యఱువదియారు భోజనపదార్థము లతిజాగరూకతతో సిద్ధముఁ జేసియుంచెను. రాజును దానన్నప్రకార మింటికివచ్చెను. భార్యయు మంచి గంధపుమ్రానితోఁ జేసిన పీటయు బంగరుటరఁటియాకును, వెండిగిన్నెలును సన్నద్ధపఱచి యందు భోజనపదార్థములు వడ్డించి భర్తనుపచరించెను. దివ్యమంగళవిగ్రహముగలిగి సంపూర్ణ యౌవనవతియగు నా రాజకూతురును తన సౌందర్యప్రభచే భోజనశాలయంతయు కాంతిమంతంబుగాగ భుజించు

చున్న తనతండ్రి వెనుకతట్టున నిలుచుండి నెమలిపించెపు విసనకఱ్ఱ చేతం గొని విసరసాగెను. రాజా నా బాలికామణి సౌందర్యమున కచ్చెరువు పడుచు నవ్వుచు మొగము వంకకుంజూచుచు భుజించుటయేమఱచి, తన ప్రియురాలి వంకకుంజూచి ప్రేయసీ! దేవతాకన్యంబోని యీ సువర్ణగాత్రి యెవరు! ఎవ్వని కూతురు! యని యడుగునంతట నామెయు దైవమా! యిదియేమి దుర్గతి. "ఈ మహారాజున కీమె కుమార్తెయని తెలియదు గాబోలు" నని తల బాదుకొనుచు, నిట్టూర్పు నిగుడించుచు, "ప్రాణ నాథా! పండ్రెండువత్సరము లరణ్యావాసము గావించివచ్చిన మీకీ బాలిక యన్యురాలుగాఁ గాన్పించుచున్నది. ఈ చిన్నది మీ ముద్దుబిడ్డ. మీ రడవికి పోవునప్పటికి రెండేండ్లది. నేటికి యౌవనవతియై వివాహముఁ గావించుటకు తగినదైయున్నది. ఇందుకొఱకే నేను దేవరకు వార్తనంపించితి." ననవుడు రాజును నద్భుతముఁజెంది ప్రేయసీ నీవేల వివాహము కావింపలేవైతివని యడిగిన నామెయు మీరు దూరస్థులైయుండ నాడదాన నేనెట్లు కన్యకుం దగిన వరుని సంపాదింపఁగలనని యేడ్చెను. నృపతియుఁ బ్రియురాలి దీన వాక్యములు విని తీవ్రమైన మనస్తాపంబున నిట్టూర్చుచు రేపకడ ప్రాసాదమునుండి యేను మొగసాలకు చనుదెంచునప్పటి కేపురుషుఁడు నాయెదుటఁ బడునో యతనికి నా కన్యకనిచ్చి పరిణయముఁ గావించెదనని ప్రతిన గావించెను బాలికయు నా మాటలువినుచు పింఛవ్యజనంబునఁ దండ్రికి సేవఁ జేయుచు నె యుండెను. భూపతియు భోజనముఁ గావించి శయ్యాగృహంబునకుంజని పరుండెను. మరునాడుదయమున రాజు మందిరము వెడలి వాకిటిగుమ్మము దగ్గరకు వచ్చునప్పటికిఁ గట్టెలు ప్రోవుచేసికొని తెచ్చుకొనుచున్న యొక బ్రాహ్మణబాలకుఁ డెదురయ్యెను. ఆ చిన్నవాని ప్రాయ మేడెనిమిది సంవత్సరములకు మించియుండదు. తన చేసిన ప్రతిజ్ఞ ప్రకార మట్టి పసిబాలునకే పదారావతియను కూతునిచ్చి పెండ్లిచేసెదనని పట్టుపట్టిన యా రాజుమాట కెదురు చెప్పువారెవరు?

భూపతియుఁ దన కెదురైన యా విప్రబాలకు నంతఃపురంబునకు రావించి, తన కూతుంగూడ పిలిపించి యా వధూవరులచే నిరువురి కంఠంబులును బుష్పదండలచే నలంకృతంబులుచేయించెను. ఇంతదనుక మా అమ్మమ్మ యీ కథ వినిపింపఁగా విని చాల తొందరగాఁ దరువాత నేమి జరిగినదని యడిగితిని; ఆ కట్టెలుమోయు బ్రాహ్మణబాలకుని యదృష్టము నాకేల కలుగఁజేయవైతివిరా భగవంతుడాయని దేవుని ప్రార్థించితిని. ప్రొద్దుగ్రుంకునప్పుడారంభించిన

వాన యప్పటికిని వెలియదయ్యె. ఆ వానచప్పుడు చేతనే రాత్రియంతయు మ్రోగుచుండెను. నా మంచము ప్రక్కనున్న ప్రమిదదీపము మిణుకుమిణుకు మనుచుండెను. కథ చెప్పినకొలఁది మా అమ్మమ్మ కంఠస్వరము గద్గదపడియెను. అంతలో నాకొక చిన్న కునుకుపట్టినది ఆ నిద్రలో, నేను పూర్వజన్మమునఁ గట్టెలేఱుకొనుచున్నట్లును రతీదేవివంటి యొక చిన్నది నన్నుఁజూచి వలఁచి నా కంఠమునఁ బుష్పమాలిక వైచినట్లును గలకంటిని. కాళ్ల ఘుల్లుఘుల్లున మ్రోగు బంగారందెలును, దల్లపు రాగిడియుఁ జెవుల కుండలములును, గంఠమందు సువర్ణమాలికయుఁగలిగి సర్వావయవ సౌందర్యముగల యా చిన్నదాని మెడలో నేనును పుష్పమాలిక వైచితినట. మా అమ్మమ్మ గ్రంథకర్త్రియైయున్నచో నామె చెప్పిన యీ చిన్న కథలో నాకుగలిగిన సందేహములకెన్నింటికో సమాధానములు చెప్పవలసియుండును. రాజు పంద్రెండుసంవత్సరములడివిలో నెందులకుండవలెననునది మొదటి ప్రశ్నము. రాజింటికివచ్చుదనుక రాజకన్యక యేల యవివాహితయై యుండవలెననునది రెండవది. ఇదంతయు నసంగతమని తలంచెదను. ఈ రెండు నొకవేళ జరిగినవని యంగీకరించినను, నట్టి యసందర్భ వివాహమునకేల కోలాహలము కాకయుండును. మఱియు రాచకులమందుఁబుట్టిన కన్యకకును, పురోహిత బ్రాహ్మణకులమందుఁబుట్టిన బాలునకును వివాహసంబంధమెట్లు జరుగునను శంకలకు సమాధానమేలేదు. ఒకవేళ మా అమ్మమ్మ కథ నెదివినవారామె ప్రస్తుతసాంఘికాచారములకు విరుద్ధముగా ధర్మోపదేశము చేయుచున్నదని తలంచినను వెంటనే వారీ యాక్షేపణలను వార్తాపత్రికలకు వ్రాసియేయుందురు. కావున మా అమ్మమ్మ అమ్మమ్మగా నే పుట్టవలసినదికాని నిర్భాగ్యుడనగు నావంటి మనుమడుమాత్రము గారాదని దైవమును వేడికొనియెదను. పిదప సంతోషముతో మా అమ్మమ్మను తరువాతికథ చెప్పుమని యడిగితిని. ఆమెయు నిట్లు చెప్పనారంభించెను. తరువాత నా రాచకన్నియ యల్పవయస్కుఁడైన యా విప్రకుమారుని వెంటబెట్టుకొని యొక యేడంతస్తుల మేడలో ప్రవేశించి యతి జాగ్రత్తతో నా చిన్నిపనిమిటిని పెంచుచుండెను అని చెప్పగా నేనును పందిరిస్తంభములు పట్టుకొని గంతులువైచుచు తరువాత తరువాతనని మా యమ్మమ్మను హెచ్చరించితిని. ఆమెయు, "తరువాత నా విప్రకుమారుడు ప్రతిదినముపాధ్యాయులకడ విద్య నేర్చుకొనుచుండెను." ఇట్లుండ నతని సహాధ్యాయులు కొందరీ మేడయందున్న కన్యక యెవ్వరని యడుగగా నా బాలునకామె వృత్తాంతమేదియు తెలిసికొనుటకై బుద్ధి వొడమెను. ఒకనాడు తాను కట్టెలు ప్రోవుచేసికొనుచుండ వానికి నేదియో యంతరా

యము కలిగనని యాతనికి జ్ఞాపకమువచ్చెనుగాని చాలకాలమగుటచేతను బాలుడగుటచేత నది సవిస్తరముగా స్మృతికి రాకుండెను. ఆ రాజకన్యక వృత్తాంత మెఱుఁగవలెనని యనుకొనుచుండఁగనే నాలుగైదేండ్లు దాటినవి. స్నేహితులు మాటిమాటికి కడుగఁజొచ్చిరి. ఆ బ్రాహ్మణబాలుడును బడినుండి రాగానే యామె వృత్తాంతమునకుఁ గుతూహలపడియు మరల మానుచుండెను. ఇట్లుండియుండి యొకనాడు "నా మిత్రులందఱు నీవెవ్వతెవో తెలిసికొనుమని నన్ను నిర్బంధించుచుండిరి నీవెవ్వతెవో చెప్పుము" అని యడిగిన నా నూపతి "యీనాటిపోనీ రేపటఁ జెప్పెదను" అని బదులు చెప్పుచుండుటయు నతఁడు మఱునాఁడు మరల నడుగుటయు నామె క్రమ్మఱనట్లే ప్రత్యుత్తరము చెప్పుచుండుటయు తటస్థించుచుండెను ఈ రీతి కొన్నాళ్లు గడచినపిదప నా బ్రాహ్మణబాలు "డోరమణీ నేడు నీ వృత్తాంతము చెప్పకున్న లేనిచో నేనీ మేడపైనుండి లేచిపోదును" అని నిష్కర్షగాపలుక నామెయు నిరభ్యంతరముగా [illegible]. అతండును మఱునాడు మరల నిర్బంధింపగా నేటిరాత్రి నీవు భుజించిన వెనుక శయ్యారూఢుండవై యున్నప్పుడే తప్పక చెప్పెదనని యంతటఁ తండు దాని కంగీకరించి యెప్పుడు రాత్రి యగునా! యని గంటలు లెక్కించుకొనుచుండెను రాజకన్యయు నలఁగుపెట్టుకొని యందముగా బూవులలంకరించుకొని మొయినింపఁ [illegible] కైసేసి బంగారు పట్టుపుట్టముకట్టుకొని కనకమయతల్పంబునందుఁ బువ్వములుచల్లి బంగారు కమ్మియందు సుగంధ తైలముపంచి యా శయ్యాగారమునందుంచి యున్నదు రాత్రియగునా యని నిమిషములు లెక్కించుచుండెను"

ఇట్లయివుండఁ బ్రాహ్మణకుమారుఁడు దండిగా భుజించి పుష్పాలంకృతంబగు పడుకగదిలోని సువర్ణశయ్యయొద్దకుం బోవుచు "నీనాడు తప్పక యీమె వృత్తాంతము తెలిసికొనియెద"నని నిశ్చయించుకొనియెను.

"రాజకన్యయు భర్త భుజించినవెనుక తద్భుక్తశేషమును భుజించి మెల్ల మెల్లగాఁ బడుకటిల్లు చేరెను. నాటిరాత్రి, 'నీవెవ్వతెవు" అని అడిగిన యా విప్రబాలుని ప్రశ్నమునకు సమాధానముఁజెప్పుట తన పనియని యా రాజపుత్రి తలంచుచు నా పాన్పుమీదికిఁ జేరునప్పటికి కాభూసురకుమారుఁడు పాన్పునందుఁ జల్లిన పుష్పములలోని యొక దుష్టసర్పముచేఁ గఱవఁబడి వివర్ణవదనుఁడై మృతుఁడైయుండెను" అని చెప్పఁగా నేను నిశ్చేష్టుఁడనై గద్గద స్వరముతోఁ దరువాత నేమి జరిగినదో చెప్పుమమ్మా యని యడిఁగితిని.

తరువాతనా! తరువాతనా!' యనుచు మా అమ్మమ్మయుఁ దరువాతి కథ యిట్లుపక్రమించెను.

పిమ్మటి కథ సాంతముగా విన్నను ప్రయోజనమేమి? అంతకంతకు మీరే విశ్వసింపఁదగని విషయములు వినవలసివచ్చును. కథానాయకుని మరణానంతరము ఏమి జరిగినదని యడిగిన నా ప్రశ్నమునకు మా అమ్మమ్మ సమాధానము చెప్పలేదను నూహ యేడేండ్లవయసుగల నాకు స్ఫురింపలేదు.

బాల్యావస్థలో సర్వము సాధ్యముగా నేయుండును. బాలుఁడెందును బరాజయమును శంకింపఁడు. ప్రాణాపహారియగు మృత్యుదేవతనుగూడఁ బాశములచే వెనుకకు మరలించుట యసాధ్యమని బాలుఁడెఱుంగఁడు. ఉపాధ్యాయుని పంపివైచుటచే నా సాయంకాలమందంత తీరికగా నమ్మమ్మ చెప్పగా వినుచున్న యీ కథ యింత హఠాత్తుగా ముగియుట నాకు దారుణముగాఁ దోచెను. మా అమ్మమ్మయు, "ఒక నదిలో నొక కదళీస్తంభముమీద నా మృత విప్రకుమారుని శరీరముఁ దేలునట్లుచేసి యొక యైంద్రజాలికుని మంత్రపఠనముచే నతనిని మరల బ్రదికించె" నని చెప్పి నా మది నూఱటపఱచెను. వర్షము కుఱియుచున్న యా రాత్రి అల్పకాంతిగల దీపపువెలుగున మరణప్రస్తావము నాకు భయకంపములు కలుగఁజేయక మరణమనగా నొక రాత్రి గాఢనిద్ర యన్నట్లు కనపడెను. కథ సాంతమయ్యె నా కంటిరెప్పలును నిద్రచే మూతపడియె. ఈ విధముగా శిశువులు రాత్రివేళ కాలమను నిశ్చలమగు జలముపై నిద్రయను తెప్పమీద దేలుచు నుదయమున మంత్రశ్లోకపఠనచేఁ దేజోమయమగు నీ జాగ్రత్ప్రపంచములోనికి వచ్చుచుందురు.

## 4. పోయిన పిల్లవాఁడు తిరిగి దొరకుట.

ఒక యజమానునియొద్దఁ బండ్రెండువత్సరముల ప్రాయమువచ్చినది మొదలు, రాయచరుండను వాఁడు సేవకుఁడుగా నుండెను. సేవకుని జాతియు యజమానుని జాతియు నొకటే. యజమానుని చిన్న కుమారుఁడైన యనుకూలునిఁ బెంచుటయే యీ సేవకుని పని. కొంతకాల మఱిగినపిదప నా యనుకూలున కెత్తుకొను వయసు దాటి బడికిఁబోవు వయస్సు వచ్చెను. అతఁడు ప్రతిదినము బడికిఁ బోవుచుండెను. బడిచదువు పూర్తియయిన తరువాత సర్వకళాశాలయందుఁ జదివి కృతార్థుఁడై యుద్యోగమునందుఁ బ్రవేశించెను. అనుకూలునకు వివాహమగువఱకు రాయచరుఁడే సేవకుఁడుగా నుండెను.

అనుకూలుని భార్య కాపురమునకు వచ్చినతరువాత రాయచరుఁడా భార్యాభర్తల కిరువురకును బరిచారకుఁడు కావలసివచ్చెను. క్రమముగా ననుకూలుని సేవకంటె నతని భార్య సేవయే రాయచరునకు హెచ్చయ్యెను. దాన రాయచరునికి సేవకవృత్తియందు కొంత యతృప్తియు ననిష్టంబును గలిగెనుగాని యది యనుకూలునకుఁ బుత్రసంతానము కలిగినవెంటనే యితని కాబాలుని సంరక్షణమే పనిగా నాదంపతులు నిర్ణయించుటచేతఁ గొలదికాలములో నశించెను. రాయచరుఁడును సర్వదా యా పసికూనకే సేవఁ జేయుచు ననుకూలునకు నతని భార్యకు ననుకూలుఁడై యుండెను. ఆ పిల్లవానినిఁ దొట్టెలో నుంచి తన చేతులతో నట్టిట్టు లూచుచు నా కుర్రవాని నర్థహీనములైన శిశుభాషణములతోఁ బిలుచుచు నా పసివాని మొగముమీఁదఁ దన మొగముంచి నవ్వుచు మరల దూరముగా నేగుచు నిట్లనేకప్రకారంబుల నాబాలకు నాడించుచుఁ గాలముఁ గడపుచుండెను.

కొన్నాళ్లకా బాలకుఁడు మోకాళ్లతోఁ బ్రాకుచుఁ గడపలు దాటఁగలిగి క్రమక్రమముగాఁ దప్పటడుగులు నడువ నారంభించెను. రాయచరుఁడును దాను బట్టుకొనఁబోవ నా బాలుఁడు పట్టువడకుండ నల్లరినవ్వుతోఁ గేకలు వేయుచుఁ బారిపోవుటయు వెంబడించినచో దొరకకుండఁ దప్పించుకొనుటయుం దతికౌశలముఁ జూపుటయుఁ గనుఁగొనుచు నాశ్చర్యపడుచుండెను. మఱియు నొక్కొక్కతఱి నప్పసివాని ముద్దుచేష్టలు తల్లికెఱింగించి సంతోషపఱచుచు, భవిష్యత్సంగతులు తెలిసినవానివలె "మీ పిల్లవాడు న్యాయాధికారి కాఁగలఁ"డని యనుచుండెను.

కాలక్రమమున నా బాలకుని చేష్టలయందు నూతన నూతనాశ్చర్యములు పొడసూపఁ దొడఁగెను. ఆ పిల్లవానికి మాటలువచ్చుట రాయచరుని మనుష్యచరిత్రలో నొక శకముగా నుండెను. తండ్రిని బాబాయనియుఁ దల్లిని నమ్మాయనియుఁ దన్నుఁ జెన్నాయనియు నా బాలుఁడు పిలిచినయపుడా రాయచరునకుఁ గలుగు మోదమునకు మితిలేకయుండెను. కొంతకాలమైన పిదప, కళ్లెము నోటఁ దగిలించుకొని గుఱ్ఱమువలె నడచుచు వానిని సంతోషపెట్టుచుండెను. మఱియు నా రాయచరుఁడా పిల్లవాని యుత్సాహమునకై పెక్కు వేషములువైచి పెక్కు విధములుగా నటింపఁ జొచ్చెను. ఒక్కొకప్పుడా పిల్లవానితో మల్లయుద్ధము గావించి యోడినట్లు నటించుచు నేల బోరఁగిలఁబడఁ జొచ్చెను.

ఈ సమయమునం దనుకూలునకుఁ బద్మావతీనదీతీరమందున్న యింకొక జిల్లాకోర్టుకు న్యాయాధికారముఁ జేయఁబోవలసివచ్చెను. మార్గమధ్యమందున్న కలకత్తాలో దిగి యనుకూలుఁడు తన కొడుకునకై యొక త్రోపుడుబండియుఁ బసుపుపచ్చని పట్టుకోటును బంగారు సరిగటోపీయును బంగారు మురుగులును గడియములును గొని తీసుకొని వెళ్లెను. రాయచరుఁడును బాలకునకా నగలలంకరించి యా దుస్తులు తొడిగి త్రోపుడుబండిమీద విహారార్థము పద్మావతీనదీతీరమునకు గొంపోవుచుండెను. అది వర్షాకాలమగుటచేఁ బద్మావతీనది యాకలిగొనియున్న క్రూరసర్పమువలె మేడలను, మిద్దెలను, గ్రామములను, వరిచేలను దన ప్రవాహంబున ముంచి యిసుకతిన్నెలమీది సరుగుచెట్లను రెల్లుపొదలను గన్పడకుండఁ జేసెను. నడుమ నడుమ నొడ్డువిఱిగి కూలినప్పుడు బయలుదేరు గంభీరధ్వని సహజమగు నదీప్రవాహ ఘర్ఘరధ్వనితోఁ గలసి యతిదూరము వినవచ్చుచుండెను. నీటిపై నతివేగముగాఁ బరుగిడుచున్న నురుగుముద్దలే ప్రవాహవేగమును జెప్పకయే చెప్పఁదొడంగెను.

ఇటులుండ నొకనాఁడు వర్షముతగ్గెను. నింగియంతట నల్లమబ్బు క్రమ్మియున్నను జూపరకందముగాను, జల్లగాను గన్పించెను. నిరంకుశచర్యుఁడగు రాయచరుని బాలయజమానుఁ డట్టిసమయమునం దింటనుండుట కంగీకరింపక విహారార్థము గొంపొమ్మని రాయచరుని బలవంతపఱచెను. రాయచరుండును నా పిల్లదొరను ద్రోపుడుబండియందుఁ గూర్చుండఁబెట్టి తాను బండిని లాగికొనిపోయెను. ఈ మనుష్యధార్యమగు శకటము పద్మావతీనదీతీరమున వరిచేలదాపునఁ జనునప్పు డవ్వరిపొలములయందు మనుష్యులుగాని, నదియందు నావలుగాని కన్పడలేదు. ప్రవాహమున కెదురుగాఁ బడమటివైపున కారుమబ్బులు విడిపోవుచుండుటయు, నాకసము నిర్మలంబగుటయుఁ దటస్థించుటచే నస్తమింపుచున్న సూర్యుని తాటిపండు కాంతివంటి కాంతి దృగ్గోచరమయ్యెను. ప్రకృతిమనోహరంబగు నిట్టి సమయంబునందా బాలుఁడు వ్రేలితోఁ జూపుచు "చెన్నా! అందమైన పువ్వదిగో" యని కేకవైచెను. అనతిదూరంబున నొండ్రు బురదతోఁ గప్పఁబడియున్న సమప్రదేశమందుఁ బుష్పితంబగు నొక గొప్ప కడిమిచెట్టు కానవచ్చె. బాలుండును దానివంక కతితృష్ణతోఁ జూడసాగెను. సేవకుండును నా చూపుల యర్థము గ్రహించెను. అంతకుముందు పూలచెండ్లతో నొక బండిచేసి యిచ్చుటచే నా బండికిఁ ద్రాడుగట్టి యీడ్చుచు నా బాలుఁడు వినోదించుచుండుటచే రాయచరునకు గుఱ్ఱము మొదలగు జంతువులయట్లు నటించుచు బాలుని సంతోషపరచు

నాయాసము లేకపోయెను. వాడు గుఱ్ఱపు పదవినుండి రాయచరుఁడు సేవక పదవియందు నిలుపఁబడెను. కావున నా సాయంకాలమునందే మరల మోకాలిబంటి బురదలోఁదిగి చెట్టుమీఁది పుష్పములను దీసికొనివచ్చుటకా రాయచరుఁ డిష్టపడలేదు. కాని యా బాలకునితో నేను తీసుకొనిరానని మాత్రము చెప్పక వేఱొకవైపున కబ్బాలుని దృష్టి మఱలించి "అబ్బాయీ చూడుము. ఆ పక్షి యెంత చక్కఁగాఁ గూయుచున్నదో" యనుచు త్రోవుడుబండి నా చెట్టుదాటునట్లు చేసెనుగాని భవిష్యన్న్యాయాధిపతి యగు నా బాలుడుమాత్ర మా పువ్వుమాట మఱచిపోలేదు. అదియునుం గాక వాని నేత్రముల నాకర్షించు రమ్యవస్తు వింకొకఁడేదియు నా ప్రదేశమునందు లేదు. రాయచరుఁడైనను లేనిపక్షిని జూపించుచు నా పిల్లవాని నెంతసేపు మఱపింపఁగలఁడు!

పిల్లవాని మనస్సు తిరుగలేదు. రాయచరున కన్యోపాయము కన్పడలేదు. తుదకు "బిడ్డా! కదలకుండ నీవిందుఁ గూర్చుండుము. నేనుపోయి యందమైన యా కడిమిపువ్వుఁ దెచ్చెదను. జాగ్రత్తగ నుండుము. నీటిదగ్గరకుఁ బోకుము" అని చెప్పి బట్ట మోకాళ్లపై కెగఁదీసికొని యా బురదలో నతి కష్టమునఁ జెట్టుదగ్గరకుఁ బోయెను.

రాయచరుఁడు పోయినక్షణముందే యా పిల్లవాని చిత్తమా నీటివైపునకే యతివేగమునఁ బరువెత్తెను. ఆకసమంటునలలతో ఘుర్ఘురధ్వానము సేయుచున్న యా ప్రవాహమువంకకే చూచుచున్న యా బాలునిచిత్తము బండి దిగుటకుఁ బ్రయత్నింపఁజేసెను. వేయిమంది బాలకుల యట్టహాసమంతి ధ్వనితో నవనీతిముతైన యా తరంగములు ప్రభువు నానతిని సైతిము లక్ష్యపెట్టక పాఱిపోవునట్లు కన్పట్టెను. ఆ కెరటములు చేయుచున్న యల్లరిఁ జూచి యా పిల్లవాని చిత్తముదిగుటకు మఱింతి సంభ్రమము పడెఁజొచ్చెను. బాలుండును నిశ్శబ్దముగ బండిదిగి తప్పటడుగులు వేయుచు నదిదగ్గఱకేగి దానిలోఁ గన్పడిన యొక కర్రముక్కను తీసికొని చేపలను బట్టుచున్నట్లు నీటివైపునకు వంగి వంగి చూచుచుండెను. దుష్టమతులైన జలదేవతలు తమ కేళీగృహములోనికిం బిలుచుచున్నట్లలలమ్రోత వినఁబడసాగెను. రాయచరుఁడును బువ్వులు కోసికొని తన బట్టచెంగులోఁ బోసికొని స్మితదామములతో నలంకరింపఁబడిన మొగముతోఁ బ్రభుపుత్రుఁడున్న బండిసమీపమునకు వచ్చి బండిలోఁ బిల్లవాఁడు లేకుండుటకు విస్మయదుఃఖంబులనుమడింప నాల్గువంకలుఁ బాఱఁజూచి యేదెసను గానరామికిఁ దల్లడిల్లుచు మరల బండియొద్దకుఁ జేరెను.

ఆ దారుణ క్షణమందు వాని యొడలిరక్తము ముద్దగట్టెను. అతని నేత్రములకు ప్రపంచమంతయుఁ ఘూర్ణాకృతిఁజెంది భ్రమింపఁజొచ్చె విదీర్ణహృదయుఁడై ప్రభుపుత్రా! ప్రభుపుత్రా! నా చిన్నిరేఁడా! యని పెద్దపెద్ద కేకలువైచెను

జరిగినసంగతి తెలియనిదానివలె, నొక చిన్నపిల్లవాని మరణమునకై విచారింపవలయునా! యని నిర్లక్ష్యముఁజేయుదానివలెఁ బద్మావతీనదియు యథాప్రకారముగఁ బ్రవహించుచునేయుండె.

ఇంటియొద్ద ననుకూలుని భార్యయు రాఁదగిన సమయమునకుఁ గుమారుఁడును సేవకుఁడును రాకుంటచే వ్యాకులితమనస్కయగుచు వారికై నలువంకలకు మనుష్యులను బంపించి వెదకింపసాగె. వారందరు కరదీపికలు గైకొని కొందఱు పద్మావతీతీరమునకుఁ గొందఱు లాతిచోట్లకుఁ జనిరి. అందుఁగుపాను గాలివలె నాల్గుదెసలకుఁ బరువెత్తు కొందరు పద్మావతీతీరమున బహుశోకమునఁ బొరలుచు ప్రభుపుత్రా! చిన్నదొరా! యని యఱచు రాయచరుని మాటలు విని యతనివలన వృత్తాంతమంతయు విని కొంతసేపు వెదకి నిరాశులై రాయచరునితో నింటికివచ్చిరి. గృహగృహస్థురాలివలెఁ బరిభ్రమించుచుఁ గుమారుని రాకకై విలపించుచున్న రాణి పాదములపైఁబడి రాయచరుఁడు కడచిన వృత్తాంతముఁ దెలుప బిల్లవాని నేమిచేసితివిరా? యని యా రాజపత్ని పెక్కుసార్లు గ్రుచ్చిగ్రుచ్చి యడిగినను వాడింతకంటె నేనేమియు నెఱుఁగను తల్లీయని పాదములపైఁబడి మొఱ్ఱపెట్టఁదొడఁగె

పద్మావతీనదియే పిల్లవానినిఁ దిగమ్రింగెనని యక్కడకు వచ్చినవారందఱభిప్రాయపడిరి కాని యీ సేవకుని మోసమిందేదేనిఁ గలదాయను సందియము మాత్రము వారికి లేకపోలేదు. ఆనాటి మధ్యాహ్నమూర్తమైట కెఱుకలగుంపొకటి వచ్చియుండుటచేఁ గొందఱికి వారిపై ననుమానముండెను. భరింపరాని దురంతపరితాపముచే ననుకూలునిభార్య "రాయచరుఁడే యీ దుర్మార్గకృత్యముఁ గావించె"నని యేడ్చుచు వానిని చాటుచోటికిం బిలచి "యోరీ రాయచరా! నీయడిగిన సొమ్మిచ్చెదను. నా పిల్లవానిని నాకుఁ దెచ్చియిమ్ము" అని బ్రతిమాలినను భయపెట్టినను వాఁడు తలకొట్టుకొనుట తప్ప రెండవ ప్రత్యుత్తర మీఁజాలఁడయ్యె. గాణికిమాత్రము వానియెడల సందియము పోలేదు. అనుకూలుఁడును రాయచరుఁడట్టి తుంటరికాఁడనియు స్వామిద్రోహముఁ జేయనేరఁడనియు నెంతగా భార్యకు బోధించినను నామెకు మాత్ర మా సందేహముతీరక రాయచరుని "నీవు లేచిపొమ్మ"ని వెడలఁగొట్టెను.

పిల్లవాని యొడలిమీఁది నగలు నా కొంపఁ దీసినవనియు నగలమీది యాశచే రాయచరుఁ డింతపని గావించెననియు రాయచరు నేమిచేసినను బాపములేద నియు వాదించుభార్య దురభిప్రాయము మాన్పింప ననుకూలునికి సాధ్యముగా కూరకుండెను. రాయచరుఁడును భగవంతుని నిందించుకొనుచువచ్చిన దురప వాదమునకు విచారించుచుఁ దన గ్రామమునకుఁ బోయెను. వానికప్పటికిఁ బిల్లలులేరు. వారి దంపతుల స్థితిగతులు చూచినను సంతానము కలుగునను నాశయులేదు. కాని భగవదనుగ్రహమువలన నతడింటికిఁజేరిన యొక యేఁడా దిలో నొక కుమారుఁడు పుట్టెనుగాని వెంటనే భార్యమాత్రము స్వర్గస్థు రాలయ్యె.

అధికవిశ్వాసమున గాఢానురాగమున పెంచిన ప్రభుపుత్రుని సర్వదా తలంచుచున్న యతని హృదయమునకుమాత్ర మీ పసిబిడ్డపై నంతగాఁ బ్రేమ లేకుండెనుగాని ప్రభుకుమారుఁడే తనకుఁ గుమారుఁడుగా జన్మించియుండ నోపు ననెడి యనుమానముకూడ నతనికి గాఢముగానుండెను. తాను బెంచిన యను కూలుని కుమారునకట్టి దుర్మరణము సంభవించుటయు నా దురపవాదమును వారు తనపై మోపుటయుఁ దలంచుకొనినపుడెల్లఁ దన కుమారునిఁ దాను బ్రేమించు టయు నా పసిబిడ్డతో సుఖించుటయు నొక నేరముగాఁ దోఁచుచుండెను. ఈ రాయచరుని విధవయక్కయొకతె యుండి యా పసివానినిఁ బెంచుటచే నతఁడు బ్రతికెనుగాని రాయచరుని పోషణమే ముఖ్యమైనయెడల నా పసి వాఁడు బ్రతుకఁడు

ఇట్లు కొంతకాలమైనపిదప చిఱునవ్వు నవ్వుట, గడపలుదాటుట, తప్పటడుగు లిడుట, యవ్యక్తాలాపములసొంపు, నడకపెంపు మొదలగు తన పిల్లవాని చేష్టలన్నియుఁ బ్రభుపుత్రుని చెయ్వులవంటివే యగుటవలనను కంఠస్వరము, హంసధ్వని, యేడ్పు, విలాసములు మున్నగునవి యనుకూలుని కుమారుని పోలికకలవగుటచేతను దన కుమారునియందు రాయచరున కధిక ప్రేమానుబంధముఁ జనించెను తన ప్రభుపుత్రుఁడే తన గర్భవాసముఁ మరల జన్మించెనను తలంపు దృఢపడియెను.

రాయచరున కిట్టితలంపు దృఢపడుటకు దగిన కారణములలో చిన్నదొర పోయినతరువాత నొక సంవత్సరమునకే తనకుఁ గుమారుఁడుపుట్టుట మొద టిది. ఇంతవయస్సు గడచినదాక దన భార్యకు సంతానములేకుండి యిప్పుడు సంతానము కలుగుట రెండవది. ఈ పసివాని చేష్టలన్నియుఁ బ్రభుపుత్రుని చేష్టలవంటివే యగుటయు నితనికిఁగూడ ముందు న్యాయాధికారి కాఁగలఁ

పెను సూచనలు తనకు స్ఫురించుటయు మానెనది. అక్కిన కారణములకేమి? ఈ మూఁడు హేతువులచేతను రాయచరునకుమాత్రము తన ప్రభుపుత్త్రుఁడే తన కుమారుఁడైపుట్టెనను తలంపు దృఢమై వానియందుఁ బ్రేముడిని హెచ్చించెను. “మీ ప్రభుపత్ని నాపై తనపిల్లవానిని దొంగిలించితినను దుష్పవాదము మోపినదని యనుకొంటిని. అది దుష్పవాదముకాదు నిజమే ఏమియగా తల్లియూహ. నేను యథార్థముగాఁ బ్రభుపుత్త్రుని దొంగిలించియే నాయింటఁబెట్టుకొంటిని” యని రాయచరుఁడు తలంపని క్షణములేదు. తనయక్క యా పసివానికి ఫల్గుణుఁడను పేరు పెట్టినను దానుమాత్రము ప్రభుపుత్త్రుఁడే యనుకొనుచుఁ దన యాత్మయుఁ దన సర్వస్వమును వానికర్పించి సేవకునివలె నధికభయభక్తులతోఁ బరిచర్య చేయుచుండెను. మఱియు నతనికిఁ ద్రోపుడుబండి యొకటి కొనిపెట్టెను. పచ్చని పట్టుకోటు, జరీటోపియుఁ గొనియిచ్చెను. తనభార్య నగలు కరఁగించి యతనికి మురుగులుఁ గంకణంబులుఁ జేయించెను. ఆ పిల్లవానిని నిరుగుపొరుగు పిల్లలతో నాడుకోనియక తానే సహచరుఁడై యాడింపసాగెను. రాత్రియుఁబవలు మున్ను తన ప్రభుపుత్త్రునకు బరిచర్య చేసినట్లే వీనికిని జేయుచు నాదుస్తు లలంకరించి త్రోపుడుబండిపై నునిచి విహారార్థముగాఁ దీసుకొనిపోవుచుండెను. పొరుగువారందరును, “దొరగారు దొరగారు” అని పరిహసింపఁజొచ్చిరి. రాయచరునకు మతిపోయినదని యనుకొనసాగిరి. అయినను రాయచరునకుమాత్రము వేఱ యుద్దేశము జనింపలేదు.

పిల్లవానికిఁ బడికిఁబోయి చదువుకొనుటకు యుక్తవయస్సువచ్చెను. రాయచరుఁడు తనకున్న కొలదిపాటి పొలమమ్మి కలకత్తాకుఁబోయి యందునొక యజమానునియొద్దఁ బరిచరవృత్తి సంపాదించుకొని పిల్లవాని కుత్తమవిద్య నేర్పించుటకై పాఠశాలకుఁ బంపెను. తాను గుప్పెడన్నముమాత్రమే భుజించి యసువులు నిలుపుకొనుచుఁ బెక్కు క్లేశములుపడి ద్రవ్యము సంపాదించుచుఁ బిల్లవానికి మంచి యాహారములు, మంచి బట్టలును దెచ్చియిచ్చుచుండెను. “ఓ చిన్నప్రభువా! మున్ను నాయందు మిక్కిలి ప్రేమగలవాడ వగుటచేఁ గ్రమ్మర నాయింటఁ బుట్టితివి. నా శక్తికొలఁది నీకేమియుఁ గొఱంత రానీను” అని లోపలఁ దలంచుకొనుచుండెను.

ఈ విధముగ ఫల్గుణునకుఁ బండ్రెండేండ్లు దాటినవి. వ్రాయను జదువను శక్తి కలిగెను. కాంతిమంతుఁడై యారోగ్యవంతుఁడై సుందరుఁడై శరీరాలం

కాంతతత్పరుఁడై సీమంతకల్పనాలోలుఁడై రాయచరుఁడు తెచ్చిన ద్రవ్యమంతయు స్వేచ్ఛగ నుపయోగపఱచుకొనుచుఁ జరుపుకొనుచుండెను.

తండ్రివలెఁ బ్రేమించుచున్నను బరిసేవకునివలెఁ బరిచర్యచేయుచున్న రాయచరునియందా యర్భకునకుఁ దండ్రియను బుద్ధి పొడమలేదు. తన పితృభావమును మఱుగుపఱచి సేవకునివలెఁ బ్రవర్తింపవలయునను రాయచరుని యుద్దేశముకూడ నందులకుఁ గతమైనది. రాయచరుఁడును నట్లే ప్రవర్తించుచుండెను.

ఫల్గునుఁడు దాను భుజించు గృహమందుండు విద్యార్థులందఱును రాయచరుని పల్లెటూరి పద్ధతులఁ జూచి వినోదించుచుఁ బరిహసించుచుండఁ దానును బరిహసించుచు వినోదించువాఁడు. కాని వారందఱికిని నిర్మలమై దయార్ద్రమైన హృదయముగల ముసలిరాయచరునిపై నిష్కపటమైన ప్రేమ లేకపోలేదు. ఫల్గుననకుఁగూడ వానియందు మిగుల ప్రేమయే కలదు కాని రాయచరుఁడు దర్పాభిమానములు వదలి సేవకునివలెఁ బ్రేమించుచుండువాఁడు.

వార్ధకముచేఁ దగినట్లు కొలువుచేయుటలేదని రాయచరునియం దధికారికిఁ గొంత యభిప్రాయము మాఱెను. రాయచరుఁడును దిండిగాని పిల్లవానికై కష్టపడుచుండుటచేఁ గ్రమముగాఁ బలహీనుఁడై కొలువుచేయుటకసమర్థుఁడై యుండెను. బుద్ధి మందగించెను ధారణాశక్తి తగ్గెను. ఒకటి రెండు దినములు పనిచేయలేనియెడల భృత్యునకు క్షమాపణ యొసఁగవచ్చుఁ గాని నిత్యమును బనిఁజేయ నశక్తుఁడగువానికెట్లు పనికివచ్చును. భూమి నమ్మి రాయచరుఁడు తెచ్చిన సొమ్మంతకుమున్నే వ్యయమైనది. మఱియు పనిచేయకుంటచే సంపాదన తగ్గినది. పిల్లవానికి దుస్తులకై భోజనమునకై జీతమునకై ధనము తెచ్చిపెట్టక తీరదు. ఇట్టి విషమావస్థలో రాయచరుఁడొక మనోనిశ్చయముఁ జేసికొని ఫల్గుననకుఁ గొంత ద్రవ్యమిచ్చి "నాయనా! నేను గ్రామమునకుఁబోయి వెంటనే వచ్చెదను" అని చెప్పి తన పూర్వప్రభువు న్యాయకార్యకారిగా నివసించు పట్టణముఁ జేరెను. అనుకూలుని భార్యకు గ్రమ్మఱ సంతానము కలుగకుండుటచే వెనుకటి పుత్రశోకాగ్నియింకను చల్లాఱలేదు.

ఒకనాఁడనుకూలుఁడు కోర్టులో జాలసేపు పనిచేసి యలసి గృహమందు విశ్రమించుచుండెను. అతనిభార్య సంతానము కలిగించుటకుఁ దగిన మూలిక కలదనిచెప్పు నొక వైద్యునియొద్దఁ జాలవెలకు మూలిక బేరమాడుచుండెను.

ఇట్టి సమయమున రాయచరుఁ డనుకూలుని మొగసాలకుఁ బోయి, "అయ్యా! వందనము" అని నమస్కరించెను. అనుకూలుఁడును వెలుపలికి వచ్చి రాయచరుని గుర్తించెను. రాయచరుఁడును కొన్ని ప్రశ్నముల కుత్తరమిచ్చిన వెనుక ననుకూలునకు హృదయము కరఁగి మరల వానిని సేవకునిగా నుంచుకొనుట కిష్టపడెను. వాఁడును, తండ్రీ! యొకసారి మా యమ్మగారికి నమస్కరింపవలెనని కోరెను. అనుకూలుఁడును వానిని వెంటనిడుకొని లోనికిం జనియెను గాని యామె యంతగా నాదరణముఁ జూపింపక పోయినను, వాఁడు చేతులు జోడించి తల్లీ! మీ బాలకుని దొంగిలించినది నదికాదు. నేనే యని పల్కుచు నమస్కరించెను.

అనుకూలుని భార్య యచ్చెరువుపడి పిల్లవాఁ డెందున్నాఁ డెందున్నాఁడని నడుగుచు రాయచరుఁడు నాయొద్దనే యుండెననియె. వానినేల వెంటఁ బెట్టుకొని రాలేదనినప్పుడు తప్పక రేపటికిఁ దీసికొని వచ్చెదనని సెలవుగైకొని వెడలి పోయెను. నాఁ డాదివారమగుటచే ననుకూలునకు న్యాయస్థానమునకుఁ బోనవసరము లేదు. వీధియరుగుమీఁద రాయచరుని రాక కెదురుచూచుచు దంపతులిరువురుఁ గూర్చుండిరి. 10 గంటలకు రాయచరుఁడును ఫల్గునుని వెంటఁబెట్టుకొని యనుకూలుని యింటికే తెంచెను.

అనుకూలుని పత్నియు నిస్సంశయముగ ఫల్గునుని దొడ్డ వనిదుకొని యొకసారి నవ్వుచు నొకసారి యేడ్చుచుఁ జిత్తంబు ననేకభావంబులకు లోనుగాఁ బ్రవర్తింపఁ జుంబనము లిడుచుఁ గౌఁగిటం జేర్చుకొని శిరంబు మూర్కొని మోము సవరించి చిరకాలపోషితంబులగు లోచనంబులతో వానిని దనివి తీర వీక్షించి సంతోషవివశురాలై యుండెను. సుందరాకారుఁడగు కుమారుండును గులీనకుమారుని వలె ననుకూలుని హృదయము నాకర్షింపఁగలిగెను. హర్షనిమగ్నమానసులై దంపతు లిరువురా బాలునిఁ దమ బాలుడుగా నిశ్చయించుకొని రాయచరునింక దృష్టి నిగుడ్చి "ఓరీ! ఈ బాలుఁడు మా బాలుఁడే యగుటకుఁ బ్రమాణమేదేనిఁ జూపఁగలవా! యనవుడు వాఁడు దేవా! నే నేమి జూపింతును. మీ పిల్లవానిని దొంగిలించిన విషయము పరమాత్ముఁ డెఱుంగు నేనెఱుంగుదును. ఇతర ప్రమాణములు నేను జూపింపలేను. మీ చిత్తమే ప్రమాణమనవుడు ననుకూలుండును దనభార్య పిల్లవాని నపరిమితానురాగముతోఁ గవుంగిలించుకొనుటఁ జూచి యిది యొక్కటే చాలు నితర ప్రమాణములు నిరర్థకములని గ్రహించి రాయచరుని మాటలన్నియు సత్యములే యని తలంచెను. రాయచరునివంటి వృద్ధునకింత సుకుమారుఁడగు కుమారుఁ

డెక్కడనొరకునను సంశయముగూడ నితఁడు తన కుమారుఁడేయని నిర్ధారణ పఱచెను. కాని రాయచరునియందు గల మున్నటిదయపోయి యత్యధికమగు కోపమువచ్చి "యోరీ మూఢ నీవు మాయింట నుండఁదగవు పొమ్మ"ని కాఠిన్యముతోఁ బలికెను.

స్వామీ! నేనెక్కడకుఁ బోఁగలను. ఇంత ముసలివానిని నన్నుఁ బరిచారకునిఁగాఁ బరిగ్రహించువారెవరు! అని కరంబులు దోయిలించి గద్గదస్వరముతో వడఁకుచుఁ బల్కుచున్న రాయచరునియందుఁ బుత్రప్రాప్తి కలిగించెనను సంతోషముతో అనుకూలుని భార్యకే దయవచ్చెనుగాని మోసగాడను హేతువున న్యాయాధికారియగు ననుకూలునకు దయరాకపోయె. సాష్టాంగపడి స్వామీ! నన్నుఁ గాపాడుము నేను మోసగాడనుగాను. నన్ను మీ యింట నుండనిమ్ము. ఈ యపరాధము చేసినది భగవంతుఁడుగాని నేనుకాదు. నన్ను మన్నింపుమని యెంత వేఁడినను దన నేరమును భగవంతునిపైకి ద్రోయుచున్నాఁడని రాయచరునిపై నెక్కువ యాగ్రహము కలిగినదే కాని యనుగ్రహముమాత్ర మనుకూలునకుఁ గలిగినదికాదు. ఈ రాయచరానుకూలుల సంగతి వినిన విద్యాధికులెవరును రాయచరుఁడు నిర్దోషియని యొప్పుకొనరు. అనుకూలుఁడు కఠినహృదయుఁడయ్యెననుటకును జుగుప్సపడరు.

ఫల్గుణుఁడును రాయచరుని పుత్రుఁడె కాననియు న్యాయాధికారి కుమారుఁడననియు నెఱిఁగినంతనే తన పైతృకస్వత్వమున కింతకాలము నష్టము గావించెనని రాయచరునిపై నంతింతనరాని కోపముప్పతిల్లెఁగాని వాఁడు కలకత్తాలోఁ దనకుఁజేసిన పరిచర్యకును నతని దయార్ద్రహృదయమునకును వాని దైన్యమునకును లోఁబడి యనుకూలునితోఁ "దండ్రీ! వీనిని క్షమింపుము. వీడు మనతో మన యింటనుండుట నీకిష్టముకాదేని వీనికెంతయో తోచినంత మాసవేతనమిచ్చుచుఁ బోషింపుము. వాని యిష్టమువచ్చినచోట నుండనిమ్ము" అని చెప్పెను.

రాయచరుఁ డామాటలువిని కడపటిసారి తన కుమారునింజూచి పూర్వ ప్రభుదంపతులకెఱఁగి సెలవుతీసికొని యసంఖ్యాకములగు జనసంఘములలోఁ గలసిపోయెను. అనుకూలుండును నా మాసాంతమున వానికొఱకు వాని గ్రామమునకు కొంత ద్రవ్యము పంపెనుగాని యందు రాయచరుఁడు లేడు.

## 5. హరలాలుఁడు.

ఆధారబాబు తండ్రి యిచ్చిపోయిన మూలధనమప్పిచ్చి దానివలన వచ్చు వడ్డితో జీవించు "కుసీదకుఁడు." వ్యవహారములలో మధ్యస్థులుగానుండు వారు, కార్యనిర్వాహకులుగానుండువారును వాని దర్శనగృహములోఁ బరిష్కృతమైయున్న హుక్కాగొట్టములోఁ బొగఁబీల్చిపోవుచుండు టాచారము. అటార్నీలు, కార్యస్థానమునఁ బనిచేయు లేఖకులు, కుదువపత్రములలో వ్రాయదగిన నియమములగురించియుఁ, బత్రమూల్యమునుగురించియు నాలోచించుచుందురు. ఆధారబాబు ద్రవ్యమునెడల నప్రమత్తుఁడు. ఆ యూరిలోని బంతిఆటలాడుకొను బాలకులెంత ప్రార్థించినను వారి ప్రార్థన వాని ధనాగారములోని యొక గవ్వనుఁ దగ్గింపలేదు.

వాని భార్య సంతానవతి కాక చాలకాలమున్న తరువాత నీ కథ ప్రారంభించునాటికి కొక కుమారునిఁ గనియెను. అందమైన మొగము, చక్కని ముక్కు, మనోహరమైన యొడలిచాయయుఁ గలిగి కుమారుఁడు తల్లిని బోలియుండెను. ఆధారబాబు నాశ్రయించియున్న రతికాంతుఁడు "మీ యున్నతవంశమునకును, నైశ్వర్యమునకును దగిన సుపుత్రుఁడుదయించె"నని నక్కాణించెను. పిల్లవానికి "వేణుగోపాలుఁడు" అను పేరుపెట్టిరి.

ఇంతవరకు గృహసంబంధమగు వ్యయముపట్ల భర్తయభిప్రాయమునకు భిన్నాభిప్రాయముకలది కాదు గాని యొకానొక వ్యయముపట్ల తీవ్రచర్చ జరిగినను పరాజయమునొందుచున్న యతనిభాగ్యవశమును దాల్చియే యుండెను. నేటికాధారబాబు తన స్వాతంత్ర్యము నిలుపుకొనుటకశక్తుఁడై కుమారునికొరకుఁ జేయదగిన ధనవ్యయముపట్ల భార్యకు వశవర్తికాక తప్పినది కాదు.

వేణుగోపాలునకు వయస్సు హెచ్చినకొలంది, తద్విషయక ధనవ్యయము హెచ్చసాగెను. విద్యావంతుఁడనియుఁ దెలివిలేని బాలురనుగూడ మతిమంతులుగాఁ జేయఁదగినంత బోధకశక్తికలవాఁడనియుఁ బేరుచెందిన యొక ముదుసలి యుపాధ్యాయుని సంపాదించెనుగాని పుట్టివానివలనఁ బిల్లలకు సౌజన్యము రాదు. సామర్థ్యము జనింపదు. ఆ యుపాధ్యాయుఁడా బాలుని హృదయమాకర్షించుటకుఁ దగిన ప్రయత్నమును గావించెనుగాని యట్లు జరుగలేదు. వానియందు వాత్సల్యలవమేమైన రవంతయున్నను నది పడుచుతనమునందే విరస

మగుటవలన, బాలునకు మొదటనుండియు శత్రువయ్యెను. దానంజేసి యీ పంతులు మంచివాఁడు కాఁడనియు, నితనిం జూచినంతనే పిల్లవాఁ డస్వస్థుఁడగునయు, భార్య నొక్కిచెప్పుటవలన నతఁడు మానుకొనియె. ఆ తరుణమునందే "హరలాలు" అనువాఁడొకఁడు మురికిగుడ్డలతోడను, జినిగిపోయిన ప్రాఁతచెప్పులజోడుతోడను ప్రత్యక్షమయ్యెను. అతనితల్లి వితంతువు. అందరు పంటలు వేసియు దంపులు దంపియు నార్జించిన ద్రవ్యమువలన జిల్లాపాఠశాలలోఁ జదువుచెప్పించెను. వాఁడును శ్రమపడి ప్రవేశపరీక్షయందుఁ గృతార్థుఁడై విద్యాలయమునఁ బ్రవేశించుటకు సంసిద్ధుఁడైయుండెను. ఆకలిచేఁ గృశించియున్న యతని ముఖము స్వభావవిరుద్ధముగ హిందూదేశమందలి కన్యాకుమార్యగ్రమువలె ఘంటాకారమును బొందియుండెను. వాని పైని ముందు వెడల్పుగానున్న భాగము హిమాలయపర్వతపంక్తులను బోలియున్న లలాటముక్రిందనే. "నీవేమిపనిమీఁద వచ్చితి"వని పరిచారకుఁ డడుగఁగా "మా యజమానుని జూడవచ్చితి"నని యతఁడు నిర్భయముగాఁ జెప్పెను. "నీకిప్పుడు మా యజమానుని దర్శనము దొరక"దని పరిచారకుఁడనియెను. హరలాలేమియుఁ జేయ నేరక తోఁచక డోలాయమానమానసుఁడైయున్న సమయంబునం దోఁటలోని కాటలాఁడఁబోయి యింటికేతెంచిన వేణుగోపాలుఁడు వానిం జూచి "హా. లేచిపొమ్ము" అని కేకలువేయుచున్న పరిచారకు నదలించి యపరిచితుఁడగు హరలాలును దండ్రిసముఖమునకుఁ దీసికొనివచ్చెను.

ఆధారలాలప్పుడే మధ్యందిన నిద్రనుండిలేచి వసారాలో నొక పేము కుర్చీపైఁ బాదములుంచి నెమ్మదిగాఁ గూర్చుండెను. వాని ప్రక్క నింకొక్క కుర్చీపైఁ గూర్చుండి రతికాంతుఁడు సుఖముగఁ బొగఁబీల్చుచు "చదువులో నెంతవరకు వచ్చితివిరా! అబ్బాయి" అని హరలాలునడుగగా వాఁడు ప్రవేశపరీక్షలోఁ గృతార్థుఁడనైతినని బదులుచెప్పెను. రతికాంతుఁడును బరుషముగ వీక్షించి "నీ వయస్సునకుఁ దగిన చదువు లేదురా!" యనియెను. హరలాలుఁడు మిన్నకుండెను. తన యజమాను నాశ్రయించియున్నవారిని, నాశ్రయింపఁబోవువారిని, బాధపెట్టుట రతికాంతుని సహజగుణము.

స్వల్పవేతనమిచ్చి హరలాలుచేఁ దన కుమారునకుఁ జదువుచెప్పింపవలయునని యాధారలాలు నాకస్మికముగఁ దలంపువొడమెను. "నెలకైదు రూపాయలు వేతనము, ఉచితముగా భోజనము, ఉచితముగా బసయిచ్చెదను. మాపిల్లవానికి జదువుచెప్పెదవా!" యని యడుగ వాఁడంగీకరించెను.

ఈ గురువుగారు చిరకాలము నిలచియుండఁదగిన యవకాశము లభించినది. గురుశిష్యుల కన్యోన్యమైత్రి కలసినది. అంతకుముందు హారలాలునకే పిల్లవానినైనను బ్రేమించుట కవకాశము లేకపోయెను. అతనితల్లి దారిద్ర్యమున నితరులయింట వంటఁజేసి జీవించుచున్నదగుటచే నామె పనిచేయు నింటి బాలురతో నాడుకొనుటకే హారలాలునకు స్వాతంత్ర్యమే లేకయుండెను. దానంజేసి తన హృదయాంతరాళమునఁ బెరుగుచున్న ప్రేమరసమును వెలిబుచ్చుట కవకాశమే లేకపోయెను.

వేణుగోపాలుఁడును హారలాలుఁడు సహచరుఁడుగా లభించినందులకు సంతోషించుచునే యుండెను. ఇంటిలో మగపిల్లవాడు వేణుగోపాలుఁ డొక్కఁడే! ఇరువురు చెల్లెండ్రుండిరి కాని వారు తనకుఁ గ్రీడాసఖులుగాఁ గావించుకొనఁదగరు కదా! ఈ నూతన పరిచితుఁడు సఖుఁడుగా, గురుఁడుగా నుండుటకుఁ దగినవాఁడగుటవలన వేణుగోపాలుఁడు పరమానందముఁ జెందఁగ ముండెను.

వేణుగోపాలుఁ డిప్పుడు పదునొకండేండ్ల ప్రాయమువాఁడు. హారలాలుఁడు మధ్యమపరీక్షయందుఁ గృతార్థుఁడై విద్యార్థివేతనము సంపాదించి శాస్త్రబ్రహ్మాభ్యాసపదవి (బి. ఏ.,) పరీక్షయందుఁ గృతార్థుఁడగుటకై చదువుచున్నవాడు, కళాశాలలోని యుపన్యాసములయినపిదప వేణుగోపాలుని వెంటఁబెట్టుకొని నగరోపవనంబునకుఁబోయి యందు గ్రీకుదేశపు వీరులను గుఱించియు "విక్టరుహ్యూగో" యను కల్పిత కథాకారుఁడు వ్రాసిన కథలను గుఱించియు నందలి కథాపురుషులను గుఱించియుఁ గథలను జెప్పుచుండును. తల్లి వానినిఁ దన చెంగటనుండుమని నిర్బంధించుచున్నను వాఁడు హారలాలుతోఁ బోవుటకే యుత్కంఠపడుచుండును. ఇది "ననబాల" కప్రియముగా నుండెను. ఇదంతయు నుపాధ్యాయపదవి మఱికొంతకాలముండుటకు హారలాలుఁడు పన్నుచున్న పన్నుగడ కాని మఱియొండు కాదని వేణుగోపాలుని తల్లియగు ననబాల యభిప్రాయము. ఒకనాఁడు హారలాలుతోఁ దెరచాటునుండి యామె. "ఉదయము, సాయంత్రము, రెండుగంటలు నా కుమారునకు జదువు చెప్పుట నీ పని గాని సర్వకాలము నీతోఁ ద్రిప్పుకొనఁదగదు. పిల్లవాడు తల్లిదండ్రులనే మఱచిపోవుచున్నాఁడు. నీవంటి నీచకుల సంజాతులు మా వంశములోఁ బొడమిన బాలురకు సహచరులు కాఁదగ"రని మందలించెను.

హరిలాలుఁడు నాఁటినుండియు వేణుగోపాలునకుఁ గేవలము గురువుగా నుండి నియమితకాలములయందే వానికి జదువు చెప్పుటకును, నితరసమయములందు వాని సాహచర్యము గానుటకును నిశ్చయించుకొనెను.

హరిలాలుఁడు తెల్లచు సూర్యోదయమునకుఁ బూర్వమే తన పాఠములు చదువుకొనుట కారంభించును స్నానముఁ జేసినవెంటనే గోపాలుఁడు వాని యొద్దకు వచ్చును; ఇరువురును గలిసి తోటలోనున్న దిగుడుబావియొద్దకుఁ బోయి యందున్న చేపలకు గొన్ని యటుకులు చల్లుచుందురు. తోటలో గోపాలుఁడొక క్రీడామందిరము నిర్మించెను. దాని ద్వారములు చిన్నవి. మెట్లును గంచెకలదు. సూటిగా దారులు కలవు. ఎండవేడి యెక్కు వయినప్పుడు వీరిరువురు నందుఁ గూర్చుందురు. అప్పుడు గోపాలుఁడు వానిదగ్గర దిన పాఠములు నేర్చుకొనును. ఇదియే వారిరువురి దినకృత్యము.

ప్రస్తుతదినమందు వేణుగోపాలుఁడు ప్రతిదినముకంటెను బెందలకడనే లేచి వెనుకటిదినమున హరిలాలుఁడు ప్రారంభించి విడిచిన కథ సాంతముగా వినఁదలఁచెనుగాని హరిలాలుఁడు తోటకే రాలేదు. వానిని గురించి యడుగగా హరిలాలుఁడు గ్రామమునకేగియున్నట్లు ద్వారపాలకుఁడు చెప్పెను. తరువాత నియమితసమయమునకు హరిలాలుఁడు వచ్చి గోపాలునకుఁ బాఠముఁ జెప్పనారంభించెనుగాని యితఁడంతకుమున్ను లేని మౌనము వహించియుండెను. "నీవు నేటి యుదయమున నూరిలోని కేల యేగితివి" అని యడిగినఁ దెలుపక చిత్తమొకచో నున్నట్లు చదువసాగెను. ప్రాతఃకాల భోజనసమయమునఁ దల్లి "విచారముగానుంటివేల? సరిగా భుజింపవేల?" యని యడిగెనుగాని వేణు ప్రత్యుత్తరముఁ జెప్పలేదు. భోజనమైన పిదపఁ దల్లి బుజ్జగించి "తండ్రీ! యేమి చిన్నఁబోయినట్లున్నావు" అని పెక్కుమారులడిగెను. తుదకు వేణువు పెద్దపెట్టున నేడ్చుచు, "నా యుపాధ్యాయుఁ డేమితప్పుచేసినాడు" అని అడిగెను. దాని తల్లి గురుకృతాపరాధమును జెప్పలేకపోయెను. మీ గురువు నామీఁద నేదేని నేరముఁ జెప్పినాడా? యని తల్లి కుమారునడిగెను. వేణుగోపాలునకా ప్రశ్నము బోధపడక యటనుండి వెడలిపోయెను.

ఆధారసింగు భోజనయింటి, కొంతి దినము పోయినపిదప రత్నకథలను విలిపించెను. హరిలాలుని స్త్రీలను బరీక్షించిరి. "దొంగిలించినవారు సొమ్ముఁ బెట్టెలోఁ దాఁచునా?" యని రతికాంతుఁడు గూఢార్థప్రాయముఁ గనఁబఱచెను.

తన కుమారుని గురువును బిలచి ఆధారబాబు "హారిలాలా! నేటినుండి నీవు మా యింట బసమానుము. ఇంకొకచోటనుండుము, సమయమునకువచ్చి మా పిల్లవానికిఁ జదువుఁ జెప్పి వెళ్లుచుండుము" అని చెప్పెను "ఆధారబాబుగారు చెప్పినమాట చాల మంచిది, అది యుభయపక్షములవారికిని శ్రేయస్కరమే" యని రతికాంతుఁడు హెచ్చరించెను. "నాకు మీ పిల్లవానికి జదువుచెప్పుటకే వీలులేదు" అని హారిలాలుఁడొక కమ్మవ్రాసి యాధారబాబునకు బంపించెను.

వేణువు బడినుండి యింటికివచ్చినప్పుడు గురువుగారి గది శూన్యమై యుండెను. గోడకుఁగొట్టిన ట్రంకుపెట్టె యది గదిలో లేదు. అస్తవ్యస్తముగాఁ గట్టఁ బడియున్న త్రాటిపై బట్టలేవియును లేవు. చినిగిన కాగితములతోను, పుస్తకములతోను నిండియున్న బల్లపైఁ బరచిన చేతిగుడ్డయొకటి గన్పడియుండెను. దానిపై "వేణు" అని వ్రాసిన కాగితమంటింపఁబడియుండెను. బాలుఁడు వెంటనే తండ్రియొద్దకు బోయి "యేమి జరిగెను"దని యడిగెను. హారిలాలుఁడు తన యుద్యోగము వదలుకొని వెళ్లిపోయెనని తండ్రి చెప్పెను. తరువాత వేణువు తన గదిలో నేలఁబడి గోలుమ నేడ్వమొదలిడెను. ఆధారలాలున కేమియుఁ దోఁచక శూన్యచిత్తమేర్పడియెను.

మరునాఁడు హారిలాలుఁడు భోజనగృహమందొక మంచముపై గూర్చుండి కళాశాలకు బోవుదునా! మానుదునా! యని వితర్కించుకొనుచుండఁ బరిచారకునితోఁ గూడ వేణుగోపాలుఁడు కంటఁబడియెను. గోపాలుఁడు పరుగు పరుగున వచ్చి హారిలాలుని కంఠము గవుంగిలించుకొని మరల "మా యింటికి రావా!" యని వేఁడుకొనెను.

"మరల మీ యింటికి రాఁగూడ"దని వేణుగోపాలునితోఁ జెప్పుట యసాధ్యమయ్యెను గాని కంఠలగ్నములగువాని చేతులను, సమస్తప్రేమతోఁ గూడినవాని సంప్రార్థనమును స్మృతికివచ్చినప్పుడెల్ల వానికి మనోవికారమును బుట్టించుచునేయుండెను. గద్గదస్వరముదయించుచునే యుండెను. ఈ వృత్తాంతము జరిగినదిమొదలు హారిలాలుని చిత్తము చంచలమయ్యెను. ఒకవేళఁ బరీక్షయందుఁ గృతార్థతఁ జెందినను విద్యావేతనము సంపాదింపఁజాలనేమో! యని వానికి భయముదయించెను. విద్యావేతనము రానిదే వానికి మరల జదువ సాగదనుమాట వాడెఱిఁగినదే. దానంజేసి యతఁడు చదువుమాని యుద్యోగము సంపాదింపవలెనను ప్రయత్నములో దిగెను.

హారిలాలుని యదృష్టవశమున నొక యాంగ్లేయ వణిక్సంఘాధ్యక్షునితోఁ బ్రథమదర్శనమునందే స్నేహము కలసెను. అన్యోన్యసంభాషణము వారిరువుర

కును సంక్షిప్తముగా జరిగినపిదప నా యధికారి "నీకు వ్యవహార జ్ఞానముకలదా?" యని యడిగెను. "నీ సత్ప్రవర్తనమునుగుఱించి పెద్దమనుష్యులిడిన యభిప్రాయముకలదా?" యనియును నడిగెను. హరిలాలుఁడు రెండును లేవని బదులు చెప్పినను నతఁడతిదయతో నెలకిరువదిరూపాయలు వేతనముగల యుద్యోగమిడి కార్యస్థానమునకు రాఁదగిన పలువులు విలుచుటకుఁ బదియేనురూపాయలుచితముగానిచ్చెను.

హరిలాలుఁడా యధికారియొద్దఁ జాల క్లేశమునకోర్చి పనిచేయఁదగియుండెను. నియమితకాలమునందు కాక నొకొక్క కతఁడే రాత్రి చాలఁ బ్రొద్దుపోవునంతకు నుంటయు నొకొక్క వేళ నధికారియింటఁ బనిచేయుటకుఁ బోవుటయుఁ గూడఁ దటస్థించుచుండెను. ఇట్లు కేయుఁబట్లు పనిచేయుటచే వెంటనే పని నేర్చుకొనియెను. అధికారి ప్రియయు సంపాదించుకొనెను. దానంజేసి సహలేఖకులకు ప్రీతియుండనూయయుదయించసాగెను. సన్నని మురికిసందులో నొక చిన్నగది యద్దెకుఁ దీసికొనియెను గాని నలుబదిరూపాయలు వేతనమయిన పిమ్మటఁ దన తల్లి వృత్తి మాన్పించి యామెనుగూడఁ బోషించుచుండెను. చాల దినములు కష్టపడి కష్టపడియున్న యాతని తల్లికి నేఁటికి సుఖపడుకాలము వచ్చినది.

వేణుగోపాలుని యోగ్యత కుమారునివలన విని యుండుటచే హరిలాలుని తల్లి యతని నొకసారి చూడఁగోరి మంచిమంచి భోజనపదార్థములు సిద్ధము చేసి వాని నొకసారి విందునకు బిలువ నభిలాషపడియెను. ఆ సంకల్పము నెఱవేరుటకు మన యిల్లు విశాలమైనది కాదనిచెప్పి హరిలాలుఁడు నిరోధించెను. పిదప వేణుగోపాలుని తల్లి చనిపోయెనను దుర్వార్త హరిలాలుని చెవిని బడియెను. నిముషమైనను సహింపలేక వెంటనే హరిలాలుఁడు వేణుగోపాలునిఁ జూడఁబోయి సమదుఃఖితను దెలిపెను. నాటనుండియు వారిరువురును ప్రతిదినమును బరస్పరదర్శనభాగ్యముఁ బొందుచుండిరి.

కాలము మారఁజొచ్చెను. గోపాలునకిప్పుడు గడ్డమును మీసములు వచ్చినవి. యౌవనము ప్రాదుర్భవించుటచే నూతన సంప్రదాయములు క్రొత్తచేష్టలు నలవడెను. ప్రస్తుతె యౌవనావస్థకుఁదగిన మిత్రులనేకులేర్పడిరి. వాని శయనాగారమందు ముందున్న ప్రాఁత కుర్చీయును, సిరామరకలతో నిండియున్న బల్లయును నేఁడు లేవు. అద్దములతోడను, జాందినీలతోడను, క్రొత్తరకపుఁ గుర్చీలతోడను నిండియున్న యాతని గది నేఁడు క్రొత్తదిగాఁ గాన్పింపఁ

పోడఁగ. వేణువు కళాశాలలోఁ బ్రవేశించెఁగాని మధ్యమపరీక్షా సీమదాఁటుటకుఁ బ్రయత్నించుచున్నట్లు తోఁచదు.

గోపాలుని భోజనమునకుఁ బిలువుమని కోరు తల్లికోరిక నాఁడు మఱువలేదు. చాలసేపు విచారించి వాని నొకసారి భోజనమునకుఁ బిలచెను. వేణుగోపాలుని సుందరవదనము హారలాలుని తల్లికిఁ జాల ముద్దుగానుండెను. భోజనమైనపిదప గోపాలుఁడు బంగారపు గడియారముఁ జూచి కాలమతిక్రమించుచున్నదని యోచించి, తన యత్యావసరమగు నింకొక కార్యము నెరవేర్చుకొనుటకుఁ ద్వరపడి ద్వారమున సిద్ధముగానున్న బండిలో నెక్కి వెడలిపోయెను. హారలాలుఁడు నిట్టూర్పువిడిచి "యిఁక నెన్నఁడును గోపాలుని భోజనమునకుఁ బిలువరాదు" అని తన మదిలో నిశ్చయించుకొనియెను.

ఒకనాఁడు హారలాలుఁడు కార్యస్థానమునుండి యింటికివచ్చి మేడక్రింది చీఁకటిగదిలో నొకమూల నెవ్వరో మనుష్యుఁడున్నట్లు గుర్తించెనే లోపలికిం బోఁదలచెనుగాని వాని యొడలి పరిమళద్రవ్యముల వాసనమాత్రము గుమ్మమనుటచే "నెవరు వారు" అని యడిగెను. "గురువుగారూ! నేను" అని యా మూలనుండి ప్రత్యుత్తరము వచ్చెను. "గోపాలా నీవు వచ్చి యెంతసేపైనది, "ఏమి పనిమీఁద వచ్చితివి" అని యడుగ హారలాలునితో "నేను వచ్చి నాలుగు గడియలైనది. మీరింటికింత యాలస్యముగ వత్తురని నే నెఱుంగను" అని గోపాలుఁడు బదులుచెప్పెను. అనంతరము వారిరువురును మేడమీఁదికేగిరి. హారలాలుఁడు దీపము వెలిగించి "యందఱకుఁ గుశలమా?" యనియెను. వారిరువురకును నీ క్రింది సంభాషణము జరిగెను.

గోపా.—నాకు విద్యాశాలలోఁ జదువుట చాల కష్టముగానున్నది. చదివిన తరగతియే మరలఁ జదువవలసివచ్చెను. నాకంటెఁ జిన్నవాండ్రతోఁ గలసి చదువుట కష్టమని నా తండ్రి గ్రహింపనేరఁడు.

హార.—అయిననో ముందేమి చేయఁదలఁచితివి?

గోపా.—ఆంగ్లేయదేశమునకుఁ బోయి "బారిష్టరు" పదవికిఁ జదువఁదలఁచితిని. నాకంటెఁ దక్కువచదివిన యొక విద్యార్థి లండను పోవుచున్నాడు.

హార.—మీ తండ్రిగారి యనుమతిని బొందితివా?

గోపా.—మధ్యమపరీక్షలోఁ గృతార్థుఁడవగువఱకు మా తండ్రి నా మాటలు చెవిఁబెట్టఁడు నేను మధ్యమపరీక్షలో నుత్తీర్ణుఁడవగుట కల్ల.

హార.—నేనుపోయి మీ తండ్రిగారితో మాటలాడెదను.

గోపా.—వలదు వలదు నేనందులకు సమ్మతింపను.

హార.—ఆగ భోజనముఁజేసి వెళ్లుము. నీ తండ్రితోఁ గలహించుటగాని, యతని యానతి దాటుటగాని నీకుఁ దగదు.

గోపా.—నేను నీకుఁ బ్రేమాస్పదుఁడనుగానియెడల నట్లు చెప్పుము, నేను పోయెదను.

హార.—తరువాత నీ యిష్టము. భోజనము చేసిపొమ్ము.

అని హారలాలుఁడు బ్రతిమాలుచుండఁగాఁ గోపాలుఁడు చేయివిదిలించుకొని లేచిపోసాగునంతలో హారలాలుని తల్లి భోజనము సిద్ధపఱచి పళ్లెములోనుంచి గోపాలుని యెదుటనుంచెను. వెళ్లుటకుఁ బ్రయత్నించుచున్న గోపాలునుండుమని బ్రతిమాలెను. తుట్టతుద కొప్పుకొని యతఁడు భోజనము జేయుచుండఁగా ద్వారములో బండి నిలిచెను. కొంతసేపటికిఁ గిరుచెప్పులతో నొక పరిచారకుఁడును దరువాత నాధారబాబును జనుదెంచిరి, గోపాలుని మొగము తెల్లఁబడెను క్రొత్తవారు లోపలకు రాఁగానే హారలాలుని తల్లి యావలకుఁ బోయెను కోపమున నెఱ్ఱఁబాఱిన మొగముతో నాధారబాబు, "నీవలన నాకనర్థము సంభవించుచున్నది. అప్రమత్తుఁడవై యుండుము. జాగ్రత్తయని రతికాంతుఁడు మొదటనే నాకుపదేశించెను. మా గోపాలు నాధారముఁజేసికొని బ్రదుకఁదలంచితివా! నీవింత కపటివని నేనెఱుంగనైతి ఇది కేవలముఁ బిల్లవానినిఁ దొంగిలించుటయే న్యాయాధికారి యెదుట నీపై నభియోగముఁ దెచ్చెదము," అని బొబ్బరించెను. గోపాలుఁడు మెలమెల్లనఁ దండ్రికిఁ జాటువడి గృహమునుండి వెడలిపోయెను.

హారలాలుఁడు పనిచేయుచున్న వర్తకసంఘమువారు పల్లెటూళ్లవెంబడిఁ జని ధాన్యము మొదలగునవి కొనువారు. అందు ధాన్యవర్తకము విశేషము. కొన్నసరకులకు వెలయిచ్చుటకుఁ బ్రతి శనివారమునను హారలాలుఁడు బండిపై ధనముఁ గొనిపోయి రైతులకిచ్చుచుండును. అన్నిమూలలనుండి రైతులు తమ రిచ్చిన సరకులకు వెలఁదీసుకొనుటకై యొక కార్యస్థానమేర్పఱుపఁబడినది. అక్కడకు దానసూచకములగు పత్రములతో వచ్చి ద్రవ్యముఁ గ్రహించి ప్రతిగ్రహసూచకములగు పత్రములు వ్రాసియిచ్చి పోవుచుందురు. హారలాలుని వ్యవహారము ధనముతో సంబంధించినదగుటచే వర్తకసంఘమువారు కొంత ధనము హారలాలునివలన న్యాసముగాఁ దీసికొనవలసినదియేకాని యధికారి తానే పూటకాపగుటచే నట్టిన్యాస మీనక్కఱలేకపోయెను. ఈ వ్యవహారము పుష్యమాసము మొదలు చైత్రమువఱకు విశేషముగా జరుగును. ప్రతిదినము పని పూర్తిఅయి హారలాలుఁ డింటికిపోవునప్పటికిఁ జాలరాత్రి గతించుచుండును.

ఒకనాఁడు హరలాలుఁ డింటికిఁ వచ్చునందాఁక ప్రతీక్షించి గోపాలుఁడు వానితో నిట్లు మాట్లాడెను.

గోపా.—గురువుగారూ! కొన్నిదినములనుండి మా తండ్రిగారి ధూర్తత్వము సహింపశక్యముగాకున్నది. నేనెంతమాత్రము వానితో నేకగృహమున నుండ లేను. ఇదియునుంగాక మరల వివాహము చేసికొను ప్రయత్నములు జరుగుచున్నవి. రతికాంతుఁడు తగిన సంబంధములఁ వెదకుచున్నాఁడు. వారిరువురు వివాహవిషయమయి కుట్ర చేయుచున్నారు. కొన్నిగడియలు నేనగపడకుండిన నాకొఱకుఁ బరితపించువాఁడు. నేను వారముదినము లగపడకపోయినను నన్నుఁ దలంపఁడు. నేనింట లేకుండుటయే వాని మనస్సునకు విశ్రాంతినిచ్చును. మరలఁ బెండ్లిచేసికొన్నయెడల నేనింటనుండఁజాలను. ఈ యాపదనుండి తప్పించునుపాయము మీరేచూచి నాకు దారి కల్పింపవలయును. "ఇఁక స్వతంత్రుఁడనైయుండవలయుననియే నా యభిప్రాయము," అని చెల్పిన హరలాలుఁడా మాట లాలించి చాల వ్యసనపడియెను. కాని గోపాలునకు సాయముచేయు దారి వానికిఁ దోఁచకూరకుండెను. "నేను లండనుబోయి బారిస్టరుపదవికిఁ జదువుదును. నాకుఁ బొగయోడకూలి దొరకినచోఁ బోదును. దానికిఁగాను ఋణము దెచ్చెదను, ఋణమిచ్చిన వారికి యోగముఁ దెచ్చి మా తండ్రివలనఁ గ్రహింపఁగలుగుదురు. అట్లు ధర్మశాస్త్రముచెప్పుచున్నది. అప్పుతెచ్చిన సొమ్ముతో లండనుజేరుదును, తరువాత నాకుఁ గావలసిన ద్రవ్యము నా తండ్రి పంపించకయే చెలువునీళ్లు త్రాగును," అని గోపాలుఁడు ప్రశంసింపఁగా నీకు ఋణమిచ్చువారెవరని హరలాలుఁడు ప్రశ్నించెను. గోపాలుఁడును "నీవే ఋణమిమ్ము. మీ పరిచారకుఁడిప్పుడే సంచులతో ధనముఁ దెచ్చియుంచుట నేను చూచితిని" అనియెను. "అయ్యో! ఆ ధనము నాదికాదు, ఇతరులది. ఆ పరిచారకుఁడు నితరుల పరిచారకుఁడు, సాయంకాలమునఁ బత్తులన్నియు నొక చోటికిఁజేరి మఱునాఁడెక్కడివక్కడికిఁ బోవునట్లుగా ని ధనరాసులు రాత్రి నా యింటికి జేరి మఱునాడు నానాస్థలములకుఁ బోవును" అని చెప్పెను. "మీ యధికారి నాకప్పియ్యఁగూడదా?" యని యడిగిన గోపాలునకు నీ తండ్రి జామీనుదారుడుగానున్నయెడల ఋణమిచ్చునని బదులుచెప్పెను, అంతట నా చర్చ ముగిసెను.

శుక్రవారమునాఁటిరాత్రి యొక జోడుగుఱ్ఱములబండి హరలాలుని యింటిముందర నిలువఁబడియెను. గోపాలుఁడు వచ్చినాడని కబురు తెలిసెను. అప్పుడు హరలాలుఁడు ద్రవ్యము లెక్కించుచుండెను. గోపాలుఁడు విచిత్రమగు

వేషముతో గదిలోఁ బ్రవేశించెను. వంగదేశీయుల వేసముజ్జగించి పారసీకులు ధరించు కోటును, లాగును, టోపీయును ధరించియుండెను. పదివ్రేళ్లయందును నుంగరములుండెను. మెడలో నొక దళమైన బంగారుగొలుసు వ్రేలాడు చుండెను. చోళపిప్పలములలోనుండి సువర్ణమయములగు గండములు తొంగి చూచుచుండెను. అతఁడు వచ్చినవెంటనే "యేలవచ్చితివి? నీవీ వేసమేల ధరించితివి?" అని యడిగెను.

నా తండ్రి వివాహము రేపటి జరుగును. మా తండ్రి గుప్తముగానుంచుటకుఁ బ్రయత్నించెనుగాని నేనది కనిపెట్టితిని. బరకప్పూరులోనున్న మా తోటలోఁ గొన్ని దినములు నివాసముఁజేయుటకు ముదలయడిగితిని నేనింటనుండి వెడలు టయే చాల మంచిదని తలఁచి నాకనుజ్ఞయిడెను. నేనిప్పుడక్కడకుఁ బోవుచు న్నాను. మరల నా తండ్రియొద్దకు రాకుండఁజేయుటకుఁ బరమేశ్వరుని వేఁడు కొనుచున్నాను, అని వేణుఁడు చెప్పెను. హరిలాలుఁడు వాని చేతియుంగరములు సాభిజ్ఞానముగాఁ జూచెను. గోపాలుఁడివి మా యమ్మగారివనెను. నీ భోజన మైనదాయని యడుగ లేదనియెను. ఈ ధనమంతయు నినుపపెట్టెలో నుంచి తాళము వేయువరకు నేనీగది విడచిపోవుటకు వీలులేదని హరలాలుఁడు నుడు వగా "మీ తల్లి నీకొరకుఁ బ్రతీక్షించుచుండును. అంతవరకు నేనిక్కడనుం దును. నీవుపోయి భోజనముఁ జేసిరమ్ము" అని గోపాలుఁడనెను. పిదప నిమిష మాత్రమాలోచించి గదివెడలి భోజనమునకుఁ బోయెను. వెంటనే భుజించి తల్లియుఁ దానును మరల గదిలోఁ బ్రవేశించి వారు ముగ్గురును సంభాషింపఁ దొడంగిరి. అర్ధరాత్రిమైనది. గోపాలుఁడు గడియారముఁజూచి "నాకు రైలందను కాబోలు"వని గుబాలునలేచి చేతియుంగరములు మెడలోని గొలు సునుదీసి నేను మరలవచ్చువరకు నివి మీ యింట భద్రముఁజేయుము" అని హరిలాలునకిచ్చెను. అతండును నొక సంచిలోనుంచి యినుపపెట్టెలో దాచెను. గోపాలుఁడు వచ్చుటకుమున్నే కొన్ని నోటులు లెక్కించి యా కట్ట హరలాలుఁ డినుపపెట్టెలోనుంచి రూపాయలు లెక్కించుచుండెనని చెప్ప మఱచితిని. వేణుఁడు నిర్గమించినతరువాత విడిరూపాయలు లెక్కించి యినుపపెట్టెలోఁ బెట్టి నేలమీదనే దిండుక్రిందఁ దాళముచెవిపెట్టుకొని నిద్రించెను. తెరచాటున నుండి గోపాలునితల్లి తన్ను నిందించుచున్నట్లు కలఁగనియెను. ఆమె మాటలు విస్పష్టముగ వినఁబడలేదుగాని యామె మేననున్న మణులకాంతి యా తెరను సూచులవలెఁ బొడుచుచు నిట్టటుఁ చలించుచున్నట్లుండెను. గోపాలునిఁ బిలువఁ బ్రయత్నించెనుగాని నోరురాకపోయెను. తరువాత తెర నేలపైఁబడెను. ఇది

యంతయుఁ గలలోని సంగతియే. తరువాత హరిలాలుఁడు యులికిపడి మేల్కాంచి తనచుట్టు నావరించియున్న చీఁకటినిఁ జూచెను. పెద్ద గాలివిసరి కిటికీతలుపులు తెఱవఁబడి దీపమారిపోయెను. హరిలాలుని శరీరమంతయుఁ జెమ్మటచేఁ దడిసి యుండెను. మరల దీపము వెలిగించి గడియారముం జూచి తెల్లవారుచున్నదని గుర్తించెను, మరల నిద్రించుటకు వేళ చాలదు. నిద్రలేచి గమ్యస్థానమునకుఁ బోవలసినవేళ అయినది, లేచి మొగమును జేతులుకడిగికొని కృత్యములు తీర్చుకొనెను. తల్లి "అబ్బాయీ! ఇంత తొందరగా లేచితివేమి!" అని ప్రశ్నించెను

దినమంతయు శుభప్రదమగుటకుగాను హరిలాలుఁడు లేచినవెంటనే తల్లి మొగముచూచు టాచారము. "వివాహముఁజేసికొని నూతనవధువును వెంటఁ బెట్టుకొని నీవింటికివచ్చినట్లు కలగంటి"నని తల్లి చెప్పెను. హరిలాలుఁడు గదిలోనికిఁబోయి నోట్లుపెట్టిన సంచులు బయటకుతీయ నారంభించెను.

ఆకస్మికముగ వాని హృదయ మాగిపోయినట్లుండెను. సంచులలో మూడుత్తసంచులుగాఁ గన్పడినంత నవి నేలను గొట్టిచూచెనుగాని యేమియు రాలలేదు. వానికిఁ గలిగిన సంశయము నిజమయ్యెను ఆ సంచులలో నొకదానినుండి వేఱుడు వ్రాసిన యుత్తరములు రెండు నేలఁబడెను అందులో నొకటి యాధారలాలు పేరను నొకటి హరిలాలు పేరను నుండెను. T82/B175 DS.

తనపేరుగల యుత్తరమువిప్పి చదివెను. అక్షరములన్నియుఁ గలసిపోయినట్లుండెను. వత్తి కత్తిరించి దీపము బాగుచేసి చదివెనుగాని బోధపడలేదు. కాని గోపాలుఁడు మూడువేలరూపాయలనోట్లు తీసుకొని యింగ్లండునకుఁ బ్రయాణమయ్యెనని మాత్రము తెలిసినది. ఆ యుదయముననే పొగయోడ బయలుదేరును. "అన్ని సంగతులు మా తండ్రిగారికి వ్రాయునుత్తరములో వ్రాయుచున్నాను. ఆయన మీకివ్వవలసిన సొమ్ము తీర్చును. నేను మీయొద్దఁ దీసుకొన్న రూపాయలకంటె మీయొద్ద కుదువపెట్టిన వస్తువుల వెలయే యెక్కువ" అని ఆ యుత్తరము చిగురుననున్నది.

హరిలాలుఁడాగదికిఁ దాళమువైచి యొక గుర్రపుబండిమీఁద వెంటనే యోడరేవుదగ్గరకుఁ బరువెత్తెను గోపాలుఁడెక్కిన పొగయోడ పేరుతెలియక యా ఘట్టమంతయుఁ దిరిగెను. నాఁడుదయమునకుఁ బూర్వమే రెండు పొగయోడ లాంగ్లేయదేశమునకు వెడలెనని తెలిసికొనియెను. ఏ యోడలో గోపాలుఁడు పోయినదియుఁ వాఁడేవిధమున దొరకువడియుఁ దెలిసికొనుట దస్సాధ్యముగానుండెను.

హారలాలుఁడు మరల నింటికిఁబోవునప్పటికి కొంత ప్రొద్దెక్కెను. కలకత్తాలోనున్న ప్రజబృందములను మేల్కాంచిరి, గాని వానికి దారి కన్పించుటలేదు. రూపములేని యొకానొక భయంకర ప్రతిబంధకము వానిమార్గమునను రోధించినట్లు వానికిఁ గన్పడెను. వాని తల్లి వసారాలోనికివచ్చి, 'యెక్కడకుఁ బోయి వచ్చితివి'' అని యడిగెను. నూతనవధువును దీసుకొనివచ్చుటకుఁ బోయివచ్చితివని పరిహాసమునఁ బల్కెనుగాని యా వసారాలోనే మూర్ఛిల్లెను.

కొంతసేపటికిఁ గన్నులు తెఱచి తల్లి నావలకుఁ బొమ్మని గదిలోఁ బ్రవేశించి లోపలిగడియ బిగించుకొనియుండెను. తల్లి, "బాబూ! బాబూ!" యని మతిలేనిదానివలె నఱచుచుండెనుగాని వాడు మాటలాడలేదు.

అధికారియింటనుండి పరిచారకుఁడువచ్చి "త్వరగ బయలువెడలవలెనని యొడెల ర్లలంపను" అని తలుపుకొట్టి చెప్పెను. "నేటియుదయము నేను ప్రయాణము చేయఁజాలనని చెప్పుము" అని లోపలనుండియే కేక వినఁబడియెను. పరిచారకుడు విసుగుకొనుచు లేచిపోయెను. తరువాత హారలాలునకు గోపాలుఁడుంచిపోయిన నగలమూట స్మృతికివచ్చి యాపదనుండి తప్పించుకొన దారియున్నది కదా' యనుకొని యా నగలసంచియు గోపాలుఁడు తండ్రికి వ్రాసిన యుత్తరమును దీసుకొని యాధారలాలింటికిఁ బోయెను.

హారలాలుఁడు పోవునప్పటికి నాధారబాబుగారియింట మంగళవాద్యములు మ్రోఁగుచున్నవి. హారలాలుఁడవి గణింపక లోపలఁ బ్రవేశించెను. వానింజూచి యుత్సవమునకేదో యంతరాయమువచ్చెనని యక్కడివారు తలంచిరి. ఆధారబాబునింట గతరాత్రి చౌర్యము జరిగెననియు, నొకరిరువురు పరిచారకులమీఁది ననుమానమున్నదనియును వినెను. ఆధారబాబు కనులెఱ్ఱ బారగ సుకుంచిన మొగముతో వసారాలోఁ గూర్చుండెను.

రతికాంతుడు హుక్కాగొట్టము పీల్చుచుండెను. హారలాలుఁడా యాధారలాలుంజూచి "మీతోఁ గొన్ని సంగతులు మాటలాడవలసియున్న" దనియెను. ఆధారబాబు మండిపడుచు నాకు తీరికలేదని బదులుచెప్ప, తనయొద్ద బదులుకొఱకో లేక మఱి యే సాయముకొఱకో వచ్చియుండునని యాధారబాబూహించెను. రతికాంతుఁ డయ్యా నేనుండఁగాఁ జెప్పుటకభ్యంతరమున్నచో లేచిపోయెద"ననియెను "అబ్బే! మీరు వెళ్లనక్కరలేదు" అని యాధారబాబు పల్కుచుండగనే హారలాలుఁడు నగలసంచియు నుత్తరమునుదీసి లోపలనున్న వస్తువులువిప్పి చేతికిచ్చెను.

ఆధారిబాయి పరిహాసముతో నీ పూర్వశిష్యుఁడు చాల లాభకరమగు వ్యాపారమారంభించెను. "దొంగిలినధనము నీ దగ్గరనున్నట్లు తెలియకమానదని నిశ్చయించుకొని తీసుకొనివచ్చి స్వయముగనిచ్చినట్లయిన బహుమానము దొరుకునని తలంచితివి కాఁబోలు" అని యుపహాసముఁ గావించెను. పిదప గోపాలుని యుత్తరము చేతికిచ్చెను. అది చూచిన వెంటనే హారిలాలుమీఁద నాధారిబాయికు మరింత కోపమువచ్చెను. రక్షకభటులను రప్పించెదను. నా కుమారునకింకను స్వతంత్రశక్తిచే వ్యవహరించుటకుఁ దగినశక్తి రాలేదు. నీవు వానికి దురుపదేశముఁ గావించి దూరదేశమునకుఁ బంపితివి వానికిఁ గొంచెమప్పిచ్చి మూఁడువేలకు నోటు వ్రాయించుకొంటివి. ఈ నోటునకు బద్ధుఁడనై నేను సొమ్మిచ్చుటకు సిద్ధుఁడనైయుండలేదు, అని హారిలాలును ధిక్కరించెను. హారిలాలుండును నేను వానికేమియు నప్పీయలేదనిన నీయినుపపెట్టె బగులఁగొట్టి ద్రవ్యము దొంగిలించినను మంటివా యేమియని మరింత కసరెను. హారిలాలుఁడు నిరుత్తరుఁడై యింటికి లేచిపోయెను.

ఇంటికిఁబోవునప్పటికి హారిలాలునకు నాపదసంభవించునని భయపడుటకుఁగాని, వ్యాకులపడుటకుఁగాని హృదయమే లేదు. తన సందులోనికింబోగ నేయందొక బండి కన్పడఁగా నందు గోపాలుఁడున్నాఁడని నిమిషమాత్రమాలోచించెనుగాని తప్పించుకోలేని యాపద తనకు వచ్చినదని నమ్మలేకపోయెను. ఆ బండిలో నాంగ్లేయాధికారి తరువాతి యధికారి యుండెను. అతఁడు హారిలాలుని చేయిపట్టుకొని "నీవీ యుదయము రైలుబండికేలపోలేదు?" అని యడిగెను. ముందటవచ్చిపిలచిన పరిచారకుఁడే సహాయాధ్యక్షునితోఁ జెప్పిన నతఁడు స్వయము వచ్చుటకుఁ గతమైనది. హారిలాలుఁడా సహాయాధికారి మాటలు విని "నాయొద్దనున్న ధనములో మూఁడువేలరూపాయలనోట్లు కన్పడినవికావు" అని చెప్పెను. అదెట్లు సంభవించెనని యతఁడడుగ హారిలాలుఁడూరకుండెను. "మనమిరువురమునుబోయి సొమ్ముదాచినచోటు పరీక్షించెదము రమ్ము" అని హారిలాలుతో నాంగ్లేయాధికారి గదిలోనికింబోయి యిల్లంతయు వెదకెను.

ఇదంతయు వాని తల్లిజూచి, "బాబూ దొంగలెత్తుకొనిపోయిరి" అని వచ్చియు రాని హిందీభాషతో నేడ్చెను. తరువాత నా యధికారి శోధించిన ద్రవ్యమును దీసుకొని యధికారియొద్దకు రమ్ము అని తీసుకొనిపోయెను. హారలాలునితల్లి వాని త్రోవకు నడ్డుపడి "అయ్యా! నా కుమారునెక్కడకుఁ గొంపోవుచున్నారు, మా పిల్లవాఁడేమియు నెఱుఁగఁడు. దుర్మార్గుఁడుకాఁడు" అని యేడ్చెను. ఆమె మాటలకా యధికారియు "నచ్ఛా, అచ్ఛా" యనెను. సంఘాధ్యక్షునకు

సర్వము నివేదించి మరల వచ్చెదనని తల్లి నొప్పించి హరలాలుఁడా యధికారితోఁ గార్యస్థానమున కేగెను. వెళ్లినపుడు "నాయనా! రాత్రి యన్నముఁ దిన్నఁగాఁ దినలేదు. గుప్పెఁడన్నముఁ దినిపొమ్ము" అని వేఁడినను మారుమాటాడకుండ వెళ్లిపోయెను. హరలాలునితల్లియు మనస్తాపమున నేలఁగూలెను.

"జరిగినదంతయు నిజముఁ జెప్పుము" అని అధికారి యడిగినను నేనే మియు నెఱుఁగననుమాటతప్ప హరలాలుని నోటనుండి రెండవపలుకు రాలేదు. "నీ వెఱుఁగవు సరియే. ధన మెవ్వరుతీసినదియు నీకుఁ దెలియునా" అని యడిగినను నిరుత్తరుఁ డయ్యెను. "నీవను మోదించి చూచియుఁ జూడనియట్లుండఁగా నెవ్వరో తీసిరి కాబోలు" నని యధికారి పలుకఁగా నా ప్రాణములు హరింపకుండ నీ ద్రవ్యము హరించుట శక్యముగాదని హరలాలుఁడు ప్రత్యుత్తరమును జెప్పెను. "హరలాలా! నామాటలు వినుము, నిన్ను నమ్మితిని. నీయొద్ద న్యాసమైనను దీసికొలేదు వ్యవహారమునందలి భారమంతయు నీయందునిచితిని. నీవిట్లుఁ గావించినందులకుఁ గార్యస్థానమునందలివారందరును నాయందు బద్ధవిరోధులైరి. మూఁడువేలరూపాయలు స్వల్పమేగాని ఈ యపకీర్తిమాత్రము చాల పెద్దది. నేను నీకుఁ జేయదగిన సాయమిది. నీకు గడువిచ్చెదను, ఎక్కడఁ దెచ్చెదవో నా సొమ్ము పూర్తిచేయుము తరువాత నీ యుద్యోగము నీకిచ్చెదను. నేను నీకింతకంటె నుపకృతి చేయఁజాలను" అని చాల దయార్ద్రాంతఃకరణముతో నధికారి పల్కెను. అప్పటికిఁ బదునొకండుగంటలకాలమైనది. తలవంచుకొని హరలాలుఁడు కార్యస్థానమునుండి వెడలిపోయెను. లేఖకులందరును బ్రమోదముతో నీవిషయమే చర్చించుకొనసాగిరి

చండభానుని చండకిరణములు సహించుచుండ వా హరలాలుఁడు పయనమై మతిపోయినవానివలె, "నే నేమిచేయుదును. ఏమిచేయఁగలను. ఏమిచేసితిని" అని గొణుగుకొనుచు నేమియుఁ దోఁచక పోవుమార్గమెఱుంగక విరామము లేకుండ నడచిపోఁజొచ్చెను.

వేలకొలంది జనులకు శరణమగు కలకత్తా వానికొక బోనువలెనుండెను. తప్పించుకొనుటకు మార్గమగపడదు. తన్ను జనసంఘమంతయు బందీకృతునిఁగాఁ జేయుటకు వచ్చుచున్నారనియే తలంపు వొడమసాగెను. వానిపై నెవ్వనికిని ననుమానమే లేకున్నను ప్రతి మనుజుఁడును వానికి శత్రువుగానే కన్పించెను. జనులు గుంపులుగుంపులుగా వానిం ద్రోచికొనియే నడచుచుండినను నది వాఁడెఱుంగఁడు. కార్యస్థానములయందలి లేఖకులు ఫలాహారములు తినుచుండిరి. మార్గాయాసముచే నలసిన బాటసారి యొకఁడొక మ్రానుక్రింద తలక్రింద

నొక చేయియుఁ గాలిమీఁద రెండవకాలును వైచికొని సుఖముగా నిద్రింపఁ దొడంగెను. పై గ్రామములనుండివచ్చిన స్త్రీలు బాడుగబండ్లెక్కి, కాళీదేవాలయమునకుఁ బోవుచుండిరి. ఒక పరిచారకుఁడొక యుత్తరముఁ దెచ్చి పై పేరు చెప్పుమని యడిగెను. మధ్యాహ్నమీరీతిగాఁ గడచుచుండెను.

కార్యస్థానములన్నిఁటియందును బని విరమించుకాలము సమీపించెను. జనుల నిండ్లకుఁగొంపోవు శకటములు రాజమార్గములయందుఁ గిక్కిఱిసి నడచుచుండెను. విద్యుచ్ఛకటములమీఁద బల్లలపైఁగూర్చున్న జనులు తమ యిండ్లకుఁ బోవుచు మార్గమధ్యమున గోడలకంటించిన నాటకప్రచురపత్రికలు చదువసాగిరి. హారలాలునకుఁ గార్యస్థానమున నీనాఁటిపవలు పనిలేదు. సాయంకాలమునఁ బనినుండి విముక్తియును లేదు. ఇల్లుఁ జేరుటకుఁ బ్రతిదినమును నవసరమగు విద్యుచ్ఛకటము వానికీనాఁ డవసరము లేకపోయెను. నగరమునందు జరుగుచున్న వ్యాపారములు, భవనములు, గుఱ్ఱములు, శకటములు, వాణిజ్యములు వానికి నొక క్షణము సత్యములనియు, నొక క్షణము మిథ్యయనియుఁ దోఁచుచుండెను. ఆ దినమంతయు వానికి నిద్రగాని, యాహారముగాని, యాశ్రయముగాని లేదు. క్రమముగాఁ బ్రొద్దుగ్రుంకినది, రాజవీథుల దీపములు వెలిగించిరి. అప్రమత్తమైయున్న యంధకారపిశాచమునకు బలిగాఁ దలఁచుకొన్నట్లును, నది యుత్ఫుల్లనయనములతోఁ దన రాకను బ్రతీక్షించుచున్నట్లును వానికిఁ దోఁచెను. వానికెంత రాత్రియయినదియుఁ దెలిసికొనుటకు శక్తిలేకపోయెను. వాని తలమీఁదినాడులు కొట్టుకొనుచుండెను. తలపగులునంతటి తలనొప్పి బాధించుచుండెను. దుఃఖాతిశయముచే గ్రుంగుడువడునప్పుడుగాని, నిరాశచే వైరాగ్యమలవడినప్పుడుగాని మనుజునకేయుఁ దలంపునకు రాదుగాని హారలాలునకుమాత్రమా నగరములో సర్వజనులయందును స్మృతికివచ్చునది మాత్ర మాతని తల్లియొక్కతియె. వాఁ డామె పేరే శుష్కకంఠముతోఁ బదిసార్లుచ్చరింపఁదొడంగెను. "ఈ యర్ధరాత్రమందు మానవజన్మమెత్తినవారందఱిలోపలను నీచుఁడనైన నన్ను పట్టుకొనుట కెవ్వరును రాని యీ సమయమందు నేను మెలమెల్లఁగాఁ బ్రాకిపోయి మాయమ్మ చేతులనడుమ నిద్రించెదను. నాకు మరల మెలకువ రాకుండుఁగాఁత" అని తనలోఁదాననుకొనసాగెను.

రక్షకభటుఁ డెవ్వఁడేనిఁ దల్లి పొదిగిటనున్న తన్ను బాధించి మరలఁ దీసికొనివచ్చునేమో యను భయము వానిని మరల బాధింపఁజొచ్చెను. తన శరీరము తాను మోయుటయే వానికి బలువుగానుండుటం జేసి యొక బండి కన్పడఁగానే బండివానిని సంతోషముతోఁ బిల్చెను. ఎక్కడకుఁ దీసుకొనిపోవలెనని

బండివాఁడడిగెను. ఉద్దిష్టస్థల మేదియులేదు. మంచిగాలి తగులుటకు మైదానము మీఁదఁ గొంతసేపు సంచారముచేయవలెను అని చెప్పఁగా వాఁడు నమ్మక బండి పోనిచ్చుటయు నతని మాటఁబిలిచి ముందుగాఁ గూలికొరకు రూపిక యొకటి యిచ్చుటయు జరిగెను. బండివాడును హారలాలును బండిపై నిడుకొని రాజవీథులుదాటి మైదానమున నా ప్రక్కనుండి యీ ప్రక్కకును, యీ ప్రక్కనుండి యా ప్రక్కకును రెండుమూడుసార్లు బండిత్రిప్పెను.

హారలాలుఁడు రక్తనాడులడుగుచున్న తలను బండి కిటికీలోనుంచి కన్గవ మూసెను. మెల్లమెల్లఁగా బాధ తగ్గెను. శరీరము చల్లఁబడెను. హృదయము గాఢమైన శాంతి నవలంబించెను. అన్నివైపులనుండియు నిరతిశయ మోక్షానందము తన్నవలంబించుచున్నట్లుండెను. మధ్యాహ్నము మొదలుకొని సంతిడనుకను గతిహీనునిఁగాఁజేసి భయపెట్టుచుండిన నిరాశ యజ్ఞానమునఁ గలిగినదికాని సత్యము కాదు. ఆ భయము నహేతుకమైనదిగాని, సహేతుకమైనది కాదు. మోక్షము నిరవధికాకాశముననున్నది. ఆ శాంతి కంతములేదు. రాజునకుఁగాని, చక్రవర్తికిఁగాని, మఱియెవ్వనికిఁగాని యకించిత్కరుఁడైన యీ హారలాలును గారాగారమునందుంచుట కెవ్వనికి శక్తికలదు. సంసారబంధమునుండి విముక్తమగుచున్న యాతని హృదయమందు నీనుగాలగు తల్లిదండ్రి మఱియెవ్వరును సన్నిహితులై లేరు. ఆమె విగ్రహము క్రమక్రమముగా నంధకారావృతమైయున్నట్లుండెను. సమస్త రాజవీథులును, భవనములును, దుకాణములును వానికి మాత్రము మయములైయుండెను. ఆ సర్వవ్యాపినియగు తల్లి సాన్నిధ్యమున వాని సమస్త బాధలును, నాలోచనములును, జైతన్యంబును సర్వమణఁగి నశించెను. బాధయను నేఁడి గాలితో నిండియున్న శరీరబుద్బుదము పగిలిపోయెను. అప్పుడు చీకటిగాని, వెలుతురుగాని యేమియును లేదు. సంపూర్ణసిద్ధి యొప్పనొండేమియు లేదు.

గడియారము మొంటిగంటకొట్టినది. బండివాడు విసిగి బాబూ నా గుర్రము కనుపడు "మీరెక్కడికిఁ బోవలసియున్నది" అని బిగ్గరగా నడిగెను. ప్రతివచనము లేదు. "వాడు బండిదిగి హారలాలునుగదల్చి నీవెక్కడికి పోదువయ్యా" అని యడిగెను. బదులుమాట రాదు. వాఁడెన్ని ప్రయత్నములు గావించినను హారలాలునొద్దనుండి ప్రతివాక్యము రానేలేదు.

## 6. సుభాషిణి.

ఆ బాలికకు "సుభాషిణి" యని నామకరణముఁ జేసినపుడామె మూఁగది యగునని యెవ్వరెఱుంగుదురు? ఆమె యక్కలిద్దఱకును సుకేశిని యనియు, సుహాసిని యనియుఁ బేర్లు పెట్టిరి. నామసామ్యముకొఱకీపిల్లకును సుభాషిణియని పేరు వెట్టిరి. కొందఱామెను లఘూచ్చారణకొఱకు "సుభా" యనికూడ పిలుచుచుందురు. ఆడుపిల్లల వివాహములకుఁ బడవలసిన పాట్లుపడి చేయఁదగిన ద్రవ్యవ్యయముఁజేసి తల్లిదండ్రులు పెద్దపిల్లలిరువురకును వివాహములు చేసిరి. చిన్నకూతురిప్పుడే తల్లిదండ్రుల హృదయమునకు దిగలాగుచున్న బరువువలెఁ దోఁచుచుండెను. ఆ పిల్లకు వాక్కు లేదు కనుక చిత్తవృత్తులే లేని జనులనుకొనసాగిరి. అందుచేత నామె తల్లిదండ్రులామెఱుఁగునట్లుగాని భవిష్యత్స్థితినిగూర్చి చర్చింపసాగిరి. మనస్తాపమును వెలిబుచ్చ మొదలిడిరి. పిత్రువంశమునకు వ్యాధిగాఁ దన్ను భగవంతుఁడు సృజించెనని యా పిల్ల యెఱిఁగినట్లు పదిమందితోఁ గలసిమెలసి తిరుగక యొక మూలఁ గూర్చుండి తన స్థితినిగుఱించి యాలోచించుకొనుచుండెను. తన స్థితినిగూర్చి తల్లిదండ్రులు మాటిమాటికి విచారింపకుండిన బాగుండునని యామె యభిప్రాయముకాని యందెవరు గుర్తింపఁగలరు! ఇట్టి మనస్తాపమెవరు మాన్పఁగలరు! ఇట్టి విషయమునఁ దల్లిదండ్రుల హృదయము పరితపింపక మానదు. జననీజనకు లిరువురిలోఁ దల్లి తనకట్టికూతురు జనించుట గొప్ప కళంకమని మఱియుం విచారింపఁదొడఁగెను. కుమారునికంటెఁ గుమార్తె తల్లికి దృఢనిబద్ధమైన శరీరైకదేశముకదా! అందువలనఁ గుమార్తెల కేలోపములున్నను దల్లు లాలోపములు తమవిగాఁ దలంచుచుందురు. సుభాషిణితండ్రి రతికాంతుఁడు మాత్ర మామెను తక్కిన యిరువురు కుమార్తెలకంటె నెక్కువ ప్రేమమునఁ జూచుచుండెను. తల్లి తనకుఁ గళంకముగా భావించుచు విరక్తితోఁ జూచుచుండెను. సుభాషిణికి నోరలేదుగాని తక్కిన శరీరసౌందర్యమున కెందును లోపములేదు. • ఆకర్ణాంతములైన నల్లని నేత్రములును దొండపండువంటి యామె యధరోష్ఠమును గాలికాకులు కదలునట్లు చిత్తవృత్తి ననుసరించి కదలుచుండును.

మన యూహను వాక్కులద్వారా యితరులకుఁ దెలియపఱచునపుడు సరియైనమాటలు స్ఫురింపక సమగ్రముగాఁ దెలుపుట సాధ్యముగాక కొంత

స్థాలిత్యము సంభవించునుగాని నల్లని క్రీగంటిచూపులకు సాధ్యముకాకపోదు. దృష్టులు సంకల్ప ప్రతిబింబితములు. వేగవంతములై విరామములేకుండ మెఱయు మెఱుపుతీగలు నలుదిక్కులను ప్రకాశింపజేయునట్లు సంకల్పోన్మేషములు దృష్టులను మెఱయించుచుండును. చంద్రాస్తమయ సమయంబున దిక్కులు తిమిరావృతంబులై నిశ్చలములై యున్నట్లు చిత్తము సంకల్పశూన్యమైనయెడఁ దదభావముగూడ నేత్రములయందు స్ఫురింపక మానదు. మూగవారికిఁ బుట్టినదిమొదలుకొని యోష్ఠస్పందములు నేత్రచలనములే. అనంతభావ ప్రకాశకంబులై సముద్రమువలె గంభీరములై సూర్యోదయాస్తమయంబులందుఁ దేజస్తిమిరావృతంబై నిర్మలంబైన యాకాశమువలెఁ బ్రకాశమానంబులై వాగ్వ్యాపారమును జేయుచుండును. మూగవారికిగూడ ననుపసర్పణీయమగు నిట్టి శక్తి యభ్యాసమగుట సృష్టికి సహజమేకాని వేఱుగాదు.

ఆమె నివసించు గ్రామము చాందీపురము. వంగదేశనదులలో నల్పపరిమాణముగల యొక చిన్ననది చాల భాగ్యవంతముగాని వంశమునఁబుట్టిన కులాంగనవలె నియతిమర్యాదలను దాటకుండ నాపురముపజ్జఁ బ్రవహించుచుండును. గట్లుపొరలునట్లు పొంగక లోకబాంధవునివగిదిఁ బ్రాంతగ్రామములకుపకరించు నానదికిరుప్రక్కల వృక్షచ్ఛాయావృతములగు గట్లుకలవు. ఆ నదీదేవత తన రాజ్ఞీసింహాసనమునుండి దిగి వనదేవతవలెఁ బ్రతిగృహంబునకఱిఁగి తన గొప్పతనముఁ గన్పఱచక లోకోపకారకృత్యములే గావించుచుండును. రతికాంతునిగృహ మా నదిమొద్దుననే కలదు. ఆ నదిలోఁ బ్రయాణముచేయు ప్రతినావికునకును వాని పెరటిలోని కుటీరములును, గడ్డివాములును కన్పడుచుండును. ప్రాపంచిక విభవచిహ్నాలచేఁ బ్రజలదృష్టు లాకర్షింపబడుట సహజముగావున రతికాంతుని పెరటిలోఁ గష్టపడి పనిచేయుచుఁ బని ముగిసిన వెనుక నదీతీరమున విహరించుచుండు మన మూగబాలిక నే నావికుడైనను జూచెనో లేదో నాకుఁ దెలియదుగాని యామెకు వాగ్లోపమున్నను సృష్టిసహజములగు నితరవ్యాపారములచే నా లోపము తీరుచునేయున్నది.

నదీతరంగముల మందరవము, గ్రామస్థుల కంఠధ్వనులు, నావికులపాటలు, పక్షులరుతములు, వృక్షముల మర్మరధ్వనులును కలసి యా మూగబాలిక యశాంతచిత్తమున ధ్వనిచేయుచునేయుండెను. సృష్టిలోని యీ నాదములే యామె శబ్దములు. అయతములైన నల్లని యామె నేత్రప్రసారములే మాటలు. కోకిలలుకూయుచున్న చెట్లుమొదలుకొని నక్షత్రమండలముపర్యంతము నన్నిం

టికి నన్నింపజ్ఞలే. అంగవిక్షేపములు, రోదనములు, నిట్టూర్పువిడచుట తప్ప నింకేవియులేవు. . . . .

ఏ కాలమునందు నావికులును, బల్లెవాండ్రును భోజనములకై యిండ్లకుఁ బోదురో, యే సమయమునఁ బక్షులు నిశ్శబ్దములైయుండునో, యే వేళఁ గ్రామస్థులు నిదురించుచుందురో, యెప్పుడు రేవు నావలకుఁ బనిలేకయుండునో, భయంకర రాక్షసునివలెఁ గన్పడునట్టి మిట్టమధ్యాహ్న సమయంబున హృదయముఁ గమగు నాకాశముక్రిందఁ దీక్ష్ణమైన సూర్యరశ్మిలో మాటికిఁ దాపము సహించిన ఆ నిశ్శక్తియును చెట్టునీడయందే మూగబాలికయుమాత్రమే యుండిరి

సుభకు కేవలము స్నేహితులు లేకపోలేదు. పసులకొట్టములో "శర్వాషి, బంగారి" యను పేర్లుగల రెండావులుండెను. ఆమె పేర్లతోఁ బిమ్ముఁ బిలచుచుండగా నవి యెన్నఁడును వినలేవుగాని యా యావుల కామె కాలిచప్పుడు తెలియును. ఆమె తనకు మాటలు రాకపోయినను నెమ్మదిగఁ జాలప్రేమతో ధ్వనిచేయుఁగా మాటలకంటె నెక్కువగా నా ధ్వనియభిప్రాయమా యావులు గుర్తించుచుండును లాలించినప్పుడుగాని, కోపపడినప్పుడుగాని బ్రతిమాలినప్పుడుగాని యామె యభిప్రాయమవి మనుష్యులకంటె నెక్కువగాఁ దెలిసికోఁగలవు. ఆమె పసులకొట్టములోనికివచ్చి యా యావుల మెడలు కౌఁగిలించుకొనినప్పుడవి తమ ముట్టెతో నామె కపోలములను రాచియు, ముఖము నాకియు మిగుల ప్రేమ కన్పఱచుచుండెను. ఆమె ప్రతిదినము తప్పక మూఁడుసార్లా యావులను చూడవచ్చుట తప్పదు. తీరికయినచో నింకను గొన్ని పర్యాయములు చూచుచుండును. వారలెవరయిన నామె మనస్సును బాధించు మాటలాడినప్పుడామె యా మూగస్నేహితులయొద్దకు వచ్చి తన మనస్తాపము తెలుపుచుండుట మర్యాదకలదు. అవియు నామె మనస్తాపమును దెలిసికొని మూగపద్ధతినే నామె నూరడించుటయుఁ గలదు. ఈ రెండు గోవులుగాక నింకఁ గొన్ని మేకలును, నొక పిల్లికూనయును నామెకు మిత్రములు కలవుకాని యావులపై నున్నంత ప్రేమ యామె కితర జంతువులమీఁద లేదు. రాత్రిగాని, పగలుగాని సమయముదొరకినపుడా పిల్లికూనయు నామె తొడమీఁద బడి నిద్రించును. ఆమెయు దాని బొచ్చుమీఁదఁ జేతితో నెమ్మదిగా నిమురుచుండును అది హాయిగా నిద్రించుచుఁ దన యానందమును దెలుపును.

తిర్యగ్జంతువులందుఁ గాక మనుష్యులయందును నామెకొక స్నేహితుఁడు కలఁడు. వారిరువురకు నెట్లు మైత్రికలిసినది చెప్పుట కష్టము. వానికి

మాటలు వచ్చును, ఈమెకు రావు. మైత్రి యేగతి కలిగెనో తెలియదు. వాని వంశము పేరు గోసివంశము. వాఁడు చాల సోమరి అల్లరిపోతు. పేరు ప్రతాపుఁడు వీనికి బ్రతుకుతెరువేదిరాయని తల్లిదండ్రులు విచారించుచుఁ జాలకాలము వాని యల్లరితనము మాన్పింపవలయునని ప్రయత్నించి సాధ్యము కాక విసిగి వేసారి వదలిరి. అల్లరిపిల్లలు చాలవరకు బంధువుల కిష్టులుకాక పోయినను నితరులకుమాత్రము చాల నిష్టులుకాకమానరు. ఒకచోట బద్ధులుగాక స్వేచ్ఛగాఁ దిరుగుచుండుటవలన వారికిఁ జాలమంది పరిచితులగుదురు. ప్రతి గ్రామమునకును వలసినవారికి విశ్రాంతికై యనావృతనిర్మలవాయు ప్రదేశ మవసరమగునట్లుండటతోడను దీనికగా మాటలాడఁగల యొకరిద్ద రుండుట ప్రతి గ్రామమునకు నవసరమే. పనిలేక ప్రొద్దుపోకయున్నతిరి నట్టి స్నేహితులతోఁ గాలక్షేపనముఁ జేయవచ్చును. ప్రతాపునకు నన్ని పనులకంటె ముఖ్యమైనపని గాలముతోఁ జేపలుపట్టుట. వాఁడు ప్రతి సుట్ట మధ్యాహ్నమందును జేపలను పట్టుచుండును. ఆ సమయమునందే సుభకు వాఁడు కన్పించుచుండును. ఏ పనిచేయుచున్నను సహచరుఁడొకఁడుండుట వానికిష్టము. చేపలుపట్టు సమయమందు నిశ్శబ్దముగానుండు సహచరుఁ డుండుట చాల మంచిది. ఆమె మితభాషిత్వమునకుఁ బ్రతాపుఁడు మిగుల సంతసించువాఁడు. ఇతరులామెను సుభాయని పిలువఁగా వాఁడు "సు" యని మాత్రమే పిలుచుచుండెను. చింతచెట్టుక్రింద సుభ పరుండుటయు నేటి యొడ్డున నెండలోఁ బ్రతాపుఁడు చేపలుపట్టుచుండుటయుఁ బ్రతిదినము జరుగుపనియే. ప్రతాపుఁడు తెచ్చుకొన్న తమలపాకులకు సుభ సున్నము రాచియిచ్చుచుండుటయుఁ గలదు. చింతచెట్టుక్రిందఁ గూర్చుండి 'ప్రతాపునకేదేని మహోపకారము గావించెదనా? అట్లుచేసి యీ నా శరీరము ప్రపంచమునకు భారముకాదని ఋజువుచేసెదనా" అని యామె లోలో పల దలఁచుకొనుచుండునుగాని యీ మూగబాలిక ప్రతాపునకుఁ జేయఁ దగిన మహోపకార మేదికలదు? ఏదేని నద్భుతమగు పనిచేసి ప్రతాపుని మెప్పించి "ఆహా సుభాషిణీ నీ వీలాటిపని చేసెదవని నేను గలలోనైనఁ దలంపలేదు సుమీ" యని ప్రతాపునిచే ననిపించుకొనునట్లుచేయుమా భగవంతుఁడాయని సర్వదా దేవుని ప్రార్థించుచుండెడిది.

చదువరులారా! మీ రూహింపుఁడు. సుభాషిణి నదీదేవతయైనయెడలఁ బాతాళమునకుఁబోయి యందున్న సర్పరాజు పడగయందలి మాణిక్యముం దెచ్చియిచ్చినచోఁ బ్రతాపుఁడీ పనివదలి మరల నదిలోమునిగి పాతాళలోక

మున రాజభవనమందు శయనించియున్న సుభాషిణిని చూచుట తలఁచ్చిం చును గాని యట్లు చేయుట సాధ్యమగునా? సుభాషిణి పాతాళపురాధిపతి వంశమునఁ బుట్టినది కాదు. అట్టి యదృష్టమును లేదు. సామాన్యుఁడగు రతికాంతుని యింటఁ బుట్టినది. ఈమెకుఁ బ్రతాపునకు మహిమాంగం జేయుఁదగినపని యేమున్నది? ఏ యుపాయమును తోఁచలేదు.

సుభాషిణి క్రమముగాఁ బెఱిగి పెద్దదయినది. ఆమెకుఁ దిన సంగతి గోచరము కాఁజొచ్చెను. పూర్ణచంద్రుఁడుదయించినప్పుడు సముద్రము పొంగినట్లు యౌవనోదయము కాఁగానే యామె కనిర్వచనీయమగు నాత్మానుభవము కలిగెను. తన మతినే తాను పరీక్షించుకొనుచుండును ప్రశ్నించుకొనుచుండును గాని ప్రత్యుత్తర మేమియు నచ్చుటలేదు.

ఒకానొక పూర్ణిమనాటిరాత్రి సుభ చాల ప్రొద్దుపోయినపిమ్మటఁ దలుపు తీసుకొని భయపడుచు బయటికివచ్చెను. సర్వజగదంతరాత్మయగు నాదిశక్తియు సంపూర్ణతేజస్సుతో సుషుప్త్యవస్థయందున్న లోకమును సుభాషిణి వలెనే యేకాకినియై చూచుచుండెను. సంతోషవిషాదములతోనిండియున్న సుభాషిణి హృదయము కొట్టుకొనఁజొచ్చెను. జగన్మాతయగు నాదిశక్తియు మాటాడక పోయెను. మూకీభావము వహించియున్న యాదిశక్తియెదుట మూగబాలికయు విచారగ్రస్తయై నిలుచుండెను.

సుభాషిణి తల్లిదండ్రులకు మూగదాని వివాహము మాట తల పెట్టినపుడెల్ల మనస్సు వ్యాకులమగుచుండెను. జనులు వారిని నిందింప మొదలిడిరి. వెలి వేయవలయునని కూడ నాలోచింపసాగిరి. రతికాంతుఁడు కొంచెము సంపన్నుఁడు. పగటులందు రెండుపూటలు వారియింట చేపలకూర తప్పక నుండుచుండును. అందుచే వానికి యూరివారిలో చాలమంది విరోధులు కలరు. ఇంటవాడువాండ్రుకూడ సుభ పెండ్లికై త్వరపెట్టుచుండిరి. ఇట్లుండ రతికాంతుఁడొకసారి కలకత్తాకుఁ బోయి మరలవచ్చి మనమందరము కలకత్తాకుఁ బోవలయునని చెప్పెను.

ఆ క్రొత్తదేశమునకుఁ బోవుటకు వారందఱును సంసిద్ధులైయుండిరిగాని సుభాషిణి మొగముమాత్రము హిమావృతమైన సూర్యోదయకాలమువలెఁ గన్నీళ్లతోనే నిండియుండెను. తనకేదో కష్టము సంభవింపనున్నదని యనిర్ణీతమైన భయము కొన్నిదినములనుండి సుభాషిణిని బాధించుచున్నందున యజమానుని వెంబడించు కుక్కవలె సర్వదా తండ్రినే యనుసరించుచుండెను. విశాలములైన నేత్రములు తెఱచి యేదో సంగతి తల్లిదండ్రులనడిగి తెలిసికొను

గానివలె వారి మొగములనే పరిశీలించుచుండెనుగాని వారామెను దయతో నొక్క సంగతియైనను నడుగలేదు, చెప్పలేదు ఇట్లు కాలము కడచుచుండ నొకనాటి మధ్యాహ్నము ప్రతాపుడు యథాప్రకారముగాఁ జేపలను పట్టుకొనుచు నవ్వి "సుభా నీకొరకుఁ బెండ్లికొడుకును వెదకి వెదకి వలవైచి చేపలను బట్టుకున్నట్లు పట్టుకున్నారు. నీవుఁ గొలదిదినములలోఁ బెండ్లి కాఁగలదు గాఁ గ్రొత్త నన్నుమాత్రము మఱువవలదు" అని చెప్పి మరల జేపలనుబట్ట దృష్టిమరల్చెను.

బాణముచేఁ గొట్టఁబడి మరణబాధనొందుచున్న చేఁప "నేను నీకేమి యపకారముఁ జేసితినిరా" యని వాపులతోనే యడుగుచున్నట్లు సుభాషిణి ప్రతాపునివంకకుఁ జూచెను. తరువాత నొక నిముషమైనను చింతచెట్టు క్రిందఁ గూర్చుండలేదు. రతికాంతుఁడు మధ్యాహ్ననిద్ర యనుభవించుచుఁ బొగఁబీల్చుచుండఁగా సుభాషిణి యతని పాదములపైఁబడి యేడ్వనారంభించెను. తండ్రియు నామె నోదార్పఁ బ్రయత్నించెనుగాని కన్నీరు కపోలములనిండ దిగజారి గద్గదస్వర మునకైను.

మరునాఁడుదయమునఁ గలకత్తాకుఁ బోవలయునని నిశ్చయించిరి సుభయును చిన్నతనమునుండి మిత్రులుగానున్న యావులయొద్ద సెలవుతీసుకొనుటకు గోశాలకుఁ బోయెను. చేతులారఁ నాహారముఁ దినిపించెను. వాని మెడలు కౌఁగిలించుకొనెను. వాని కంఠడోలికలు దువ్వెను. వాని మొగము వంకఁ దదేకదృష్టితోఁ జూచెను. మదిలోనున్న యూహాలను మాటలకంటెఁ విస్పష్టముగాఁ జెప్పుచున్న యామె కన్నులనుండి కన్నీరు కాఱఁజొచ్చెను. ఆనాఁడు శుద్ధదశమి. సుభాషిణియుఁ దన గదినుండి వెడలి ప్రియమైన నదీతీరమునకుఁ బోయి మూగవారితియైన భూమాతమీఁద బాహువులుసాచి "తల్లీ నన్ను విడిచిపోనీకుము, నిన్ను నే నాలింగనముఁ జేసికొన్నట్లు నీవు నన్నాలింగనముఁ జేసికొనుము" అని చెప్పుచున్నట్లుండెను.

కలకత్తాలో వారు కాపురమున్నయింట నొక దినమున సుభాషిణితల్లి క్రొత్తగా నొడలునిండ నగలు శృంగారించుకొని తలదువ్వుకొని నగలుధరించి సహజమైన యందమును బాడుచేసికొనుటకుఁ దగిన ప్రయత్నములు చేయుచుండఁగాఁ జూచిన సుభాషిణి కన్నవ కన్నీటితో నిండియుండెను. ఏడిచితివేని కప్పులుబ్బిపోవునని తల్లి చీవాట్లుపెట్టెనుగాని యామె చీవాట్లు కన్నీళ్లు లక్ష్యపెట్టకపోయెను. పెండ్లికొడుకొక మిత్రుని వెంటఁబెట్టుకొని కన్యకను జూచుటకై వచ్చెను. వివాహయజ్ఞమునకు వధూపశువును స్థిరపఱచుటకుఁ

పెండ్లికుమారుఁడు వచ్చినప్పుడా కన్య తల్లిదండ్రులు [illegible] మేరీతిగ నుండునోయని వ్యాకులచిత్తులై యుండిరి. [illegible] గృహస్థలమునకు [illegible] తల్లి నిలుచుండి యుపదేశవాక్యములఁ బిగ్గరగా [illegible] సమ్మతము నకు. బంగారు పూర్వము కన్యయెప్పు ద్విగుణ[illegible] చేసెను. ఆ పరీక్షకుఁడు దీర్ఘకాలము పరీక్షించి "అంత అందములేనిది కాదు" అన్న [illegible]ముగాఁ గన్నీళ్లు చూచి యామె హృదయమతి కోమలమైనదనియుఁ దల్లిదండ్రులను వదలుటకిష్టపడ కింతగా దుఃఖించుచున్న యీమె మున్ముందుఁ జాల నుపయుక్తమైనదియు స్వాధీనవస్తుజాతియు నగుననియుఁ దలంచెను. ముత్యము లెక్కువైనకొలఁది శుక్తిపుటము వెల హెచ్చినట్లు కన్నీళ్లు పెండ్లికూతునం దాదరము హెచ్చించెను. అంతియే కాని యితరపరీక్ష యేమియుఁ జేయక వధువనుకూల యని సంతసించెను.

పంచాంగముఁ జూచిరి వివాహముహూర్తము స్థిరపఱచిరి. ఆ మూగ కన్యను వరుని చేతిలో నప్పగించి తల్లిదండ్రులింటికి చేరెంచిరి. దేవుని దయ చేత నీ లోకమునఁ గలుగు నపాయమును, పరలోకమున గలుగు నపాయమును దప్పిపోయినదని సంతసించిరి. పెండ్లికుమారునకుఁ బశ్చిమగ్రామప్రాంతములయందు నుద్యోగము. అతఁడు వివాహము కాఁగానే తన భార్యను వెంటఁ బెట్టుకొని తన నివాసగ్రామమునకుఁ బోయెను.

తరువాతఁ బదిదినములు కాకపూర్వమే పెండ్లికూతురు మూగదియని యందఱికిని దెలిసెను. మూగదని యందఱికిని దెలియకపోవుటయం దామె తప్పేమియు లేదు. ఆమె యెవరిని మోసపుచ్చుటకుఁ బ్రయత్నింపలేదు. ఇతరులు తెలిసికోలేకపోయినను నామె తన విశాలనేత్రములతో సర్వమును దెలుపుచునేయుండెను. చిన్నతనమునుండియు స్నేహితులై తన మూగభాష గ్రహింపఁగలిగిన యావులు మొదలగు తిర్యగ్జంతువులను వదలినందుకామె యెంతయుఁ బొగిలెను. ఆమె మూగహృదయమును నిరవధికమైఁ దెలుపుట కసాధ్యమైన యొక విచారముమాత్రము బాధించుచుండెను. ఆ విచారము సర్వజనహృదయపరీక్షకుఁడైన పరమాత్మకే వేద్యముగాని యితరుల కవేద్యము.

## 7. పోస్టుమాస్టరు.

ఒకఁడు ప్రప్రథమమున మాలపూరను గ్రామమునందు "పోస్టుమాస్టరు" గానుండెను. ఊరు చిన్నదైనను నూరిసమీపమున నీలిమందు తయారుచేయు

LIBRARY

యంత్రశాలయుంటంజేసి తదధికారియగు నాంగ్లేయుని ప్రేరణచే నంగు "పోస్టు ఆఫీసు" ఉంచిరి.

ఈ పోస్టుమాస్టరు కాపురము కలకత్తా. ఈ చిన్న గ్రామమందుండుటతనికి నీటనుండి బయటికి విసరివేయఁబడిన చేపకున్నంత కష్టముగానుండెను. అతని కార్యస్థానమునకును, నివాసమునకును నాచుపట్టిన పచ్చని పసరునీటితో నిండియున్న యొక ముఱికిగుంట సమీపమునందున్న యొక చీఁకటికొంప యేర్పఱుపఁబడెను. ఆ యింటిచుట్టు గడ్డి దట్టముగాఁ బెఱిగి చుట్టుకొనియుండెను

ఈ నీలిమందు యంత్రశాలలోఁ బనిచేయువారి కేమాత్రమును దీరికయుండదు. అదియునుంగాక వారు నాగరికులకు మిత్రులుగా నుండఁదగినవారు కారు. మఱియుఁ గలకత్తాలోఁ బెరిగిన బాలకుడు జానపదులతో స్నేహముఁ జేయలేఁడు. అపరిచితజనుల సాన్నిధ్యమున గర్వితుడుగాఁగాని, మనస్స్వాస్థ్యము లేనివాఁడుగాఁగాని కన్పడును. ఎందువలననైననేమి మన పోస్టుమాస్టరునకు స్నేహితులు తక్కువ. చేయఁదగినపనియుఁ దక్కువయే.

ఈ పోస్టుమాస్టరు కొంచెము కవిత్వముఁ జెప్ప వాఁడుక కలవాఁడు వృక్షదళములు కదలునప్పుడును, నాకాశమందు మేఘములు చలించునప్పుడును వానికి పరిమితానందము గలుగుచుండును. అట్టి భావములు తన కవిత్వమునఁ బ్రకటించుటయు వానికానందమే. కల్పనకథలలోని భూతమేదే నొక్క రాత్రి చనుదెంచి ఈ చెట్లను, నాకులను మాయముఁజేసి ఘంటాపథంబులతోడను జెట్లను గన్పడకుండఁజేయు ప్రాసాదములతోడను, విశాలమగు నగరమొకటి నిర్మించినయెడల నతనికిఁ బునర్జీవితము గలుగునట్లుండును.

ఈ పోస్టుమాస్టరునకు జీతము స్వల్పము. ఈతఁడు స్వయముగ వంటఁజేసికొనియే భుజించును. భుజించినపిదప భుక్తావశేషమును దినుచు వానికి గావలసినపనులు చేసిపెట్టు రత్నమ్మయను నొక పరిచారిక కలదు. దానికిఁ దల్లియుఁ దండ్రియునులేరు. ఏకాకిని, దిక్కుమాలినది.

పొగ పూరిండ్లనుండి పెంగరములవలె సుంత్రముగాఁ బయటికివచ్చుటయు బక్షులు చెట్లపైఁ గూయుచుండుటయు సన్యాసులు తమ నివాసస్థలములకుఁ జనుదెంచి భక్తికీర్తనలు కీచుగొంతుకలతోఁ బాడుచుండుటయు మొదలగు సంగతులు జఱుగుచుండు ప్రతి సాయంకాలమందును బోస్టుమాస్టరు తనయింట దీపము వెలిగించి, రత్నమ్మా! యని పిలుచుటయు వానిపిలుపు ప్రతీక్షించుచున్న రత్నమ్మ 'నన్నుఁ బిలచినారా'" యని యడుగుటయు "నేమిచేయుచున్నాన"

నవుడు "ప్రాయ్యిలో నిప్పు చేయుటకుఁ బోవుచున్నా"నని ప్రత్యుత్తరమిచ్చుటయు "నా చుట్ట వెలిగించిపో" యనినంతలో నూపిరి గాలితో నొక బొగ్గు రాఁజఁజేసి వాని చుట్ట వెలిగించి పోవుటయు నిత్యాచారము. చుట్ట వెలిగించుటకు లోనికివచ్చినప్పుడే పోస్టుమాస్టరుగారికి రత్నమ్మతో సావకాశముగా మాటలాడుటకవకాశము. ప్రతిదినమునందును రత్నమ్మ తల్లిదండ్రులను గురించియు, నన్నదమ్ములను గుఱించియు, వారు పనిపోయినవిషయములను గుఱించియు మఱియు, దాని కుటుంబవృత్తాంతములనుగుఱించి గ్రుచ్చిగ్రుచ్చి జ్ఞాపకమున్నదా! యని ప్రశ్నించుచు నిష్టగోష్ఠి చేయుచుఁ దన వంటసంగతియే మఱచిపోఁగా రత్నమ్మ త్వరగ నిప్పురాఁజఁబెట్టి వానికొక రొట్టె కాల్చి యిచ్చుచుండుటయు నిత్యవిధిగా జరుగుచున్నదనియే. రత్నమ్మయుఁ బోస్టుమాస్టరుగారు తన కుటుంబమునుగుఱించి యడిగినప్పుడు కన్నీళ్లు తెచ్చుకొనుచు కొంతసేపు విచారించుచుండుటయుఁ గలదు. తల్లిదండ్రులు మొదలగువారున్నతఱి సుఖముగాఁ దాను గడపిన కాలమూపన మూ పిల్లకు జ్ఞాపకము లేకపోలేదు. వారి మాటలు స్మృతికిఁ దెచ్చుకొనుచు వారి రూపములు మనఃపటమునందుఁ జిత్రించుకొనుచుఁ గాంలసినయెడలఁ బోస్టుమాస్టరు కోరుపనులు చేయుచు నా సుబ్బది కాలముఁ గడపుకొనుచుండెను.

ఒకనాఁటి మధ్యాహ్నము వర్షముకురిసి వెలిసినపిదపఁ జల్లని మందమారుతము వీఁచుచుండెను. ఎండిన యాకులమీఁదను, నెండిన పుడమిమీఁదను తోఁక వానకురియుటచేఁ గమ్మని పరిమళము బయలుదేరెను. అలసిన భూకాంతవేఁడి నిట్టూర్పు నిగుడించుచున్నట్లుండెను. చెట్టుపైనున్న యొకపక్షి ప్రకృతి సౌభాగ్యమును వర్ణించుచున్నట్లుఁ జక్కని ధ్రువాగానము చేయుచుండెను.

వర్షస్నాతములైన యాకులకాంతియు చెదరిపోయి మరల గుంపగుచున్న మేఘముల రామణీయకంబునుఁ దీరికగాఁ గూర్చుండి చూచుచు 'ఇట్టిసమయమందు నాకు హృదయంగముఁడగు మిత్రుఁడొకఁడు నా దగ్గరనుండినచో నెంత బాగుండునో'' యని విచారించెను. ''ఆ పక్షి కూయుకూఁతల కిదే సుమా యర్థము. మర్మరధ్వని చేయుచున్న పత్రచలనమునకును నిదియే భావము'' అని పెక్కువిధములు వితర్కించెను. కొలఁదిజీతముగల పోస్టుమాస్టరున కామధ్యాహ్నకాలమందు నిశ్శబ్దముగఁ గూర్చున్నతఱి నిట్టి వేనవేలు మనోభావములుదయించెనన నమ్మువారెవరు!

పోస్టుమాస్టరాసమయంబున, "రత్నం, రత్నం" అని పిలచెను. రత్నమ్మయు నాకాలమున జామచెట్టుక్రిందఁ గాళ్లుసాచి పరుండి పచ్చిజామకాయ కొఱుకు

కొని తినుచుండెను. యజమానుని పిలుపువిని యూపిరి యాడనంత వేగముగఁ బరుగెత్తుకొనివచ్చి "బాబూ బాబూ పిలిచినారా?" యని యడిగెను. నీకుఁ జదువు చెప్పవలయుననుకొంటిని రమ్ము అని దగ్గరఁ గూర్చుండఁబెట్టుకొని యా మధ్యాహ్నమే పోస్టుమాస్టరు రత్నమ్మ కక్షరములు నేర్పెను. ప్రతిదినము తీరికయిన వేళఁ జెప్పుచుండగా నామెకు సంయుక్తాక్షరములు కలిపి చదువుట గూడ యలవాటయ్యెను.

వర్షాకాలమున కంతము లేదా యన్నట్లు వర్షము లెక్కువగాఁ గురియు చుండెను. కాలువలు, కందకములు, చెరువులు, గుంటలు, నదులు నీటితోఁ బొర్లుచుండెను. రాత్రిందివములు వర్షధ్వనియుఁ, బిడుగులరొదయుఁ, గప్పల బెకబెకలును దప్ప రెండవధ్వనియే లేకుండెను. గ్రామవీధులు సైతము దాటుటకు వీలులేని నీటిపాఱుదలతో నిండియుండెను. సరకులు తెచ్చికొనుటకుఁ బౌరులు నావలమీఁదనే పోవలసివచ్చెను.

ఒకనాఁటి ప్రాతఃకాలమునందాకాశము మేఘచ్ఛన్నమై యుండమై యుండె రత్నమ్మ పోస్టుమాస్టరుగారి శిష్యురాలు తన్ను యజమానుడెప్పుడు పిలుచునో యని గుమ్మముదగ్గర కూర్చుండెను ఎంతసేపటికిని బిలుపురానందున మూలలు నలిగిపోయిన తన పాఠపుస్తకము జేతఁబట్టుకొని నెమ్మదిగ గురువుగారి గదిలోఁ బ్రవేశించెను. మంచముమీఁదఁ బరుండియున్న యజమానునిఁ జూచి కాలిచప్పుడు కాకుండ మరలిపోవుచున్న రత్నమ్మఁ జూచి పిలచిన నామెయు మరలి "బాబూ నిద్రపోవుచున్నారా, పోదు" అనినంత నా పోస్టుమాస్టరు "రత్నా నాకు శరీరము స్వస్థముగాలేదు. నా యొడలు తాఁకి చూడుము వెచ్చగానున్నదేమో!" యని యడిగెను.

అట్టి వర్షాకాలమందే సాఁగా ప్రవాసము చేయుచున్న యతని శరీరము కించిత్ రోగపీడితమగుట కష్టమేమున్నది. అట్టితఱి నతనికి కొంత మృదూపచారము కావలసియేయున్నది. ఝుణంఝుణప్రోగు కంకణములు గల కాంతయో లేక తల్లియో లేక సోదరియో సమీపమునందున్న బాగుండును కదా యని యనుకొనుటయుఁ జిత్రముగాదు. ఆ విదేశవాసి కాశాభంగము కలుగకుండ పరిచారికయై శిష్యురాలైయున్న రత్నమ్మయే యతనికి మాతృస్థానమధిష్ఠించెను. గ్రామమందున్న వైద్యులఁ బిలిపించెను. వారు చెప్పిన ప్రకారముగా యుక్తకాలమున నౌషధమునిచ్చుచు జావలు కాఁచియిచ్చుచు రాత్రియుంబగలు ప్రక్కదగ్గరనుండి యుపచారము చేయుచు "బాబూ కొంచెము నయమేనా?" యని యడుగుచుండెను.

శరీరము మతిదుర్బలమగుటచే నా రోగి నిరోగుడగుటకుఁ గొంతకాలము పట్టెను. తరువాత నిశ్చయమనంబుతో "నాకీ గ్రామవాసము సరిపడదు" అని తలచి, "నన్ను ఇంకొక గ్రామమునకుఁ బంపవలసిన"దని పై యధికారులకు విన్నపముఁ బంపుకొనెను.

పోస్టుమాస్టరు గారి శరీరమారోగ్యవంతము కాఁగానే యథాప్రకారముగా రత్నమ్మ పరిచారికగానే యుండెను గాని ప్రస్తుతముఁ గుర్చీపైఁగూర్చున్న తెరినైనను బలిపుమీఁద బరున్నయొతనైనను శూన్యహృదయముతో నాలోచించుచున్నప్పుడైనను వాని పిలుపక్కఱలేకుండగనే పడుకగదిలోనికిఁ బోవు స్వాతంత్ర్యముకలదయ్యెను. మరలఁ జదువుచెప్పుట కాయన ప్రారంభించునప్పటికి వచ్చిన యక్షరములు నాలుగు మఱచిపోదునేమోయను భయంబున, పదే పదే వచ్చినంతవఱకే చదువుకొనుచుండెను. గాని యామె మానలేదు. ఇల్లు వారముదినములయినపిదప నొకనాడు రత్నమ్మాయని యతఁడు పిలచెను. సంతోషముతో లోనికింబోయి, బాబూ నన్ను పిలచితిరా! యని యడిగెను. అతఁడు "నేను రేపట నీ యూరునుండి పోవుచున్నా"ననియెను

రత్నమ్మ.—ఎక్కడికి పోయెదరు!

పోస్టుమా.—మా స్వగ్రామమునకు.

రత్నమ్మ.—మరల నెన్నఁడు వత్తురు!

పోస్టుమా—మరల నేను రాను.

రత్నమ్మ మరల నేమియు నడుగలేదు. అడుగకపోయినను "నేను ఈ గ్రామములో నుండనొల్లక మఱియొక యూరునకు బదిలీచేయుమని కోరఁగాఁ బైయధికారులు మన్నింపనందున నేనీ యుద్యోగమే మానుకొనిపోవుచున్నాను" అని పోస్టుమాస్టరు చెప్పెను. తరువాతఁ గొంతసేపువఱకును వారిరువురిలో నెవరును మాటలాడలేదు. దీపకాంతి మిణుకుమిణుకుమనుచుండెను. ఇంటికప్పులోనున్న రంధ్రము వెంబడి వాన క్రిందనున్న కుండమీఁదఁబడి ధ్వనిచేయుచుండెను. తరువాతఁ గొంతసేపటికి రత్నమ్మ వంటచేయుటకు వంటయింటిలోనికిం బోయెను గాని వెనుకటిదినములయందువలె నాఁడు త్వరగ వంటచేయలేకపోయెను. ఆలోచింపఁదగిన పెక్కువిషయము లామె హృదయమందుఁ బ్రవేశించెను. పోస్టుమాస్టరు భుజించినపిదప, రత్నమ్మ "బాబూ నన్నుఁగూడ మీ వెంట దీసుకొనిపోదురా లేదా!" యని యడిగెను. పోస్టుమాస్టరు "ఏమీ! ఆలోచన" అని నవ్వెను. ఆమెకోరిక అనుపపన్నమైనదని యాతనికిఁ దోఁచెను. జవాబుఁ జెప్పుటావశ్యకమని యతనికిఁ దోఁచలేదు.

ఆ పరిహాస ప్రత్యుత్తరమునకు రాత్రి నిద్రయందేమి మెలకువయందేమి రత్నమ్మమనస్సు పరితపించుచుండెను.

ఉదయమునఁ బోస్టుమాస్టరుగారు లేచునప్పటికి యథాప్రకారముగాఁ గుండలనిండ నీరు నిండియున్నది. రాత్రి కుండలనిండ నీరునించి యుదయమున స్నానముచేయుచుండుట కలకత్తావారల యాచారమతఁడీ కుగ్రామమునందును నవలంబించియే యుండెను. స్నానముచేసినపిదప నతఁడు "రత్నమ్మా" యని పిలచెను. నిశ్శబ్దముగా గదిలోఁ బ్రవేశించి యేమి యానతియిచ్చునోయని యతని ముఖమువంక దృష్టినిగుడ్చి రత్నమ్మయు నిలవబడెను. "నేను పోవుచున్నానని నీవు విచారపడకుము. నా తరువాతవచ్చు నధికారితో నీ విషయము చెప్పిపోయెదను" అని చెప్పెను. పోస్టుమాస్టరీమాటలు రత్నమ్మ మంచికొఱకే చెప్పెననుటకు సందియములేదుగాని స్త్రీ హృదయము లగాధములుకదా!

ఇంతకుమున్ను నేకపర్యాయములు యజమానుని తిట్లుగూడ సహించెనుగాని నేఁడతని ప్రియవాక్యములు సహింపలేక రత్నమ్మ యొక్కపెట్టున గోలఁ బెట్టుచు "నయ్యా నా నిమిత్తము తమరెవ్వరితోఁడను జెప్పనక్కరలేదు, మీరు లేనినాఁడు నాకిక్కడనుండుటయే యిష్టముగాదు" అని కాళ్లపైఁబడెను. పోస్టుమాస్టరుత్తరముఁ జెప్పుట కసమర్థుఁడయ్యెను. రత్నమ్మ యీగతి మాటలాడుటతఁడెన్నఁడును వినియుండలేదు. క్రొత్త పోస్టుమాస్టరుగారు చనుదెంచిరి. అతనికాపని యొప్పగించి ప్రాఁతయతఁడు సన్నద్ధప్రయాణుఁడయ్యెను. ప్రయాణమగుచు రత్నమ్మంబిలచి, ఇదిగో నీకు గొంత సొమ్మిచ్చుచున్నాను. ఇది నీకు గొన్నిదినములకుఁ జాలును. "ఇది ప్రీతిపూర్వకముగాఁ గ్రహింపుము" అని తన సెలజీతములోఁ బ్రయాణమునకుఁ గావలసినదిమాత్రము దగ్గరనుంచుకొని మిగిలినదంతయు నీఁబోయెను. బాబూ మీరు నన్నుఁగుఱించి శ్రమపడవలదు, నా మాట వినుఁడు. "నాకేమియు మీరీనక్కరలేదు" అని నుడువుచు నంతర్హితురాలయ్యెను.

పోస్టుమాస్టరు దీర్ఘముగా నిట్టూర్పునిగుడించి తన సంచితీసుకొని గొడుగు ధరించి రేకుపెట్టె నొక కూలివానిచేతికొసఁగి పడవరేవొద్దకు మెల్లదిగా నడచి పోయెను.

వాఁడు పడవలోఁ గూర్చున్నతరువాత నా పడవ భూమిలోనుండి యుబుకుచున్న యశ్రుప్రవాహమువలెఁ బొంగుచున్న యా నదిమీఁదఁబోవుటకు సిద్ధముగానున్నతఱి యాతని హృదయమున నాఁగరాని పరితాపము జనించెను. అవ్యక్తమధురమైన యా గ్రామ్యబాలిక మొగమతని కన్నులకుఁ

గట్టినటులుండ నామెను వెంటఁదీసుకొనిపోవలెనను తలంపు పొడమెనుగాని తెరచాప యెత్తుటవలనఁ బడవ యొడ్డు రేవువిడచిపోయెను. గ్రామమునకు వెలుపలనున్న శ్మశానముగూడ దృష్టిగోచరమయ్యెను.

ఆ పాంథుఁడట్లు నావపైఁబోవుచుఁ బ్రతిజన్మమునఁ బ్రతిదేహికి సంభవించు సంయోగవియోగములను గుఱించియు, పునస్సంయోగమునకు వీలులేని యత్యంతవియోగమును గుఱించియు, దానికి హేతువగు మరణమును గుఱించియుఁ నాలోచించుచుఁ దత్త్వవిచారమున దుఃఖోపశమనమును జేసికొనుచుండెను.

రత్నమ్మకా తత్త్వజ్ఞానములేదు కన్నీరుగాఁ బ్రవహింపఁ బోస్టాఫీసు చుట్టు తిరుగుచుండెను. ఆమెకు బాబు మరలవచ్చుననునాశ హృదయకోణమునందు దాగియుండుటచేఁ గాఁబోలు పోస్టు ఆఫీసు వదలలేనిదై తిరుగుచుండె. ఆ చోటనుండి తన హృదయమును బలాత్కారమునఁ దీసుకొనిపోలేకపోయెను. అహో మనుష్యస్వభావము! కొన్ని మూఢభ్రమలయందఁబడి వ్యామోహముఁ ద్రెంచుకొనలేకయుందురు. వివేకముదయించినను నది కొన్నినాళ్లకుఁగాని వ్యామోహములు ద్రెంచుటకు సమర్థముకాదు. నడుమ నడుమ నివి వ్యామోహములని భ్రమపడుటకుఁ దగిన కారణములున్నను నవి నిజములని నమ్మటకు వీలుకలుగదు. స్వార్థమగు నాశ హృదయసారమునుబీల్చి శుష్కింపఁజేసి పాశములను ఖండించి నిర్గమించునరకు దానిచే నిబద్ధులైయుందురు. తదనంతరము భ్రమ వదిలినను బరితాపమును బుట్టించును. మరల కుటిలములగు వ్యామోహములయందే ప్రవేశించుచుందురు

## 8. భ్రష్టుడు.

సాయంకాలము సమీపించినకొలఁది వాయువేగము హెచ్చుచుండె. భయంకరమైన యా వృష్టిపాతముంబట్టియు, మేఘగర్జితములంబట్టియు, మాటిమాటి కాకసమునందు మిఱుమిట్లు గొలుపుచున్న విద్యుల్లతలంబట్టియు నభోవీధియందు దేవతలకును, రాక్షసులకును గొప్ప యుద్ధము జరుగుచున్నదని యనుకొనవచ్చుచుండెను. యముని జెండాలవలె కారుకమ్ములు కదలుచుండెను. గంగానదియు మహా సంరంభముతో మిన్నంటి ప్రవహించుచుండె. ఆ మహానది కిరుప్రక్కలయందునుండు తోటలలోని చెట్లు నిట్టూర్పులు నిగుడించినట్లు సీత్కారములు వెదజల్లుచున్నట్లు యీమూలలనుండి యామూలలకుఁ దలలూపుచు ధ్వనిఁజేయుచుండెను.

చంద్రనగరములో నా యేటియొడ్డుననున్న యొక మేడలో నొక మూల గదిలో నేలపైపరచిన పరపుమీఁదఁ గూర్చుండి భార్యాభర్తలిరువురు రహస్యముగ ననన్యమనస్కులై యొక విషయమునుగూర్చి యిట్లు చర్చించుచుండిరి. భర్తపేరు శారదుఁడు, భార్యపేరు కిరాన్.

శారద — ఇంకను నీవింకు కొన్నిదినములుండవలయునని నా కోరిక. అట్లొనర్చినచో మనము మఱల స్వస్థానమునకు పోకముందే నీ శరీరమునకుఁ బలముపట్టును.

కిరానా.— ఇంతికుముందే నా శరీరరోగము పూర్తిగ నయమైనది. ఇప్పుడే మనమింటికిపోయినయెడల హాని యేమాత్రమును కలుగదు.

వివాహమైన పురుషుఁడుగాని, స్త్రీగాని యీ దంపతుల సంవాదము మీఁదఁ జెప్పినంత సంక్షిప్తముగానుండునని నమ్మను. వివాదవిషయము క్లిష్టమైనది కాదు. వారనుకొనిన యుత్తరప్రత్యుత్తరములవలన సిద్ధాంతము తేలలేదు. చుక్కాని లేని పడవవలె నారి చర్చ యెంతసేపటికిని మొదటిరేవు దాటలేదు. కాని తుదకా చర్చ కన్నీళ్లవరకు వచ్చునని భయమువాత్రము కలిగెను. ‘నీవింకను కొన్నిదినములుండవలెనని వైద్యుని యభిప్రాయ’మని శారదుడు చెప్పెను. “మీ వైద్యుఁడు సర్వజ్ఞుఁడా యేమి?” యని కిరాను బదులుచెప్పెను. “ఎప్పుడీగ్రప్రదేశములయందనేకరోగములు వ్యాపించుచున్నవి. కావున నొకటి రెండు నెలలు నీవిక్కడ నుండుటుచితి”మని భర్త యనెను. “ఈ క్షేమము దీగ్రామములోమాత్రము ప్రతివాఁడు నారోగ్యవంతుఁడై యున్నాఁడా యేమి?” యని భార్య బదులుచెప్పెను.

ఉన్న విషయమిది. జరిగిన మాటలివి. కిరానుపై నా యింటివారికిని, యిరుగుపొరుగువారికినిఁ గూడ చాల ప్రేమ కలదు. అందువలన నామె కొన్నిటవి జబ్బుచేసినప్పుడు నారందరు మిగుల నాయమైరి, చాలఁ జింతించిరి. భర్త భార్యవిషయమై యింత తొందరపడుట తగదనియు, ప్రదేశ పరివర్తన మారోగ్యకరమని భార్యకుపదేశించుట లజ్జాకరంబనియు, యింతకుముందెన్నడును నేస్త్రీకిఁగాని జబ్బుచేయలేదా యనియు, నిప్పుడు పొదలఁచిన గ్రామములోని జనులుమాత్రము చావు లేనివారాయనియు నక్కడమాత్రము బ్రహ్మవ్రాసిన వ్రాత దాటవచ్చునాయనియు కొందరు పండితమ్మన్యులు శారదునకుపదేశించిరిగాని శారదుఁడును వాని తల్లియు గ్రామస్థులమాటలు నిరాకరించి కిరాను ప్రాణము కాపాడుటే గొప్పయని భావించి చంద్రనగరమునకు కిరానుఁ దీసికొనివచ్చిరి. వైద్యము చేయించిరి. కొంతకాలమునకు కిరా నారోగ్యమును

చెందెగాని శరీరముమాత్రము చాల దుర్బలముగానే యుండెను. ఆమె ముఖము చాల వాడి చూపఱకుఁ జాలిగొల్పుచు నేఁడు మృత్యుముఖమునుండి తప్పించుకొనినను చాలకాలమువఱకు మృతప్రాయమైయుండుటఁ జేసి భర్త హృదయమునకు భయముకలుగునట్లు చేయుచు నేయుండెను.

కిరానుకు తెరచు మిత్రసహవాసమునందును, వినోదములందు నభిలాష యెక్కుడు. నదీప్రాంతమందున్న యీ నిర్జనగృహములో నివాసమామె కనుకూలముగ లేదు. ప్రొద్దుపుచ్చుటకు సొంపులైన సహచరులు లేరు. చేయుటకు వినోదకరములైన పనులు కానరావు. దినమంతియు మందులతోడను, పథ్యభోజనములతోడను గడుపవలసివచ్చుట యామెకుఁ జాల దుస్సహముగానే యుండెను. ఔషధములు నూరుటయందును, మాత్రలు కట్టుటయందును, నవయువతులు చెనుర్చునట్లు కాచుకొనుటయందును నేమి వినోదమున్నది! ఆ సాయంకాలమున గాలివాన సమయమున రహస్యముగ నూల గదిలోఁ జర్చింపఁబడుచున్న విషయమిదియే.

కిరాను కోపములేకుండ నాలించినంతసేపు యుక్తియుక్తముగఁ బ్రతివాదము సేయుట కనకాశముండెనుగాని యామె తలయూచుచు విషణ్ణముఖియై తలఁపుచికొని ప్రత్యుత్తరమేమి చెప్పుట మానివేసినప్పుడు పాపమా భర్త యొగుడు చెప్పఁజాలక స్వవాదపరిత్యాగముఁ జేయవలఁ దమనంతలో నానుచరుఁడొకఁడు వచ్చి తలుపునందుండి "'అయ్యా' యొకవార్త తెలుపవచ్చితి"నని బిగ్గరగా నఱచెను

శారదుఁడు లేచి తలుపుఁదీసి యా పరిచారకునివలన "యీ తుపాను గాలివలన రంగానదిలో నొకపడవ మునుగుటకు సిద్ధమైయుండగా నందున్న వారిలో నొక బ్రాహ్మణబాలుఁడు నది యీదుకొని తోటప్రక్కనున్న యేటి మెట్లదగ్గరకుఁ జేరినాడ"ను వార్త వినెను. కిరానామాట విని భర్తతోడి వాదమునకు పూర్వమున్నట్లే నిర్మలహృదయయై యా పిల్లవానికి పొడిబట్టలిచ్చి పంపించెను. పిదప పాలుకాచి యొక గిన్నెలోనునిచి యా పిల్లవానిని తన గదిలోనికి పిలిపించుకొనియె. ఆ బ్రాహ్మణకుమారుఁడును కుటిలకుంతలములతోడను, విశాలనేత్రములతోడను చక్కదనమున కెక్కుడై యొప్పుచుండెను. వానికింకను గడ్డమును, మీసములును రాలేదు. అట్టి సుందరబాలకునిచే ముందు కొన్ని పాలుత్రావించి పిదప వాని వృత్తాంతమంతయును చెప్పుమని యడిగెను. వాఁడు తన వృత్తాంతమంతయు సంగ్రహముగాఁ జెప్పెను. వానిపేరు నీలకంఠుఁడు. వాఁడొక నాటకసంఘములోఁ జేరినవాఁడు. సమీప

మునందున్న యొక జనపదమున నాటకమునకు సాంఘికులందరు వచ్చుచుండ( గాలిచే గంగలో పడవ మునిగిపోయెను. వాని సహచరులందరేమైనది వానికిఁ దెలియదు. ఈత బాగుగ నేర్చినవాఁడగుటచే దరిఁజేరి బ్రతుకఁగల్గెను. ఆ పిల్లవాఁడు వారింటఁ గొంత కాలముండెను. ఘోరమరణము నందుండి తప్పి వారి బ్రతికినాడని యా బాలునియందు కిరానుకు గాఢానురాగము జనించెను. ఇట్టి పిల్లవాఁ డీతరుణమునం దిక్కడికివచ్చుట చాల మంచిదనియు, వానితో భార్య వినోదించుచుండవచ్చుననియు, యిందువలన మఱికొంతకాలమిచ్చట నుండుటకు కిరాను నొప్పించవచ్చుననియు శారదుఁడు తలఁచెను. తన కోడలి యనుగ్రహముచే నీ యాగంతుక బ్రాహ్మణబాలునకు లాభము కలుగవచ్చునని యత్తగారు సంతసించెను. నీలకంఠుఁడును నాటక సంఘాధ్యక్షుని దండనమునుండియు, మృత్యుముఖమునుండియు తప్పించుకొని వచ్చిన తనకు ధనవంతమగు కుటుంబములోని దయావతియగు నొక స్త్రీయాశ్రయము లభించినందుల కపరిమితానందమునొందెను.

ఇట్లు కొంతకాల మరిగినపిమ్మట శారదుఁడును వాని తల్లియు నీలకంఠుని యందున్న తమ పూర్వపు వక్రప్రాయములను మార్చుకొని యిక్కడనుండి వానిని వెళ్లగొట్టుటకుఁ దగిన యదను ప్రతీక్షించుచుండిరి. నీలకంఠుఁడును రహస్యముగ శారదుని హుక్కాగొట్టముతీసి పొగపీల్చి యానందించుచుండెడి వాఁడు. వర్షమెక్కువగా కురియుచున్నప్పుడు సందేహింపక శారదుని పట్టుగొడుగు ధరించి యిచ్చవచ్చినట్లు తిరుగాడుచు కన్పడినవారందరితోడను మైత్రిచేయుచుండెడివాఁడు. మఱియును వీధిలోఁ దిరుగుచున్న యొక సంకరజాతికుక్కను తీసికొనివచ్చి నిశ్శంకగ దాని లాలించుచు విశుద్ధమైన శారదుని శయ్య దాని మలినపాదములచే త్రొక్కించుచుండెడువాఁడు. ఇదియునుంగాక నానావర్ణముల తుంటరిపిల్లవాండ్రతో సహవాసముచేయుచు రాత్రిందివము మామిడితోటయం దల్లరిచేయుచుండుటచే నాయేఁడా మామిడి తోటలో నొక్క కాయయైనను దక్కలేదు.

ఈ పిల్లవాఁడిట్లు చెడిపోవుటకు కిరానుగూడ కొంతకారణము కాకపోలేదు. వీని విషయమై శారదుఁడుకూడ పెక్కుసార్లు భార్యను హెచ్చరించెను కాని యామె భర్తను లక్ష్యపెట్టలేదు. పనికిరావని శారదుఁడు పరిత్యజించిన ప్రాతపుట్టంబులును, మఱికొన్ని క్రొత్తబట్టలు నొసంగుచు కిరాను నీలకంఠుని వేషాభిమానిగాఁ జేసెను. వానియం దనురాగవతియగుటచేతను, వాని చరిత్రశేషము వినదలఁచియుండుటవలనను తరచుగా తన గదిలోనికి పిల్చుచుం

ఊరూరఁ దిరుగాడు నాటకసంఘములోఁ జేరి నానావిధములైన చిన్న చిన్న పనులుచేయు కుఱ్ఱవానికంటె యెక్కువ గౌరవము సంపాదించుకో వలయునన్న యూహ నీలకంఠునికింకను తెలియదు. శారదుని వర్తకవ్యాపారములోఁ గొంత పనిఁ జేయుచున్న యింకొక వర్తకునివద్ద విద్యనేర్చుకొనుటకై నీలకంఠుఁడు కొంత ప్రయత్నించెనుగాని యా వర్తకునకును నీలకంఠునియందు శారదునికంటె యెక్కువ ద్వేషము కలిగియుండెను. నాటకశాలలకుఁ బోవుచున్నెల్లపుడు నాటకశిక్షలను పొందుచున్న యీ నీలకంఠున కెన్నిచోట్ల చదువు ప్రారంభించినను నక్షరములే రాలేదు. మంచుఁగప్పిన వస్తువులవలె వాని నేత్రము లక్షరములనే గుర్తింపలేకపోయెను. గంగానదియొడ్డున చంపకలత దాపున పుస్తకము తెఱచి తొడపైనుంచుకొని చాలసేపు కూర్చుండును. సమీపమున గంగాతరంగములు రొదసేయుచుండె. పడవలా ప్రదేశమును దాటి పోవసాగెను. పక్షులు కలకల కూయుచుండె. అట్టి తరుణంబున పుస్తకము తొడపైనుంచుకొని కూర్చుండిన నీలకంఠుని మనస్సునం దెన్నితలంపులు పుట్టెనవో వానికే తెలియవలయును. మొదటి బంతినుండి రెండవ బంతివరకు పుస్తకము చదువు సాగలేదు. కాని పుస్తకము చదువుచున్నట్లు వానిచిత్త మానంద సముద్రములో మునుగసాగెను. మఱియు ప్రక్కనుండి యేదేని పడవ పోవుచున్నపుడు దానియందున్నవారు వినునట్లేదియో బిగ్గరగా వరచుచుండును. పడవ దాటిపోవగనే వాని యుత్సాహము క్రుంగుచుండును.

పూర్వము ప్రాణములేని యంత్రమువలె సంగీతముపాడు నీలకంఠునకిప్పు డారాగములు రుచింపకుండెను. గీతములోని పదముల కర్థము తేటపడక ఝువి వ్యర్థములని తోఁచదొడఁగె. గీతములోని కొద్ది భావమైనను గ్రహింఎకు శక్తిలేని యా నీలకంఠునకీ క్రింది యర్థముగల గీతము పాడినప్పు పగ కమునుండి దేవలోకమునకు పోయినంతటి సంతోషము కల్గుచుండెను. మా గీతమునకర్థ మీక్రింద నుదాహరించుచున్నాను. "ఓ పక్షీ! అయ్యో! నా రాజకన్యక కపకారముచేయుట కేల వచ్చితివి. ఓ హంసా! యీ యరణ్యమునం దీ యనాతపప్రదేశమునందామె నేల హింసించెదవు!" ఈ రీతిగ నీలకంఠునకు చిరపరిచితమైన భూలోకమంతయు, వాని జీవితమంతయు గానమయముగా గన్పించెను. ఆ హంసయొక్కయు, నా రాజకన్యక యొక్కయు కథ వాని మనోదర్పణమందు చక్కని చిత్రమువగా లిఖించుకొని ను. అప్పుడు వాఁడు తనకేమార్పు సంభవించెనని యనుకొనియెనో

తెలియదుగాని నాటకసంఘములో నీ పాట పాడినప్పుడు తానొక బానిస వేషమును ధరించినవాఁడను సంగతిమాత్రము మఱచెను.

లేమిచే బాధపడుచు చింపిరిగుడ్డలతో తన గుడిసెయందు ఆకలిచే మలమల మాడుచుండిన యొక పిచ్చుకుఱ్ఱఁడు ధనవంతులైనవారి కథలను, మహారాజుల కథలను విననప్పుడు మినుకుమినుకుమను సన్నని దీపపువెలుతురున వాని మనస్సు మహారాజభోగము లనుభవించినట్లూహలఁదిరుగు నాటకులకుఁ బరిచారకుండైన నీలకంఠుఁడు గంగాతీరంబునందు లతామందిరంబున గానపరవశుఁడై యున్నతఱి రూపాంతరపరిణామముఁ జెందుట కబ్బురమేమున్నది? కలకలధ్వని చేయు తరంగములు, మర్మరధ్వని సేయు పాలుటాకులు, మధురధ్వని సేయు పక్షులుగలచోటఁ గూర్చుండి సంగీతముఁ బాడుకొనుచుఁ దనకు నిలువ నీడయిచ్చిన కిరానాదేవి యౌదార్య సౌందర్యములతోఁ గూడిన కోమల ముఖారవిందంబును, మెఱయుచున్న కంకణంబులచే నందమైన యామె మృదు హస్తంబులును, దమ్మికెనులవలెఁ బ్రకాశించు నా కాంతిపాదంబులును గీత మాధుర్యముతోఁ గలసి యతని హృదయమం దైక్యముఁ జెందెను. గానము ముగిసినంతనే యా నీలకంఠుఁడు మామూలు నీలకంఠుఁడయ్యెను. అంతలో మావిడితోటలోఁ గాయలు దొంగిలించినట్లు తోటమాలి చేసిన నీలకంఠుని మీఁది యభియోగము శారదునకుఁ దెలియుటచే నతఁడు నీలకంఠుని వెదకుచు వచ్చి రెండు గుద్దులుగుద్ది కాళ్లకు సంకెళలు వేయించెను. తనయందు భక్తిగల పిల్లవాండ్రను దుష్టమార్గములనుండి నడుపఁజేయుటకును, నేలమీఁదఁ గాని, నీటిలోఁగాని, చెట్లపైఁగాని వారిచే నల్లరిచేయించుటకును నీలకంఠుని మించినవాఁ డెవ్వఁడును లేడు.

ఈ దినములలోఁ గలకత్తా కళాశాలలోఁ జదువుకొనుచున్న శారదుని తమ్ముఁడు "సతీష"నువాఁడు వేసంగి సెలవుదినములగుటచే నన్నగారియింటికి వచ్చెను. అతఁడును, శారదుని భార్యయును సమానవయస్కులు. వారిరువురును నాటలతోడను పోరాటములతోడను, ననునయములతోడను, నవ్వులతోడను, కోపములతోడను కాలము సుఖముగాఁ గడపుచుండెడివారు. కిరాను వినోదోపాయములకు మాఱుపేరైన మఱది వచ్చినందులకు మిగుల సంతసించెను. ఒకప్పుడు హఠాత్తుగ సిందూరముపూసిన చేతులతో వెనుకతట్టునుండి యామె సతీషు మొగము రాయుచుండును. ఇంకొకసారి "శ్రోత్రి"యని వీపుపై వ్రాయుచుండును. మఱియొకతఱి నందరు బిట్టునవ్వునట్లు సతీషుని గదిలోఁ బెట్టి పైఁ దలుపుగొళ్లెము వేయుచుండును. సతీషును

వీనికన్నింటికిని సహింపక యామె తాళము లుంగరములు దాచుట, ఆమెకై సిద్ధపఱచిన చెక్కెరపాకిలో మిరియపుఁబొడి కలుపుట, ఆమె యితర ధ్యానముతో మంచముపైఁ బరున్నపుడు మంచమునకు బంధించుట మొదలగు కొంటె చేష్టలు చేయుచుండును.

వీరిరువురట్లు వినోదించుచుండ నీలకంఠునకెంతి మనస్తాపము కలుగుచుండెనో దైవమెఱుంగును. వాని హృదయము ద్వేషముతో నిండియుండునది. అట్టి సమయములందతఁడు తన సహచరులగు పిల్లవాండ్రను గొట్టియుఁ, దిట్టియుఁ దన పెంపుడుకుక్కను బొయ్యమ్మని మొఱగించియు, దారినున్న చెట్లను గత్తితో నఱికియు, పందిగెలను బెత్తముతో బాఁదియు చిత్తవికారమును బయటఁ బెట్టుచుండువాఁడు.

తినయింట నెవ్వరేని మృష్టాన్నము సంతృప్తిగ భుజించుట కిరానునకుఁ బరమానందము. నీలకంఠున కల్లరితోఁ బాటు భోజనమందును మంచి సామర్థ్యము కలదు ఎన్ని పర్యాయములు పెట్టినను మంచి యాహారపదార్థము లతఁడు వలదనుటెఱుంగఁడు. నీలకంఠుఁడన్నముఁదినునప్పు డెదుట గూర్చుండి రుచ్యములైన పదార్థములను బెక్కుసార్లు వడ్డింపించి తినుపించుచుండుట కిరానాదేవి యాచారము. సతీషు వచ్చినతరువాత నిలుమిగ నామె నీలకంఠుని భోజనకాలమందు దగ్గరనుండుటకుఁ దీరికలేక మానుచుండెను. సతీషురాక పూర్వమెప్పుడును కిరానాదేవి దగ్గరలేకుండ నీలకంఠుఁడు భుజింపలేదు. ఇంటనున్న రుచిగల వస్తువులేవియు మిగులలేవు. పాలగిన్నెలో నొక చుక్కయు మిగులలేదు.

నీలకంఠునకిపుడు ''ఇది రుచిచూడు అది రుచిచూడు''మనుచు బలాత్కారముగ భుజింపఁజేయు కిరానుదగ్గర నుండమింజేసి వాని కేవస్తువును రుచింపదయ్యె. పాచకుఁడు వడ్డించునాఁ డాఁకలిలేదనుచు గసిక్కొట్లుగ భుజించుచుండెను. తాను బొత్తిగ భుజించుట మానినచో నామెకుఁ దెలియునని యు, దెలిసి యామె యెదుటఁ గూర్చుండి యథాపూర్వముగ భుజింపఁజేయు ననియు, వాఁడు తలంచెనుగాని యది యట్లు జరుగలేదు. ఆ సంగతి యామెకుఁ దెలియనులేదు. వాఁడొక్కొక్కప్పుడు గదిలో దీపమార్పి దిండుపైఁ దలయుంచుకొని వెక్కివెక్కి యేడ్చుచుండెనుగాని వాని దుఃఖమును దీర్చువారెవరో! వాని దుఃఖమునకు హేతువేమున్నదో! వాని కపకృతి గావించినవారెవరో! వానికే తెలియకుండఁ దనంత రహస్యప్రదేశమందుఁ

బొక్కి పొరలుచుండఁ గొంతసేపటికి నిద్రాదేవత యనుగ్రహ మే యా దుఃఖపుఁ బొల్లుపశమింపఁ జేయుచుండెను.

సతీషు చేయుచున్న దురోచ్చేధలవలనఁ గిరానుకుఁ దనయందు ద్వేషము కలిగెనని నీలకంఠునకు దృఢమైన నమ్మకము కలిగెను. చిఱునగవు మొగంబునఁ జెంగలింప మున్నటివలెఁ గిరాను తన్నాదరింపకుండుటకు సతీషు చెప్పిన కొండెములే కారణములనియు, నందుచేత నామె కాగ్రహము కలిగెననియుఁ దలంచుచు సతీషుపైఁ బరమద్వేషము వహించియుండెను.

ఉత్తరజన్మమున సతీషుని దన్నుఁగాఁ దన్ను సతీషునిగాఁ జన్మింపఁజేయుమని భగవంతుని బ్రార్థించుచుండెను. వాఁడు తన కోపాగ్నిచే సతీషుని దగులపెట్టఁదలంచినకొలఁదిఁ దన కోపాగ్ని తన హృదయమునే మండింపఁ జొచ్చెను. మేడపైనుండి సతీషు కిరానుల యన్యోన్యపరిహాసవాక్యములు వినినకొలంది వాని చిత్తమున సంతాపాగ్ని రగులఁజొచ్చెగాని నీలకంఠు డెన్నఁడును సతీషునందుఁ దనకున్న యధిక కోపముఁ బయటఁబెట్టుటకు సాహసింపలేదు. కాని వాని మనస్సునొచ్చు నీచోపాయములుమాత్రము చేయకమానలేదు. సతీషు స్నానమునకుఁబోయి గంగలో నీఁదులాడుచున్నప్పుడు మెట్లపైనున్న సబ్బుబిల్ల కన్పడకపోవుటయు, ఒడ్డుపై విడచిన నిల్వుటంగీ గంగలోఁబడుటయు మొదలగు కొన్ని నీలకంఠుని పనులేయైనను సతీషుమాత్ర మట్లనుకొనుట తటస్థింపదయ్యె.

ఇట్లుండ నొక దినంబునఁ గిరాను సతీషుని సంతోషపెట్టఁదలఁచి నీలకంఠుని బిలపించి యొక చక్కని పాటపాడుమని యానతిచ్చెను. వాఁడు దుఃఖితుఁడై యూరకుండెను. కిరాను హాసవేమని నిర్బంధించెను. వాఁడుత్తరముఁజెప్పక మిన్నకుండెను. నాకు వినవలయునని యున్నది పాడవేమి! అని బలాత్కరించినను నీలకంఠుఁడు పాడక యందుండి లేచిపోయెను. ఆమెయు సతీషుపైనున్న యాగ్రహమని యెఱుంగదు.

ఇటులుండఁ గొన్నాళ్లకుఁ గిరాను, వారగులు స్వగ్రామమునకుఁ బోఁ దలఁచినదినము సమీపించెను. ప్రయాణసన్నాహములు చేయుచుండిరి. సతీషుకూడ వారితోఁ బోఁదలంచెను. నీలకంఠునిమాట యెవరును దలపెట్టరైరి. వానిని వెంటఁ గొనిపోదమా వలదా యను విషయమే యెవరు నాలోచింపరైరి. కిరానుమాత్ర మొకసారి నీలకంఠుని విషయముఁ బ్రస్తావింపఁగా నత్తయు, మఱదియు, భర్తయు వలదని బలాత్కారముగ నిషేధింపఁగా నామె యొకసారి నీలకంఠునిం బిలచి "అబ్బాయీ నీవు మాయింటికేగుము" అని

యుపదేశించెను. నీలకంఠుండును జిరకాలము తన్నత్యంతాదరణపూర్వకంబుగ నుపలాలించిన కిరాను కొన్నిదినంబులనుండి నిరాదరభావమును జూపుటయు, నేఁడింటికిఁ బొమ్మని యుపదేశించుటయు మనంబు కలంప బోరున నేడ్వసాఁగెను. కిరాను నేత్రములుకూడఁ గన్నీళ్లకు నివాసములయ్యెను. మఱియు నామె హృదయము భగవంతుఁడింతటి యస్థిరమగు ననురాగబంధంబును గల్పించెఁగదా! యని పశ్చాత్తాపముచేఁ దప్తమయ్యెను.

సతీషు నీలకంఠుని యేడ్పువిని యసహ్యపడి "ఈ మూర్ఖుఁడు చెప్పఁదలఁచినది చెప్ప కేడ్వ మొదలుపెట్టినాఁడేమి?" అని విసుగుకొనెను. "వానిపై నీకింత నిర్దయయేల" యని కిరాను సతీషును నివారించెను. సతీషు కిరాను దిక్కు మొగంబై వదెనా! "నీకు వీని సంగతి తెలియదు. అమాయకురాలవు. వీని వంశమేదియో! యెందుండి యిక్కడకువచ్చెనో! వీని పూర్వవృత్తాంతము నీవే నెఱుంగుదువు! కులగోత్రములు తెలియనివానిం దెచ్చి నెత్తిపైఁబెట్టుకొని రాజపుత్రునివలె సాకితివి. ఇప్పుడింత యనాదరముచూపిన సహించునా! నీ హృదయముఁ గఱఁగించుటకు వీనికి దొంగయేడ్పులకంటె నితరమార్గము లేదు" అని ప్రత్యుత్తరమిచ్చెను. నీలకంఠుఁడామాటలువిని లేచిపోయెను. నేను కత్తినైతినా, వీనిని ముక్కముక్కలుగఁ గోయనా! యనియు, సూదినైతినా, యొడలంతయు రంధ్రములు గావింపనా! యనియు, నగ్నినైతినా, బూడిదఁ జేయనా! యనియు సతీషునిపై నీలకంఠుడు నిప్పులు గుఱిపించుచుండెను.

ముత్తెపుఁజిప్పతో నిర్మింపఁబడిన చిన్నపడవలోఁ గలముఁబెట్టుకొనుటకై యొక వెండి హంసతోఁగూడ నమర్పఁబడిన సిరాబుడ్డి యొకటి సతీషు కలకత్తానుండి తెచ్చెను. వానికి దానియందు మిక్కిలి యిష్టము, ప్రతిదినము నతఁడు తన ప్రాత పట్టు చేతిరుమాలతో శుభ్రపఱచుచున్నపుడెల్లఁ గిరాను వెండిరాయంచముక్కుపట్టుకొని "ఓద్విజమా! నీవు మా రాజకన్యక కెందుకపకారముఁ జేయఁదలఁచితివి" అని పల్కుటయు నతఁడు కినిసి యామెతోఁ గలహించుటయు జఱుగుచుండెను.

వారి ప్రయాణదినమున కొకదినముముందు సతీషు సిరాఘటము పోయినది. "ఎక్కడ వెదకినను గన్పడలేదు. నీ హంస నీకొఱకొక దమయంతిని దెచ్చుటకై యేగె"నని కిరాను సతీషును బరిహసించెను. సతీషు కుపితుఁడై తన మసిపాత్ర నీలకంఠుఁడు దొంగలించెనని తలంచి వానిపైఁ గారములు, మిరియములు నూఱుచుండెను. నిన్నరాత్రి మీ గదిచుట్టును జీఁకటిలో నీలకంఠుఁడు తిరుగుచుండఁగా నేను చూచితినని సతీషు సేవకుఁడుగూడ నా

యూహను బలపఱచెను. పిదప నీలకంఠుని వెదకించి రప్పించిరి. నీవు నా మేళామందమును హరించితివని సతీషు వానిని నిస్సంశయముగ బెదరించెను. ఇంతకుమున్ను పెక్కుసార్లు తప్పుచేసినను, జేయకపోయినను శారదునిచేత శిక్షింపఁబడుచున్న నీలకంఠుఁడు నేఁడు కిరానుముందరఁ దన్ను దొంగయన్నందులకుమాత్ర మతికోపముతోఁ గనులెఱ్ఱఁబార నిట్టూర్పు నిగుడింపసాగెను. అది చూచి సతీషు మెలమెల్లగ నూరకుండెంగాని లేనిచో నడవిపిల్లివలె మీఁదఁబడి గోళ్లతో రక్కిచేయఁదగినంత ప్రమాదముఁ జేయుటకు నీలకంఠుఁడు సిద్ధపడియుండెను.

ఈ సందర్భమంతయుఁ జూచి కిరా నా పిల్లవానిం దన గదిలోనికిం బిలచి సహజ మృదుమధురవాక్యములతో "నీలకంఠా! నీవు మా మఱఁది సిరాబుడ్డి దొంగలించితివేని సడిచప్పుడుగాకుండ మరల నొసఁగుము. నేనేదియో యుపకల్పించి నీకుఁ బ్రమాదము రాకుండఁ జేసెదను" అని బ్రతిమాల వాఁడు కన్నీరు కపోలములపైఁ గాల్వలుగట్ట మఱింతగ నేడ్వసాగెను. కిరాను తన మఱఁదదగ్గరకు వచ్చి "నీలకంఠుడు నీ మసిపాత్ర దొంగిలింపలేదు. నిశ్చయము" అని వాదించెను. శారదుఁడును సతీషును వీని పనియే కాని. యితరుల పనికాదని వాదించిరి. కిరాను వీఁడు దొంగకాడనియుఁ దక్కినవారు వీఁడె దొంగయనియుఁ గొంతతడవు వివదించినపిదప, శారదుఁడు నీలకంఠుని పెట్టె పరీక్షింపవలయునని కోరెను. కిరానందులకు సమ్మతింపదయ్యె. ఆవల యామె కంటనుండి కన్నీరు బొటబొట కాఱఁజొచ్చెను. పిదప నీలకంఠు నెవ్వరును బాధింమటకు సాహసింపరైరి.

దిక్కుమాలిన నీలకంఠునిపై మోఁపిన దొంగతనము కేవల మన్యాయమని కిరాను హృదయమున జాలిపడి వాఁడింక లేచిపోఁదగినవాఁడేయని నిశ్చయించుకొని వానికొఱకుఁ గొన్ని బట్టలును, గొన్ని వస్తువులును, గొంతి సొమ్మును గైకొని యర్ధరాత్రంబున వాని గదిలోనికింబోయెను. వాఁడెఱుఁగకుండ వాని పెట్టెలోనివి పెట్టవలయుననియే యామె యభిప్రాయము. ఆ పెట్టెకూడ వానికామె యిచ్చినదే.

ఇప్పగిది నడిరేయి కిరాను నీలకంఠుని గదిలోఁ బ్రవేశించి తన తాళపుఁ జెవులలో వానిపెట్టెకు సరిపోయిన చెవి యొకదానితో వాని పెట్టెతెఱచి యందిల్లరిబిల్లరిగాఁ బెక్కువస్తువులుండుటచేఁ దానందు దాఁచవలసిన వానికిఁ జోటుచాలక సర్దుటకై యందలి వస్తువులు క్రిందికిఁదీసెను. కత్తులు, బొంగరములు, గాలిపటములు, దారపుండలు, ఆలుచిప్పలు, గాజుచిప్ప, లద్దపు

ముక్కలు మున్నగు పిల్లవాండ్ర సామానులతో నిండియున్న వాని పెట్టె పరీక్షింపఁగా నడుగున సతీషు సిరాబుడ్డియు బయటఁబడఁగా నామె విస్మితురాలై కూర్చుండెను. నీలకంఠుండును దన పెట్టెనుండి యా సిరాఘటమును దొలఁగింపవలెనను నూహతో నా యర్ధరాత్రమునందే తన గదిలోనికి వచ్చెను. జరిగిన దంతయుఁ గనుఁగొని దొంగయగునో కాఁడో సిద్ధాంతపఱచుటకామె దొంగవలెఁ దనపెట్టె పరిశీలించుచున్నదని నీలకంఠుఁ డెఱింగెనుగాని యిప్పుడేమి చేయఁగలఁడు! "సతీషుమీఁది పగ సాధించుటకై నేనీ పని జేసితినిగాని దొంగను కాను" అని చెప్పి వాఁడు కిరాను నెట్లు నమ్మింపఁగలఁడు? "నేనీ మసిపాత్ర గంగలోఁ బాఱవేయవలసినది. తెలివితక్కువవాఁడనై పెట్టెలోఁ బెట్టితిని" అని చెప్పుటకు వానికి నోరెట్లువచ్చును? దొంగిలించినమాట స్వల్పమైనప్పుడు వాఁడేల దొంగ కాకపోవును! నీలకంఠుఁడు దొంగకాడని వాదించిన కిరాను మొగము వాఁడెట్లు చూడఁగలఁడు!

ఈరీతిగ మసిపాత్ర కంటఁబడిన వెంటనే కిరాను మిగులఁ బరితాపమునఁ నొగిలి యా సిరాబుడ్డి మరల నందుంచి తక్కిన వస్తువులన్నియు నందుఁ బొందుపఱచి తాను నీలకంఠున కీఁదలచిన వస్తువులను సొమ్మును, వానిపై భద్రపఱచి వెడలిపోయెను.

నీలకంఠుండును గిరాను మోము చూడఁజాలక గదిలోనికి పోనొల్లక యదే పోఁగాఁ బాఱిపోయెను. మరునాఁడు గ్రామస్థులకుఁగాని, రక్షకభటులకుఁగాని, సహచరులకుఁగాని యెందును గానరాఁడయ్యె. వానిపెట్టె పరీక్షింపవలయునని పట్టుఁబట్టిన శారదుఁడెఱుఁగకుండ గిరాను నీలకంఠుని పెట్టె తన గదిలోనికి రప్పించుకొని యందున్న మసిపాత్రను జాలుగా గంగలో బాఱవేయించెను. పదునాఁడి వారింపలును చంద్రనగరమువదలి స్వగ్రామమునకుఁ బయనమైరి. గుండెపగులునట్లు గంగానదియొడ్డున మొఱఁగుచు నట్టిట్టుతిరుగు నీలకంఠుని కుక్క తక్క నితని నొక్కపురుగైనను లేక యా వనమంతయు నిర్మనుష్యమయ్యెను.

## 9. కాళీపాదుడు.

కాళీపాదుని తల్లి రాష్మణి. ఆమె తన కుమారునకు మాతాపితృకృత్యములు రెండును చేయవలసివచ్చెను. ఇరువురు వహింపఁదగిన బాధ్యత నొకరు వహించుట పిల్లల యభివృద్ధికి తోడుకానేరదు. ఆమెభర్త భవాని, పిల్లలను

భయభక్తులుగరపి బాగుచేయుటకు సమర్థుఁడు కాకపోవుటవలన నతని కృత్యము కూడ రాష్మణియే చేయుచుండెను. భవాని తన పిల్లలను బాగుజేయుటకు మారుగఁ బాడుజేయుటకుఁ బ్రయత్నించువాఁడని తెలుపుటకై మీకతని పూర్వ చరిత్ర కొంత తెలుపవలసియున్నది.

భవాని శన్వారిగ్రామములోఁ బ్రఖ్యాతిఁజెందిన వాదరివంశములోఁ బుట్టినవాఁడు. వాని తండ్రియగు నభయచరునకు మొదటిభార్యయందు శ్యామచరుఁడు జనించెను. ఆమె మృతిఁజెందునప్పటికి అభయచరుఁడు మఱల వివాహము చేసికొనుటకుఁ దగినకాలము కాకపోయినను పెండ్లియాడెను. ముదుసలివానికి పిల్లనిచ్చిన క్రొత్త మామగారల్లునిచే తన కుమార్తెకు స్త్రీధనముగాఁ గొంత ధనమిప్పించిన పిదపనే పెండ్లిసేసెను. చిన్నవయస్సులోనే కూతురు విధవయైనచో నన్నవస్త్రములకు లోపముండఁగూడదనియు, శ్యామచరునివలన భరణ మపేక్షింపనక్కరలేదనియు వ్రజసుందరితండ్రి యభిప్రాయము.

వ్రజసుందరితండ్రి తలచిన యంశములలో మొదటిది నిజమయ్యెను. వ్రజసుందరికి భవానియను కొడుకు పుట్టినతరువాతనే యీ వైధవ్యము తటస్థించెను. అభయచరుని మామగారు తన కుమార్తెకు పెండ్లినాఁడుచేసిన యేర్పాటువలన నన్నవస్త్రములకు లోపముండఁగూడదుగదా యని కొంత యూరటజెందెను.

శ్యామచరుఁడు తండ్రి మరణించునప్పటికి కొంతవయస్సు గడచినవాఁడు. వాని పెద్దకొడుకే సవతితమ్మునికంటె నొకయేఁడు పెద్ద. ఆపెద్దకొడుకుతోఁ గూడ సవతితమ్ముని పెంచెను. తమ్ముని పోషణమునకుఁగాను తండ్రి సవతితల్లికిచ్చిన స్త్రీధనములో నొక్క గుడ్డిగవ్వయైనను తీసికొనలేదు. ప్రతివత్సరమామెకాధనము లెక్కలుచెప్పి యివ్వదగిన సొమ్మిచ్చి యామెవలన రసీదుపొందుచుండెను. ఈ వ్యవహారమునందు వానికిఁగల సత్యసంధత, ఋజుస్వభావము వినినవారి కబ్బురము కలుగఁజేయక మానవు. కొందరు తెలివితక్కువవానికిఁగాని యింత యోగ్యతయుండదని యనుకొనసాగిరి. అవిభక్తమగు యాస్తి వారు పంచుకొనుట లోకులకిష్టముగాలేదు. శ్యామచరుఁ డేవిధముననో కుట్రఁబన్ని సవతితల్లికి తండ్రియిచ్చినభూమి చెల్లకుండఁజేసినచో నతఁడు బుద్ధిమంతుఁడని వీరు మెచ్చుదురు. అట్టి దురుద్దేశము శ్యామచరునకున్నచో నది నెరవేరుటకుఁ దగిన సాయముచేయువారా గ్రామమందనేకులు* గలరు. శ్యామచరుఁడు పిత్రార్జితమైన ధనము తగ్గుటకుఁగూడ సమ్మతించి సవతితల్లి భూమి యామెకు వేరుపరచెను. గతభర్తృకయగు వ్రజసుందరి స్వభావము స్నేహ

పేశలమైనది. సహజముగ నితరులను నమ్మునది. శ్యామచరునియందు దృఢమైన విశ్వాసముగలదై తన కొడుకునకంటె వానినే యెక్కువగఁ బ్రేమించియుండెను. పెక్కుసారులు "తండ్రీ! నా యాస్తికొరకు నీవింత పట్టుదలగ న్యాయముగఁ బనిఁజేయనక్కరలేదు. ఈ యాస్తి నాతో నొక గవ్వయైనను రాదు. మఱల మీ కుటుంబములోనికి రావలసినదియే" యని కోపపడుచుండినను నతడామె మాటలు వినలేదు.

శ్యామచరుఁడు సతతము కఠినశాసనుఁడు. ఆ విషయమాతని కొడుకులకుఁ దెలియును. కాని భవానికి కొడుకులకంటె నెక్కువ స్వాతంత్ర్యమిచ్చుటచే లోకులు సవతితమ్మునియందే యెక్కువ ప్రేమయని యనుకొనుచుండిరి. భవాని విద్యాభ్యాసమునకై సవతియన్నగాని, తల్లిగాని తగిన శ్రద్ధలేనివారగుటచే వాఁడు విద్యావిహీనుఁడై తన యాదాయవ్యయములను స్వాతంత్ర్యముతో వ్యవహరించుట కసమర్థుఁడై యా భారమంతయు శ్యామచరునకే యొప్పగించియుండెను. అప్పుడప్పుడు దస్తావేజులలో వాని యర్థమును విచారింపకయే తన వ్రాలు చేయుటయుఁ గలదు. శ్యామచరుని పెద్దకొడుకు తారాపీడుఁడు తండ్రికి సహాయుఁడై సర్వవ్యవహారములు నిర్వహించుటకుఁ దగిన కౌశల్యము గలిగియుండెను.

శ్యామచరుని మరణానంతరము తారాపీడుఁడు భవానితో నిట్లు చెప్పెను. "బాబూ! నేటివరకు మనము కలసియుంటిమి. ఇక మనము వేరుపడి యెవరి యాస్తి వారు పంచుకొని స్వతంత్రజీవనముఁ జేయుట మంచిది. కలసియున్నచో నేదైన నభిప్రాయభేదము కలిగినయెడలఁ గేవలము మన సౌహార్దమునకు భంగము వచ్చు"నని చెప్పిన తారాపీడుని మాటలువిని కలలోనైన నట్టి యూహలేని వాఁడగుటచే భవానిట్లు విచారించెను. ప్రపంచమంతయు నఖండమై స్వయం సంపూర్ణమైయుండుననియే వానికిఁ గన్పడెను. విభాగమాత్రమెచ్చటనో యుండవచ్చుననియు తనకట్టి యనర్థము సంభవించుననియు వాఁడెన్నడు తలఁచియుండలేదు. వేరుపడుటవలన భవానికిగల్గు చింతయు, వంశమునకుఁ గల్గు నపకీర్తిని పరిగణింపక తారాపీడుఁడందులకుఁ గృతనిశ్చయుఁడై యుండెను. భవాని యది తెలిసికొని సాధ్యమైనంత స్వల్పాయాసముతో నాస్తి పంచుకొందగిన యాలోచన చేయసాగెను.

తారాపీడుఁడును పంచుకొనుటకై పినతండ్రిపడుచున్న మనఃక్లేశమున కాశ్చర్యపడుచు "మనమిప్పుడు పంచుకొనవలసిన దేమియును లేదు. అంతయు

మా తాతగారే పంచియిచ్చి"రని పల్కిన భవాని యబ్బురఁబడుచు మా తండ్రిగారే పంచియిచ్చిన సంగతి నాకేమియును తెలియదనెను.

"ఈ గ్రామమందున్నవారిలో నీ విభాగపుసంగతి తెలియనివాఁడొక్కఁడును లేఁడు. మా తాత తన మరణానంతరము మనమందరము వివాదపడుదుమని యాలోచించియే తన యాస్తిలో కొంతభాగము మీతల్లికిచ్చెను. అదియే నీ భాగము. తక్కినదంతయు నాదియే" యని తారాపీడుఁడు జవాబుచెప్పెను. భవానియు నది నిజమని తలఁచి యిండ్లవిషయమై యేర్పాటేమియని యడుగ "మీకుఁగావలసిన మీ యిల్లు దీసికొనుఁడు. నేను జిల్లాకు ప్రధానపట్టణమగు కలకత్తాలోనున్న యిల్లుతీసికొని తృప్తిఁజెందెద"నని జవాబిడె. భవానియు నా పట్టణగృహముఁ జూడనికారణమున నా గృహమెట్టిదో యెఱుఁగని హేతువున దానియందు ప్రేమలేక చిన్నతనమునుండియుఁ బుట్టిపెరిగిన యింటియందే యెక్కువ మక్కువగలవాఁడై యట్టి గృహమును తారాపీడుఁడు తనకు వదలినందులకు మిగుల సంబరపడి యీ వృత్తాంతమంతయు తల్లితోఁజెప్పెను. ఆమెయు తలఁబాదుకొనుచు "ఏమిరా యీ విపరీతము! నాభర్త నాకిచ్చినది నా స్త్రీధనము. దాని యాదాయము చాల స్వల్పము. దానియందు మీ యిరువురకును హక్కులేదు. ఇక మీ తండ్రియాస్తిలో నీకు భాగమేలేదా" యని యడుగఁగా "తాతగారు నీకిచ్చిన భూమితప్ప మరియేమియు నివ్వలేదని తారాపీడుఁడు దృఢముగాఁ జెప్పుచున్నాఁడ"నినంత వ్రజసుందరి నిర్ఘాంతపడి "నీ తండ్రి మరణశాసనమునకు రెండు కాపీలు వ్రాసెననియు, అందులో నొకటి నా పెట్టెలోనున్నదనియుఁ జెప్పి" పెట్టె తెరచిచూడఁగా నందు వ్రజసుందరికి వ్రాసియిచ్చిన దానపత్రముతప్ప మరేమియుఁ గన్పడలేదు. మరణశాసనము యొక్క రెండవప్రతి యెవ్వరో తస్కరించిరి.

అంతట వ్రజసుందరీ భవానులిద్దరు నుపదేశకుల సహాయము కోరవలసివచ్చెను. వారికి సాయముచేయుటకు పురోహితునికొడుకైన బాగలుఁడు సిద్ధముగనుండెను. గ్రామములోనుండువారి వైదికకృత్యములు నిర్వహింపఁ జేయుటకుఁ దన తండ్రియు లౌకికకృత్యములు నిర్వహింపఁజేయుటకీ బాగలుఁడును పంచుకొనిరి. ఈ తండ్రికొడుకుల విభాగమువలన నితరులకు నష్టియున్నను వీరికిమాత్రము పుష్టియేగాని నష్టిలేదు. మరణశాసనము లేకపోయినను పిత్రార్జితములో నన్నదమ్ములకు సమముగా భాగముండవలెనని బాగలుఁడు చెప్పెను.

ఈ కాలమునందే మరియొక మరణశాసనము సృష్టింపఁబడియె. ఇందు భవానిపేరైనను లేదు. వ్రజసుందరికి పుత్రోదయముకాక పూర్వమే మరణ

శాసనము వ్రాయఁబడి యాస్తియంతయు శ్యామవరునికొడుకుల కీబడినట్లు దానిలోనున్నది. భవానియు బాగలుని సరిగుగా నియమించుకొని యసహాయకరమగు వివాదపుసముద్రములో ప్రయాణముచేయుటకు బయలువెడలెను. ఓడ దరిజేరక పూర్వమే దావాఖర్చు ధనమంతయు వ్యయమయ్యెను. పైతృకమగు ధనమంతయు విపత్తులచే జిక్కినది. తల్లికి స్త్రీధనముగానిచ్చిన భూమి చాల కొంచెము. అది యన్నవస్త్రములకుఁగాని, వంశప్రతిష్ఠలు నిల్పుకొనుటకుఁగాని చాలదు. ఈ సమయమునందే తారాశంకరుఁడు జిల్లా ముఖ్యపట్టణములోనున్న యింటికి లేచిపోయెను. తరువాత వారొండొరులెన్నడును కలుసుకొనలేదు. ఈ ద్రోహకృత్యము నా విధవయగు వ్రజసుందరి హృదయమర్మమును పశుఘ్నుని కృపాణమువలె ఛేదించుచుండెను. ఆమె నిట్టూర్పులువిడుచుచు "భగవంతుఁడింత యన్యాయమును జరుగనీయఁడు. మా న్యాయసభలనుగురించి నాకేమియుఁ దెలియదుగాని నా మనస్సాక్షిని విచారించగా వారల మరణశాసనము దొరుకుననియు మనకేమియు నపాయము రాదనియు భవానితోఁ జెప్పెను.

భవాని లౌకికవ్యవహారములయందసమర్థుఁడగుటవలనఁ దల్లినుడివిన యాభయవాక్యములవలన సంతోషించుచు, దైవభక్తియు తల్లివచనములు తప్పక ఫలించుననువిశ్వాసముతోనుండెనుగాని తనవంతు ప్రయత్నములేవియు జేయఁడాయెను. తల్లి కాలధర్మముఁ జెందినతరువాత మరణముగూడ తత్త్వమగుటను మతియు దైవభక్తి వాని చిత్తమున గోచరించుటను దల్లి నుడివిన వాక్యములయందే వానికి నమ్మకము దృఢమయ్యెను. కాలము గడచినకొలఁది వానికి దారిద్ర్యభరమధికమయ్యెను. కాని దానింగురించి వానికెంతమాత్రము చింతలేదయ్యె. అన్నవస్త్రములను సంపాదించుకొనుట, వంశమర్యాదలను నిల్పుకొనుట వానికి రంగస్థలమందలి నాటకప్రదర్శనమువంటిదిగాఁ దోఁచెను గాని సత్యముగాఁ దోఁచలేదు. ప్రాతగుడ్డలు చినిఁగి నాకరకు పురుష్టులను కాణములోఁ గొనుట వానికి హాస్యమువలె వినోదకరముగాఁ దోఁచుచుండెను. అట్టి సమయములయందుఁ జిఱునవ్వునవ్వుచు వాఁడు తనలో "రాఁబోవు నా శుభాశుభావస్థలలో నిదియొక యస్థిరావస్థయని యీ జనులెఱుగరు. మున్నొకదినమున దుర్గాపూజోత్సవము నేనసామాన్యవైభవముతో జరుపునపుడు జనులకమితాశ్చర్యము కలుగును. ప్రస్తుతము లేమియున్నను ముందు నేనధిక వ్యయముఁ జేయఁగలుగుదును" అని తలపోయును. ఇట్టి తలఁపోఁతలు తలపోయునపుడు వానికి పరిచారకుఁడే ముఖ్యస్నేహితుఁడుగానుండెను. వారిరువురత్యానందముతో నిట్టి విషయములే చర్చించుచుందురు. మనకు మంచిదినములు తటస్థించినపుడు

కలకత్తానుండి నాటకసంఘమును బిలిపింతిమా? వలదా? యను విషయమునఁ బరిచారక యజమానులకు భిన్నాభిప్రాయము కలుగుచుండెను. మఱికొన్ని యుత్సవములకుముందుఁ జేయఁబోవు ధనవ్యయముంగుఱించి పరిచారకుఁడు కనపఱచు కృపణత్వమును భవాని నిందించుచుంటయుఁగలదు.

తనకుముందు రాఁబోవు విశేషధనప్రాప్తి ననుభవించుటకుఁ బుత్రుఁడు లేకపోయెఁగదా! యని భవాని చింతింపఁగాఁ జింతింపఁగా నొక కుమారుఁడు కలిగెను. పోయిన యాస్తియంతయు మరల వచ్చునని వాని జాతకము సూచించు చదియైయుండెను.

కుమారుఁడు జన్మించినదిమొదలు వాని ప్రవృత్తియంతయు మాఱెను. ప్రఖ్యాతిఁజెందిన వంశమునం బొడమిన యా బాలకుఁడు ముందు యశోవంతుఁడగుననియు వానికిఁ జేయఁదగిన యుత్సవము లమితములనియు భావించుచున్నందునఁ బూర్వమునందువలెఁగాక ప్రస్తుతమతనికి లేమి యతి దుస్సహముగానుండెను. పుత్రజన్మసమయమునందుఁ బూర్వాచారప్రకారముగ విరివిగ ధనవ్యయముఁ జేయలేకపోతినిగదా! యను దుఃఖము వాని చిత్తమును బాధింపసాగెను. మఱియు వానికి న్యాయముగఁ జేయఁదగిన యుత్సవములకుఁ దగినవ్యయముఁ జేయలేకపోవుట వానిని వంచించుటయని తలంచుచు వావంతఁ బాపుకొనుటకై యా బాలకుని మఱింత యెక్కువగా లాలింపసాగెను. వాని స్వభావమునకు వాని భార్య రాసమణి ప్రకృతికినిఁ జాల వ్యత్యాసము కలదు. చౌదరివంశపుఁ బూర్వమర్యాదలయెడల నామెకుఁ గేవలము పేక్షయేగాని యపేక్షలేదు. ఆ సంగతి యెఱింగిన భవానిభార్యను క్షుద్రవంశములోఁజేరిన వైష్ణవవంశములో జనించినదానవనియు మా వంశమర్యాదలు నీ వెఱుంగుదువనియుఁ బరిహసించుచు వంశమర్యాదలవిషయమై నా యాశయము నీవెఱుఁగవనియుఁ బిల్లవాని క్షేమమొక్కటియే నీకుఁ గావలసినదిగాని కులగౌరవములతో నీకుఁ బనిలేదనియు నిందించుచుండును. ఆమెయు నిష్కపటముగ భర్తమాటలు నిజములేయని యొప్పుకొనును.

ఇరుగుపొరుగువారితో భవాని తన తండ్రి వ్రాసిన మరణశాసనమును గుఱించి ప్రశంసించుట కలదుగాని భార్యతోమాత్రము దానిమాట యెన్నఁడును బ్రశంసించుటలేదు. ఒకటి రెండుసార్లామెతోఁగూడఁ బ్రస్తావింపఁ బ్రయత్నించెనుగాని దానియెడల నామెకుఁగల విరక్తిఁజూచి చెప్పుటమానెను. పూర్వప్రతిష్ఠను గుఱించికాని, రాఁబోవు ప్రతిష్ఠనుగుఱించికాని యాలోచించుట యామెకుఁ గేవల మిష్టములేదు. వానియం దభినివేశంబును లేదు.

ప్రస్తుతము కావలసిన ద్రవ్యసంభారములు సమకూర్చుపనియందే యామెకు శ్రద్ధమెండు సర్వదా యందుకొరకే యాలోచించుచుండును. సంసారమునకుఁ గావలసిన వస్తుసంభారములుకూడ సులభములు స్వల్పములు కావుకదా?

ధనలక్ష్మి యొక గృహమువదలి యింకొకయింటికిఁ బోవునపుడు సంపత్కాలమునందలి భారములనుకూడ వెంటఁదీసికొనిపోక యా యింటనే యుంచిపోవును. ఈ సోదరికుటుంబమున కైశ్వర్యము తగ్గినను నాశ్రితుల భారము మాత్రము తగ్గలేదు. పరాన్నభుక్కులయిన యాశ్రితులు తిండిపోతులై యేదేనిఁ బనిచేయుఁడని కోరినచోఁ బరిభవించినట్లు తలంతురు. వంటయింటి పొగతగిలిన వారికిఁ దలనొప్పి యెత్తును. అక్కడకుఁబోయి యాపని చేసిపెట్టుఁడని కోరినచో వారి కాళ్లకుఁ బక్షవాతము వచ్చును. కుటుంబభరణభారమంతయు రాష్మణిమీదనే పడియుండుటచే నామె స్వల్పవిషయములకుఁ గూడఁ బ్రతికూలదైవముతోఁ బోరాడి సాధింపవలసిన యవస్థవచ్చెను. అట్టి యసాధ్యకార్యములు సాధింపవలసినయపు డబలలకు సహజమగు సౌకుమార్యము, వినయము తగ్గిపోవుటయందేమి యచ్చెరము కలదు. స్త్రీలెవరికొరకంతటి పరిశ్రమముఁ జేయుదురో వారే వారిని నిందింతురు.

గృహకృత్యములు నిర్వహించుకొనుటయేగాక పోఁగా మిగిలిన స్థిరవసతిసంబంధములగు నాదాయవ్యయములు వ్రాయుట మొదలగు పనులన్నియును రాష్మణిమీఁదనే పడియుండెను. ఏ లోపములేకుండ వ్యవహారమంతయు నట్లు చక్కఁబెట్టుటకు రాష్మణికే చెల్లెనుగాని యితర స్త్రీలెవ్వరును జేయఁజాలరు. భూమిమీఁద రావలసిన యాదాయమును రాఁబట్టుటయందు నేర్పుఁ జూచి భూమిదున్ను రైతులును దక్కినవారును నామెను నీచవంశసంజాతయని నిందింపఁజొచ్చిరి. ఇంత దారుణమగు మితవ్యయముతో గృహకృత్యములు నిర్వహించుటయు నాఁడు వాండ్రు చేయరానిపను లాఁడువాండ్రు చేయుటయు, మా సోదరి వంశసంప్రదాయమునకు విరుద్ధముగానున్నదని భవానియు భార్యను నిందించుటకలదు.

రాష్మణియు భర్తృనిందకుఁ గేలొగ్గనేకాని యెదురుపల్కదు. తన జనకవంశమును నిందించినను మాటాడదు. చిరకొంగు నడుమునకు బిగించి గృహకృత్యములు చురుకుతనమున నిర్వహించుకొనుచున్న రాష్మణి యింటివారికిని, నిరుగుపొరుగులవారికినిగూడ నప్రియురాలాయెను. గాని యిది నీకుఁ దగదనుటకు సాహసించువారెవ్వరును నెదుటకు రాఁజాలరైరి. కాక యామెచేయు దుష్కృత్యములేమున్నవి? ఏ పనియుఁ జేయలేదని భర్తను

నిందింపదు. భర్తసాయ మెందులకును గోరదు. భర్త యేకార్యమునైనఁ జేయుటకు మొదలిడినచో నది చెడిపోవునేమోయని ధైర్యహీనురాలై భయపడునే కాని భర్తను వలదని నివారింపదు. సాధ్యమైనచో భర్తచేసిన కార్యమందలి లోపమును దానే సవరించుకొనును లేదా దానివలనఁ గలిగిన నష్టమనుభవించును. భర్త నిర్వ్యాపారుఁడై యుండవలయుననియే యామె యుద్దేశము. భర్తయుద్దేశము నట్టిదేకావున వారిరువురకును నభిప్రాయభేదమమాత్రము తలుచు రాకుండఁగనే యామె తలంపు నెరవేఱుచుండెను.

పుత్త్రుఁ డుదయించునాఁటికి రాష్మి నడిప్రాయమునందుండెను. అమాయకుండును నిరుపయుక్తుండునగు భర్తపైఁగల యామె యనురాగము నిరుపమానము. సంతానము కలుగువరకు నపత్యప్రేమయు భర్తయందే నిగూఢమైయుండెను. భవాని వయస్సుచేఁ బెద్దవాఁడైనను సృష్టికర్త లోపము వలన గుణములయందును ప్రయోజకత్వమునందును బాలుడుగానే యుండెను. వ్రజసుందరి కాలధర్మమును జెందినపిదప భవానికి భార్యయే మాతృకృత్యములుఁ జేయవలసివచ్చెను.

గురుకుమారుఁడైన బాగలునివలనఁ గలుగు నుపద్రవములనుండియు, నితరుల యపాయములనుండియు భర్తను గాపాడుటకామె కప్పుడెప్పుడు తీవ్రదృష్టి యుపయోగింపక తప్పినదికాదు. దానివలన నారామెకు భయపడుచునేయుండిరి. అందుకొరకు మృదువాక్కులు, లలితదృష్టులు, మితభాషిత్వము, పరపురుషులయెదుట పడకుండుట మున్నగు స్త్రీమర్యాదలామెకు దూరములు కావలసివచ్చెను.

భవాని, భార్యయానతికి విధేయుఁడైయుండెనుగాని కుమారుఁడగు కాళీపాదుఁడామె శాసనకు విధేయుఁడగుటకుమాత్ర మంగీకరింపఁడయ్యెను. భవానికిఁ గుమారునియం దెట్టి యాదరముకలదో యటువంటి యాదరము పుత్త్రుని యెడల రాష్మి చూపింపకుండుటయే యిందులకుఁ గారణము. "అయ్యో! పాపము సంపదగల కుటుంబములో జనించియు దరిద్రుఁడగుట యితని దురదృష్టముగాని తప్పుకాదు" అని భర్తయెడల జాలిపడుచు రాఁబడి యెట్లున్నను నతఁ డలవాటుపడిన సుఖసాధనముల యెడలఁగాని, మనోవిశ్రాంతి సాధనముల యెడలఁగాని, భోగసాధనములయందుఁగాని మితవ్యయము మాట తలపెట్టక కష్టపడి సంపూర్ణముగ సమకూర్చుచునేయుండెను. వెయ్యేల? ఇతర కృత్యములయందుఁ దప్పఁ బెనిమిటియెడల మితవ్యయమెన్నఁడును గావింపలేదు. భోజనమునందేమి, వస్త్రములయెడలనేమి యనివార్యమగు లోపమెన్నఁడేని సంభ

వించినయెడల నామె గజగజవణకుచు నా లోపములకు లేనిపోని కారణములు కల్పించి క్షమాపణ కోరుచుండునే కాని యెన్నడును భర్తను నిరాకరింపలేదు. వండినయాహారము కుక్క ముట్టుకొన్నదనియు, మంచి కందువాలు దొంగలెత్తుకొనిపోయిరనియు, దీనికిఁ బరిచారకుని యజాగ్రత్తయే కారణమనియు, నామె మిథ్యాకారణములు కల్పించినపుడు భవాని పరిచారకునియందు దోషములేదనియుఁ గుక్కతిన్నచో నదియు జీవస్థితిగదా యనియు వాదించునే కాని భార్యకల్పించిన మిథ్యాకారణముల ప్రలాపించుటకు సమర్థతచాలక యూరకుండును. మఱియుఁ గల్పనయందు సమర్థురాలయిన భార్యమాటలే నమ్మును.

ఈ విధముగ రాష్ణి భర్తనాదరించుచుండెనే కాని కుమారునకుమాత్ర మిట్టి యుపచారములు చేయుటలేదు. కుమారుఁడు దరిద్రకుటుంబమున జనించినవాఁడే కాని దరిద్రుఁడయినవాఁడు కాఁడుకదా? వీనికి లేనిపోని వేషములన్నియు నెందులకని యామె యభిప్రాయము. కుమారునకు నైశ్వర్యవంతునకుఁ జేయఁదగిన యుపచారములన్నియుఁ జేయఁదగిన దేయని భవాని యభిప్రాయము. కాళిపాదున కుదయము రెండుగుప్పెళ్ల యటుకులతోడను, పద్యెత్తు బెల్లముతోడను గడపవలసినదే. చలికాలమున శరీరము, తలయు నొక ముతక నూలు దుప్పటితోఁ గప్పుకొనవలసినదే కాని యంతకంటె నెక్కువ యుపచారములు లేవు. బడిలోఁ బిల్లవాఁడు పాఠములు చదువనియెడల నుపాధ్యాయునితో గట్టిగా బాదుమని చెప్పుటయే కాని వానిని క్షమించుమని యెన్నఁడునుఁ జెప్పుటలేదు. దారిద్ర్యదశ వచ్చినదిమొదలు దైవమువలనఁ గలుగు కష్టములన్నింటియందును రాష్ణి కాళిపాదునియెడలఁ జూపించు పూర్వోక్తములగు ననాదరణములే భవానికి దారుణమైన కష్టముగాఁ గన్పించెను కాని పిల్లవానినంతకంటె మిన్నఁగా నాదరింప జేయుటకుఁ దగిన సమర్థత తనకు లేనందున భార్యతో నది మంచిది కాదని చెప్పుటకు సాహసింపలేకపోయెను.

మంచి భాగ్యదశలో నున్నతఱిఁ బరిచారకులకేనియు బహుమతిగా నీయఁదగని బట్టలతో నిర్మింపఁబడిన దుస్తులు కాళిపాదునకిచ్చుచు భర్తతో "నితఁడు చౌదరివంశమున నేఁడు పుట్టినవాఁడు బాలుఁడు. వీనికి వంశప్రతిష్ఠ యింకను దెలియదు. ఏది యిచ్చిన, దానితోనే సంతసించును"ని చెప్పినను వతనిచిత్త మొప్పుకొనకయుండెను. బాలునకుముందు మహాదశవచ్చునని కాని, వెనుక మహాదశ యనుభవించిన కుటుంబములోనివాఁడనని కాని తెలియ

నందులకు భవాని విచారించుచు యట్టి సంగతులు పిల్లవానికిఁ దెలియఁజేయక మోసపుచ్చుచుంటినని తన్నే తాను నిందించుకొనుచుండెను. పదిమందియుఁ జూచి నవ్వఁదగిన కొలఁదిపాటి బహుమతి తల్లి తనకిచ్చిన నది చాల గొప్పదని సంతోషించుచు, గంతులువైచుచుఁ దనకుఁ జూపింపవచ్చిన కుమారునిఁ జూచి నప్పుడు భవాని హృదయము పగులఁజొచ్చెను.

ధననాశనమునకు మొదటి కారణమైన యుద్యోగమున మధ్యస్థుఁడుగాఁ బనిచేసిన గురుకుమారుఁడీపట్టెడిక ధనవంతుఁడైయుండెను. ఆ బాగలుఁడా ద్రవ్యములో వానిజ్యవృత్తి యవలంబించి కలకత్తాకుఁబోయి మూఢజనుల నాకర్షింపఁదగిన కొన్ని నవకసరకులు కొనితెచ్చెను. పైమెఱుఁగేకాని యా వస్తువులు వెలలేనివి. వేఁడితగిలిన రంగునకుఁ గన్పించు సిరా ఒకటి, చేతికఱ్ఱ, గేలము, గొడుగును నిమిడియున్న కఱ్ఱయొకటి, మూలలందు బొమ్మలు ముద్రించియున్న జాబులువ్రాయు కాకితములు, వేలములోఁగొన్న పట్టుబట్టలు ఇవియే యతఁడు కొన్నవస్తువులు. కలకత్తాయంగడిలో విక్రయముకాని వియుఁ బట్టనములలోనుండు గొప్పవారు తప్పక ధరింపఁదగినవని వర్ణింపఁబడు నవియునగు తుక్కుసరుకులు పల్లెటూళ్లకుఁ దెచ్చినయెడల గ్రామములయం దున్న యవినీతులగు పడుచువాండ్రవి కొని తమ గ్రామ్యత్వముఁ బోగొట్టు కొనుటకు నొండొరులను మించఁ బ్రయత్నించుచుందురు.

ఒక సమయమున బాగలుఁడు కలకత్తానుండి యొక యద్భుతవస్తువు నొక దానినిఁ దెచ్చెను. అది విదేశ స్త్రీరూపముగలిగి, మర త్రిప్పినంతనే కుర్చీమీఁది నుండి హఠాత్తుగాలేచి చురుకుగా విసనకఱ్ఱతో విసరుకొనుచుండు నొక బొమ్మ. దానిం జూడఁగానే కాళిపాదుఁ డాకర్షింపఁబడెను. వెంటనే వాఁడు తండ్రియొద్దకుఁబోయి కొనిపెట్టుమని యడిగెనుగాని తల్లియొద్దకుఁబోయి యడుగలేదు. వాఁడు తల్లి నడుగకుండుటకుఁ బెక్కుకారణములు కలవు. భవానియుఁ దప్పక కొనియిత్తుననియెనుగాని దానివెల వినఁగానే వాని ముఖ కాంతి తగ్గెను. ద్రవ్యమంతయు భార్యదగ్గరనుండుటచే ధైర్యములేని యాచ కునివలె వెలవెలఁబోవుచు భార్యవంకఁ జేరఁజని కొంతసేపు సంబంధములేని సంగతులతో కాలయాపనముఁజేసి తుదకు సాహసించి ప్రస్తుతవృత్తాంతముఁ దెల్పెను.

మీకుఁ బిచ్చియెత్తినదా' యని రాసమణి బదులుచెప్పఁగాఁ దరువాత నేమి ప్రత్యుత్తరముఁ జెప్పుదునా! యని యాలోచించుచు భవాని యూరక కుండెను. తరువాత వారిరువురకు నీక్రింది సంభాషణముఁ జరిగెను.

భవాని.—నాకు మధ్యాహ్నమునఁ బాయసాన్నమక్కఱలేదు.

రాష్ట్ర.—ఎవరు చెప్పిరి?

భవాని.—పైత్యమున్నతఱి మంచిదికాదని వైద్యుఁడు చెప్పెను.

రాష్ట్ర.—వైద్యునకుఁ దెలియదు.

భవాని.—నీవు కావించు రొట్టెలకంటె నా కన్నమే యనుకూలమైనదని నా నమ్మకము. నాకు రొట్టెలు సహింపవు.

రాష్ట్ర.—మీ ముఖము జూచిన నజీర్ణలక్షణము లెంతమాత్రమును నాకుఁ గన్పించుటలేదు.

భవాని స్థిరుఁడు కాఁడు. ఎన్ని చెప్పినను స్వసుఖపరిత్యాగముఁ జేయుటకు సిద్ధుఁడైయుండెను. వెన్న ఖరీదంత హెచ్చినను వాని రొట్టెలసంఖ్య తగ్గలేదు. మధ్యాహ్నభోజనమునకుఁ బాతే చాలును గాని వంశాచారప్రకారముగఁ బెరుగుకూడ నుండఁదగినదే యగుటచే నది లేకుండఁ జేయుట రాష్ట్రమణికే యిష్టము కాదు. ఇవి యన్నియుఁ దప్పించి దానివలన కొంత ధనముఁ గూడఁబెట్టి కుమారునకు బొమ్మ కొనిపెట్టవలయునని భవాని యెంత ప్రయత్నించినను నా ప్రయత్నము భార్యయొద్ద నిష్ఫలమయ్యెను.

తరువాతఁ గారణమేమియు లేకపోయినను భవాని బాగలునిఁ జూడఁబోయి కొంత వ్యర్థసంభాషణ జరిగినపిదప నా విదేశస్త్రీ ప్రతిమనుగుఱించి యడిగెను. భవానిచేత డబ్బులేక చిక్కుపడుచుండుట బాగలుఁడెఱిఁగినదే యగుటచే "మీ కా బొమ్మ యెందుకు లెండి" యని నిరాకరించుట భవానికి మఱింత వ్యసనముఁ గలుగఁజేసెను. గర్వమంతయు దిగమ్రింగి చంకలోనున్న విలువగల ప్రాఁత కాశ్మీరదేశపు శాలువను బయటికిఁదీసి హీనస్వరముతో "నేనిప్పుడు చిక్కులలోనుంటిని దగ్గర విశేషముగ ధనములేదు. ఈ శాలువ కుదువబెట్టి మా పిల్లవానికిఁ బొమ్మ కొనఁదలఁచితిని" అని నుడివెను.

శాలువకంటె బొమ్మ తక్కువవెలదే యగుటచే బాగలుఁడా బేరమునకు సమ్మతించువాఁడే కాని గ్రామస్థులకు విరోధమగుననియు జడిసియు రాష్ట్రమణి జాగరూకతకును, తీవ్రదృష్టికిని భయపడియు నా శాలువను గ్రహించి బొమ్మ నిచ్చుట కంగీకరింపఁడయ్యె. భవానియు మరల శాలువను జంకలో నిఱికించుకొని విఫలమనోరథుఁడై యింటికేగెను.

కాళిపాదుఁడు ప్రతిదినమందు నా యాటబొమ్మను దెచ్చియిమ్మని యడుగుచునేయుండెను. భవానియుఁ జిఱునవ్వు నవ్వుచు "నా కుమారా! సప్తమి

వరకు నాగుము" అని చెప్పుచునే యుండెనుకాని దినదిన మా చిరునవ్వు నిలుపుకొనుటతని కతి కష్టమయ్యెను. చవితినాఁడు భవానిభార్యను నిరోధించి యిట్లడిగెను. కాళిపాదుఁడు చిన్నఁబోయినట్లును జింతించుచున్నట్లును గన్పడుచున్నాఁడు, వానిశరీర మారోగ్యవంతముగా లేదనుకొనియెదను.

రాష్ట్ర.—వట్టిమాట. వాఁడారోగ్యవంతుఁడై యున్నాఁడు.

భవాని.—గడియలకొలంది మాటాడక కూర్చుండుట నీవు చూచుట లేదా? మాటాడకపోవు టటుండనిమ్ము. వాడు కొన్ని నిమిషములైనను నాట లాడకుండుట చూచితివా? నా మదికెంతమాత్రము స్వస్థతలేకున్నది.

ఈ విధముగఁ బల్కిన వాగ్బాణము లామె హృదయమునకు నాటకుండుట చూచి భవానిచరుడు నిట్టూర్పువిడచి చేతివ్రేళ్లతోఁ దలవెండ్రుకలు దువ్వుకొనుచుఁబోయి వసారా యరుఁగుమీఁదఁ జుట్టకాల్చుకొనుచుఁ గూర్చుండెను.

పంచమిదినమున భవాని భుజించునపుడు పాయసముమీఁదఁగాని, పెరుగు మీఁదఁగాని వ్రేలువైచి రుచియైనఁ జూడకుండ వదలిపెట్టెను. సాయంకాల మందును దన్నఁగా భుజింపలేదు. ఆకలిలేదని చెప్పుచుఁ బదార్థములన్నియు దిగవిడచెను. దానంజేసి యామె మనోదుర్గము నుంత శిథిలమైనది. షష్ఠి నాఁడు తల్లి కాళిపాదునిఁ జాటుగాఁబిలచి మృదుమధురముగా ముద్దుగా "తండ్రీ మనము కొనజేని వస్తువును నీవు కోరుట దొంగతనమువంటిదికాదా?" అట్టి కోరిక కోరుట దొంగతనమునకై దారినడుమఁగట్టిన యింటివంటిదని యెఱుఁగఁదగిన యీఁడువచ్చినదికదా! యని యడిగినఁ గాళిపాదుఁడు కన్నీళ్లతో "తల్లీ నేనేమియు నెఱుఁగను. నాన్న నాకుఁ గొనిపెట్టెదవనియెను" అని చెప్పఁగా రాష్ట్రిణి కూర్చుండి కుమారుని తొడపైనునుచికొని తండ్రిగారి వాగ్దానమునందెంత మనోవ్యథ కలదో, ఎంత ప్రేమయున్నదో, ఎంత నష్టము సంభవించునో, ఎంత సుఖపరిత్యాగము ప్రాప్తించునో అంతయు విస్పష్టముగాఁ దెలియఁబఱచెను. రాష్ట్రిణి యింత గట్టిగా నింతకుమున్నెన్నఁడును కాళిపాదున కుపదేశించియుండలేదు. తల్లి యీరీతిగ బుజ్జగించి చెప్పిన యుపదేశమంతయు గ్రహించి యిచ్చెఱువుపడి బాలుఁడైనను తల్లిహృదయ మందుఁగల యగాధమైన వ్యసనమును దెలుసుకోఁగలిగెను. కాని బాలుఁడగు నతని మదినుండి యా బొమ్మమీఁది యాసక్తి పోయినదనిమాత్రము చదువరు లూహింపఁజనదు. తరువాత వాడు మొగము పొడుగుచేసికొని యేమియుఁదోఁచక కాలిగోళ్లతో నేలమీఁద గీయుచు నిలుచుండెను.

రాక్షసియుఁ గఠినహృదయముతోఁ బెద్దగొంతుకతో "ఓరీ కాళిపాద! నీవెంత యేడ్చినను, గోలపడినను నీవు కోరినబొమ్మ నీకు రాదు" అని నుడువుచు వచటినుండి లేచిపోయెను.

కాళిపాదుఁ పెరటిలోకుఁ బోయెను. భవాని మట్టుపాగ నిల్చుచునే యుండెను. కాళిపాదునిఁ జూచి ఏదో తొందరపని యున్నవానివలె వాని వైపునకుఁ గాక రెండవవైపునకు నడచిపోవుచుండఁగాఁ దండ్రి యెదురుగఁ బరువెత్తుకొనిపోయి "నా బొమ్మమాట యేమి చేసితివి" అని యడిగిన కొడుకును చేతులెత్తి కంఠాలింగనము చేసికొని భవాని "తండ్రీ, నాకు కొందరపని యున్నది. కొంచెముసేపాగుము అది పూర్తికానీ" అని చెప్పెను. నాడు భవానికిఁ జిరునగవు తెచ్చుకొందమన్నను రాలేదు. అట్లుచెప్పి యతిదీనముగు మొగంబుతో బయటికిం బోయెను. కాళిపాదుఁడును ద్వారమునొద్ద నిలుచుంబడి, తండ్రి కన్నీళ్లు తుడిచికొనుటఁ జూచి బాలుఁడైనను దండ్రి వైఖరి పరీక్షించి బొమ్మకొననేరని విషాదమనుభవించుచున్నాఁడని తెలుసుకోఁ గలిగెను. వెంటనే తల్లియొద్దకుంబోయి "అమ్మా నా కాబొమ్మ యక్కఱలేదు" ని చెప్పెను. నాఁటి యుదయము భవాని యింటికాలస్యముగా వచ్చెను. స్నానముఁ జేసెను. భోజనమునకు వచ్చెనుగాని నాఁడుగూడ వడ్డించిన పదార్థములన్నియు దిగఁ బెట్టుననియుఁ బిల్లులపాలగుననియు వాని ముఖలక్షణములు చూచిన స్పష్టమయ్యెను.

ఈ సందిగ్ధసమయంబున రాక్షసి దారముతోఁ గట్టఁబడిన కాగితపు వట్టల పెట్టెనొకటి భర్తముందుంచెను. మొదట భర్త భుజించినపిదప శయ్యాగృహమున విశ్రమించియున్నప్పుడా కాగితపుఁ బెట్టె రహస్యముగఁ జెప్పఁదలంచెనుగాని భర్త సుముఖముగ భుజించుటకై యప్పుడే తెచ్చి ముందుంచెను. పెట్టెతెఱచి మరత్రిప్పెను. అందున్న విదేశస్త్రీప్రతిమ విసరుకొనుచు నిలువఁబడెను.

తరువాతఁ బిల్లి విఫలమనోరథమై లేచిపోవునట్లు పదార్థములన్నియు నిశ్శేషములయ్యెను. నేఁడు పదార్థములకున్న రుచి యెన్నఁడును లేదని భార్యను శ్లాఘించెను.

కాళిపాదుఁడు కావలెనని యుత్కంఠతోఁ గోరుచున్న యాటబొమ్మ భవాని యిచ్చెదనన్న సప్తమినాఁడే లభించెను. వాఁడు దానితో నాడుకొనసాగెను. దానివలన వానికిని, వాని బాలస్నేహితులకును స్పర్థకలిగెను. సామాన్యముగ బాలురకు దినమంతయు నొక యాటవస్తువుతో నాడుకొనుట

విసుగుగానే యుండునుగాని మరునాఁడాబొమ్మ మరల నిచ్చివేయఁదగినదని కాళీపాదునకుఁ దెలిసియుండుటచే దినమంతయు వాఁడు దాని యాటతోనే గడపెను. దినమునకు రెండు రూపాయ లద్దెయిచ్చెదనని చెప్పి బాగలునియొద్ద రాష్మణి యా బొమ్మ తెచ్చెను. కాళీపాదుఁ డతిదైన్యముతో నష్టమినాఁడా బొమ్మను బాగలునకుఁ జేతులార యిచ్చివచ్చెను. ఆనాఁడు వాఁడు తల్లిప్రేమకు మిగులఁ బాత్రమయ్యెను. నాటినుండియుఁ దల్లికిఁ గుమారుఁడు కోరుకోరిక లతిసులభముగఁ దీర్పఁగలుగుట సాధ్యమయ్యెను.

ఈ విధముగ తల్లియుపదేశములనఁ గాళీపాదునకుఁ బ్రపంచమున నే వస్తువయినను గ్రయధనమునకై కొంత శ్రమపడి శక్తియంతయు ధారవోసినఁగాని లభింపనేరదను తత్వముఁ దెలిసెను. అంతటినుండియు వాఁడు గృహకృత్యములయందుఁ దల్లికి సహాయుఁడై యుండెను. లోకమునం దొకరికొకరు క్లేశహేతువు కారాదనియు, నన్యులభారముఁ దేలికపఱచుటకుఁ గొంత ప్రయత్నించుచుండవలయుననియు నొక ధర్మసూత్రమును గ్రహింపఁగలిగి సాధారణముగ దాని ననుసరించుచుండెను.

పిదప దేశభాషలోఁ బరీక్షింపఁబడి కృతార్థుఁడగుటచేఁ గాళీపాదునకు కొంత విద్యావేతనము ప్రతిమాసము రాఁదొడంగెను. భవానియుఁ దమకున్న స్థిరవసతిసంబంధములగు వ్యవహారములు చక్కఁబెట్టుకొనుట యుక్తమనియుఁ గుమారుని విద్యాభ్యాసము మాన్పించి యుద్యోగమునఁ బ్రవేశపెట్టవలయు ననియుఁ దలంచెనుగాని వాఁడు తల్లితో నింకను జదువుకొనెదననియు, లేనిచో సంపూర్ణసామర్థ్యము రానేరదనియుఁ జెప్పఁగా నామె "నాయనా! నీవు కలకత్తాకుఁ బోయి యింకను విద్యాభ్యాసముఁ జేయుము"ని యుపదేశించెను. అతండును నాకువచ్చు విద్యావేతనము చాలుననియు, నింక నా చదువుకొఱకు ధనవ్యయ మనవసరమనియు, నింకను నేదేని బరిశ్రమ గావించి కొంత ధనము సేకరించెదననియుఁ దల్లికిఁ బ్రియము నివేదించెను.

ఈ మార్గము మిగుల లాభకరమైనదని భవానీచరునకు నమ్మకముఁ గలుగఁజేయవలయునుగాని దానివలన భవానికి ఖేదము కలుగునని రాష్మణికిఁ దెలియకపోలేదు. మిగిలిన భూమి స్వల్పమనియు, దానికొఱకుఁ గాళీపాదుని యధ్యక్షత యనవసరమనియు భర్తతో వాదింపఁ దలఁపలేదు. కాళీపాదుఁడు సర్వజనాదరణీయుఁడై చాల చదువుచదివి మన వంశప్రతిష్ఠను గాపాడవలయు ననియే భర్తతోఁ జెప్పెను. చౌదరీవంశములోనివారు గుమ్మము దాటకుండగనే గౌరవము సంపాదించినవారు. మరణానంతరమువచ్చు లోకము తెలియఁగనియట్లే

వారు స్వగ్రామముతప్ప యితర గ్రామములెఱుఁగరు. కావున కాళీపాదుని వంటి బాలుఁడు కలకత్తాకుఁ బోయియుండుట దుస్సాధ్యమని భవాని నిరోధించెనుగాని బుద్ధిమంతుఁడగు బాగలుడు రాస్తు యభిప్రాయమునందే యేకీభవించెను. ముందు నీ కొమరుఁడు న్యాయవాది యగును. వాఁడు వ్యవహారములన్నియుఁ జక్కఁబెట్టుకొనును లేయనికూడ బాగలుఁడు భవానికి బోధించెను.

భవాని దొంగలింపఁబడిన తన తండ్రి మరణశాసన విషయములయిన లేఖ్యపత్రములన్నియుఁ బ్రతిదినము బైటకుఁదీసి కాళీపాదునితోఁ జర్చించి జరిగిన యన్యాయమును బోధపఱచుటకుఁ బ్రయత్నించెనుగాని కాళీపాదునకందుత్సాహములేక ఆ యన్యాయమునుగూర్చి స్వతంత్రాభిప్రాయములేక తండ్రియుద్దేశమునే యనువదించుచుండెను.

కాళీపాదుఁడు కలకత్తాకు బయలుదేరుటకు ముందు, తల్లి వానికే యరిష్టమును సంభవింపకుండ మెడకొక రక్షరేకు మంత్రములు వ్రాసియున్నది కట్టెను. గొప్ప యవసరమువచ్చినప్పు డుపయోగించుకొనుమంతవరకు దాఁచుకొనుమని చెప్పి యేబదిరూపాయల కరెన్సీనోటు కూడ యిచ్చెను. ఆమె సుఖపరిత్యాగముఁ గావించి దినకృత్యములు నిర్వహించుచు కష్టపడి కూడఁబెట్టియిచ్చిన యీ యేబదిరూపాయలనోటే అతనికన్ని రక్షరేకులకంటె నుత్కృష్టమైనది. కాళీపాదుఁడును జాగ్రత్తగా దాచి వ్యర్థముగ వ్యయముఁ గావింపక కాపాడెదనని తల్లితోఁ జెప్పెను. అట్లు కృతనిశ్చయుఁ డయ్యెను.

కాళీపాదుఁడు కలకత్తా వెళ్లినది మొదలు భవాని, మరణశాసనము దొంగరికమునుగూర్చి యంతగాఁ దలపెట్టుటమాని కుమారుని కలకత్తా ప్రయాణమునుగూర్చి చర్చింపసాగెను. ప్రస్తుతము కాళీపాదుఁడు కలకత్తానగరమున విద్యాభ్యాసమందు నిమగ్నుఁడై యున్నాఁడు. కలకత్తా సంగతులన్నియుఁ గరతలామలకమువలె వానికిఁ దెలిసినవే! కలకత్తాలో గంగానదిమీఁద హుగ్లీకి సమీపమున నింకొక వంతెన కట్టఁబోవుచున్నారను గొప్పవార్త ప్రప్రథమమున విన్నది కాళీపాదుఁడే! కుమారునిదగ్గరనుండి యుత్తరమువచ్చిన దినమున గ్రామమందున్న ప్రతి యింటికిఁ బోయి యుత్తరముచదివి వినుపించుచుండును. ముక్కుమీఁదినుండి సులోచనము జాఱుటకైనను వ్యవధిలేకుండఁ బ్రతియిల్లు తిరుగును. మఱియొక యింటికిఁబోయి ముక్కునుండి సులోచనములు జాగ్రత్తగాఁదీసి ధోవతికొంగునఁదుడిచి ముక్కునధరించి యా యుత్తరముమాట తరువాతమాటగా నెమ్మదిగాఁ జదువుచు "అన్నయ్యా వింటివా! లోకమేమికానున్నదో! పాదధూళి కడుగుకొనకుండఁ గుక్కలు, నక్కలు సైతము గంగానదినిదాటు

పాపకాలమువచ్చినది. ఇటువంటి పుణ్యనదీదూషణము జరుగునని యెవరను కొనిరి" అని వ్యాఖ్యానముఁజేయ మొదలిడును.

నిశ్చయముగ నది విచారింపవలసిన సంగతియే! కాని కుమారునియుత్తరము నుండి యెవ్వరికిని దెలియని గొప్పవార్త తెలిపి యసామాన్యమైన యానందమను భవించుట కవకాశమిచ్చినది. ఆ యానందము, గంగానదీ నిరోధమువలన నాధునిక కాలమందనేక ప్రజలకుఁ బరలోకహాని సంభవించునను చింతను బూర్తిగా నశింపఁజేసెను. ఎవరు కన్నడినను చూచితిరా? గంగా మా యంతర్గ్రామాలు కాఁదగిన పాపకాలము ఘటస్థించినదియని గంభీరముగాఁ బల్కుచుఁ దల యూఁచుచుండును. అట్టి గొప్పవార్త ప్రప్రథమమునఁ గుమారునివలనఁ దనకే తెలిసినదని గర్వపడుటయుఁ గలదు. కాళిపాదుఁడు తనకుఁ గావలసిన ధన మేవిధముననో సంపాదించుకొనుచుఁ బ్రవేశపరీక్షయందుఁ గృతార్థుఁడై మరల విద్యావేతనమును సంపాదించుకొనెను. కుమారుఁడు ప్రవేశపరీక్షయందుఁ గృతార్థుఁడైనమాటవిని, యెూడ సుశిక్షితముగా నెవ్వుచేరినదనియు నిఁక ధనవ్య యము మితముగాఁ జేయఁదగిన యావశ్యకతలేదనియును దలఁచి గ్రామస్థులంద టికిని విందుచేయవలయునని నిశ్చయించుకొనియెను. కాని యందులకై భార్య యేమియుఁ బ్రోత్సాహముఁ గలుగఁజేయలేదు.

కాళిపాదుని యదృష్టవశమునఁ గళాశాలకు సమీపమందు విద్యార్థులు కాపురమున్నయింట వానికొక చిన్నగది దొరకెను. గృహయజమానుఁడు మేడక్రింద నితరులకనుపయుక్తమైన యా గది నితని కద్దెలేకుండ నొసంగెను. మఱియు నింటనే యతనికి భోజనముకూడఁ బెట్టించుచుండెను. దానికి ప్రతి ఫలముగా, గాళిపాదుఁడాయింటి యజమానునికొడుకున కింటియొద్ద రాత్రి యొకగంట చదువుచెప్పుచుండెను. ఆ గది యితనికొకనికేకాని యింకొకరుఁ డుండుటకుఁ జాలదు. అది యితనికి మిగుల లాభకారి. తగినంత వెలుతురు లేకున్నను నితరుల గందరగోళములేకుండఁ జదువుకొనుటకు వీలుగానుండెను.

అద్దెయిచ్చి మేడమీదఁ గాపురముఁజేయు విద్యార్థులకునుఁ గాళిపాదు నకు నిసుమంతయు సంబంధములేదు. గాని మేడమీదనున్నవారు క్రిందనున్న వారిమీఁదికి గిరటమైచిన వస్తువులవలన నెక్కువ దెబ్బలుదగులుననిమాత్రము త్వరలో ననుభవమునకు వచ్చెను. మేడపైనున్న విద్యార్థులకు "సైలన్" అను వాఁడు నాయకుఁడు.

ఈ సైలను ధనికుని కుమారుఁడు. విద్యార్థులుండు వాసగృహమందుం డుటతని కనావశ్యకమయినను విద్యాభ్యాసమునకది చాల మంచిదని వాని

సంరక్షకులను నమ్మించి యతఁడుండుండెను. శైలనుకు స్నేహితులను సంపాదించుకొనుటయందుఁ జాలప్రీతి. విద్యార్థులుండుగృహమున మిత్రసాహచర్యమువలనఁగలుగు సంతోషమధికముగా నుండును. మఱియు నది ధర్మభారములేకుండ స్వేచ్ఛాసుఖమనుభవించుటకుఁ దగినప్రదేశము తాను యోగ్యుఁడననియు దయార్ద్రహృదయుఁడననియు శైలను తాత్పర్యము. అటువంటి దృఢవిశ్వాసమతనికుండుటవలన దాని నాచరణములోనికిఁ దెచ్చుచున్నాఁడా లేదా యనుటకుఁ బ్రమాణమక్కఱలేదు. వాస్తవముగ వాని కాపదయందున్న వారికుపకారముచేయు తలంపుగలదుగాని యాపదచెందినవారు తన్నాశ్రయింపవలయును. అట్లాశ్రయింపనివారిని మఱింత చిక్కులుపెట్టుటయు వాని స్వభావమే. నాటకముఁ జూచుటకుఁ బోయినపుడు స్నేహితులకుఁగూడ వాఁడే టిక్కెట్లు కొనును. అప్పుడెపుడు విందులు ఫలాహారములు భుజించుటకును వానితోఁబోయిన స్నేహితులకు డబ్బక్కఱలేదు. క్రొత్తగాఁ బెండ్లయినవాఁడు భార్యకు బహుమానమేమియిచ్చిన బాగుండునోయని సందేహముఁ జెందుచుండుతఱి రసజ్ఞుఁడగు శైలను చెప్పిన యుపదేశమును గ్రహింపవచ్చును. భార్యాసక్తుఁడగు నా యువకుఁడు శైలనుతో నంగడికిఁబోయి విలువలేనిదియు, నీచమైనదియునగు చీరఁ బేరముఁజేయఁగా శైలను విలువగలది బేరముచేయును. ఆ పదుచు మగఁడు డబ్బు తేలేదని సంగము ముడుచుకొనఁగా శైలను తానేరీనచీరనే యిప్పించి దాని విలువ తానే యిచ్చును. విద్యార్థులు మరలఁ దీర్చవలయునను నుద్దేశములేకుండ శైలనుయొద్ద నప్పుతీయుదురు.

ఈ రీతిగ శైలను మేడపైనున్న విద్యార్థులందఱికి నెయ్యము, తియ్యముఁ గలుపుచుఁ బోషకుడుగానుండెను. తన సాటిముఁగోరనివాని గర్వమును సహింపని దుస్స్వభావమొకటి యా శైలనునకుఁ గలదు. కాని వెనుకఁ జెప్పిన విధముగ ధనసాహాయ్యకముఁ జేయుట వానికి ప్రియమగువృత్తి.

కాళీపాదుఁడా క్షేమగదిలో నొక ముఱికిచాపమీదఁ జినిగిపోయిన దుస్తులుధరించి యీ మూలనుండి యా మూలకూగుచుఁ జదువుకొనుటాచారము. ముందుసంవత్సర మా విద్యార్థవేతనము దొరకనియెడల వానికిఁ జదువుసాగుట దుర్లభము.

కాళీపాదుఁడల్లు బయలుదేరకపూర్వమే ధనికకుమారుల సాంగత్యము పరిహరింపవలయునని కోరిన తల్లికిఁజేయనని వాగ్దానముఁజేసెను. అందుచేత లక్ష్మీపుత్రులగువారికిఁ దూరముననుండి వారికిఁ దన దారిద్ర్యభారముఁ దెలియ

కుండఁ బ్రవర్తించుచుండెను గాని కాళిపాదుఁడు దరిద్రుఁడయ్యుఁ దన సాయముఁగోరని గర్విష్ఠుఁడని సైలనునకుఁ దోఁచెను. అదియునుంగాక తమ విద్యార్థి గృహమందున్న విద్యార్థులందొకఁడైన కాళిపాదుఁడు దరిద్రుఁడై యాహారమందును. వస్త్రములయందును దైన్యమనుభవించుట సైలనునకు లజ్జాకరముగా నుండెను. కాళిపాదుని గది చూచినపుడెల్ల నక్కడనున్న మురికిచాప, విలువ లేనిగుడ్డలు, చిరిగినపరపు సైలనుకంటికి జుగుప్సావహమైయుండెను. ఆ ప్రక్క నుండి మేడమీఁదికిఁ బోవునపుడు గదియు, గదిలోనున్న వస్తువులు కన్పడక మానవు. మీఁదు మిక్కిలి కాళిపాదుని మెడలోనున్న రక్షరేకు వాఁడు ప్రతి దినము గావించు దైవప్రార్థనమును లోకాచార విరుద్ధముగాఁ గన్పడు చుండెను

తమకుఁ గృతజ్ఞుఁడైయుండునని తలంచి సైలను, సైలను స్నేహితులును గలసి యొకనాఁడు కాళిపాదుని విందుకుఁ బిలచిరి. కాళీపాదుఁడును నా యాచారము వేరనియు మీకును నాకును భోజనము సరిపడదనియుఁ గబురుపంపి యా విందు నిరాకరించెను. అట్టి నిరాకరణమునే విద్యార్థివలనను బొందనివాఁడగుటచే సైలను కాళిపాదునిమీఁద గోపముఁ గుతిపించెను. తరువాతఁ గొన్ని దినములవరకు మేడమీఁద గుబగుబలు, గబగబలు మొదలిడిరి. దానివలనఁ గాళీపాదునకు పాఠముఁ జదువుకొనుట సాధ్యముగాకుండెను. దానంజేసి యతఁడు చీఁకటియుండఁగనే లేచి వెలుతురురాక పూర్వమే ప్రాతఃకృత్యములు తీర్చుకొని నగరోపవనమునకుంబోయి యచటఁ జదువుకొనుచుఁ గాలముఁ గడుపవలసి వచ్చెను.

సరియగు నాహారములేకుండుటయు, మానసిక పరిశ్రమకలుగుటయు, మంచి గాలియు వెలుతురును లేని గదిలో నివాసముఁజేయుటను గాళీపాదునకు నిరంతరముఁ దలనొప్పిబాధ యెక్కువయ్యెను. క్రమముగఁ బరుపుమీఁదనుండి లేవ లేనిదినములుకూడ నుండెను గాని తండ్రికి వ్రాయు నుత్తరములలోఁ దలనొప్పి మాటయెన్నఁడును వ్రాయలేదు భవానిమాత్రము తన గ్రామము చుట్టుపట్ల నప్రయత్నముగ గడ్డిమొక్కలు నందలగునవి మొలచునట్లు కలకత్తానగరము నందన్ని సౌఖ్యములు నప్రయత్నముగనే కలుగుచుండునను నమ్మకముకలిగి యుండెను. తండ్రికిఁగల యా మూఢాభిప్రాయముఁబోనడచుటకుఁ గాళీపాదుఁ డెన్నఁడును బ్రయత్నింపలేదు. శిరోవేదనచే బాధపడు దినములయందును దండ్రికుత్తరము వ్రాయుట మానలేదు. మేడమీఁదనున్న విద్యార్థులు చేయు నల్లరి వీని బాధకు మఱింత వృద్ధికరముగానుండెను.

కాళిపాదుఁడు విద్యార్థుల దృష్టినుండి తప్పించుకొనుటకే ఎన్నఁడో కాని గదిలోనుంటయేలేదు. ఉన్నను నొకమూల నక్కి నిశ్శబ్దముగా నుండసాగెను. అయినను విద్యార్థులబాధ వానికి తప్పకుండెను. ఒకనాఁడు వాని చెప్పులలో నొకటి యెవ్వరోయెత్తుకొనిపోయి యంతకంటె చిక్కిన వింతగల చెప్పొకటి యందుంచిరి. నాటనుండియు విడిజోడైన చెప్పులతో వాఁడు కళాశాలకుఁబో వీలులేకుండెను. ఈ సంగతి యొకరితోడను జెప్పక, చెప్పులంకుట్టువానియొద్ద నొక ప్రాఁతచెప్పులజోడు కొని దానితో నడువసాగెను. ఒకనాఁడొక విద్యార్థి మేడదిగి కాళిపాదుని గదిలోనికివచ్చి, "ఓయీ! ఎన్నఁడేని పొరపాటున నీవు నా వెండి పొగగొట్టమును దీసికొనివచ్చితివా?" యని యడిగెను. కాళిపాదుఁడా ప్రశ్నమునకుఁ జాలవగచి, "అయ్యా నేనెన్నఁడును మీ మేడమీద నడుగుపెట్టలేదు" అని ప్రత్యుత్తరముఁ జెప్పెను. తరువాత వాఁడు గదిమూలనుండి వెండిపొగగొట్టమునుదీసి యిది నీ గదిలోనికెట్లు వచ్చినదని యడిగెను.

ఇంటరుమీడియేటు పరీక్షయందుఁ గృతార్థుడు కాఁగానే విద్యార్థివేతనము దొరికినయెడల నింకొకగదిలోనికి బసమార్చవలయునని కాళిపాదుని యభిప్రాయము.

ప్రతి వత్సరమందును నా మేడమీదనుండు విద్యార్థులందఱును దేవీనవరాత్రములలో సరస్వతీపూజచేయు వాడుక కలదు. అయిన వ్యయమందుఁ జాలభాగము సైలను భరించువాఁడు. తక్కినది విద్యార్థులందఱును దలకొక కొంత యిచ్చుచుండిరి. గడచిన సంవత్సరమునఁ గాళిపాదునియందుండు తిరస్కారభావమునఁ జందాదారుల లెక్కలోఁ జేర్పలేదుగాని యీ యేఁడు వాని బాధించుటకై చందాపుస్తకముతో వానియొద్దకు వచ్చిరి. ఉత్సవ సంతర్పణములోఁ బాలుగొనుటకు వాఁడిష్టపడకపోయినను నడిగిన వెంటనే యయిదు రూపాయలు చందాయిచ్చెను. "ఇంతకుమున్న దరిద్రుడని తిరస్కారభావమున మనమందరమును బరిత్యజించిన యితఁడడిగినవెంటనే ధైర్యముగా పైకమిచ్చెన"ని వారందఱికిని దుస్సహముగానే యుండెను. సరస్వతీపూజ లతివైభవముగ జరిగెను. కాళిపాదునియొద్ద నైదురూపాయలు తీసుకొనకుండినను నుత్సవమునకు లోపమేమియురాదు. ఆ చందాయిచ్చుట వానికతికష్టముగానుండెను. గృహయజమానునియింట భోజనముఁజేయుచుండెనుగాని వారెప్పుడుపెట్టిన నప్పుడే తినవలయును. వేళకుఁబెట్టుఁడని వారిని నిరోధించుటకు వీలులేదు కదా! వారు వీనికి వడ్డించు భోజనపదార్థములంత రుచికరములుగానుండవు;

దానంజేసి కొన్ని భోజనపదార్థము లధికముగ దీసికొనుచుండువాఁడు. నిర్బంధముచే నైసర్గికోపాయులు సెలవగుటవలన భోజనపదార్థములు కొనఁజాలకుండెను. అందువలన నాకలిబాధయుఁ దలనొప్పిబాధయుఁ దఱచుగా నెక్కుడయ్యెను. సరియైన కృషిచేసియుఁ బరీక్షయందుఁ గృతార్థుఁడైనను విద్యావేతనము మరల వానికి దొరకదయ్యెను.

శ్రమపడి కొంతమంది పిల్లలకుఁ జదువుచెప్పి ద్రవ్యమార్జించి మరలఁ గళాశాలలోఁ బ్రవేశింపఁదగినవాఁడగుటచేఁ గాళిపాదుఁడు పూర్వోక్తప్రకారముగ వెనుకటి బసమార్చుటకు నవకాశము లేనివాఁడయ్యెను. మేడమీదనున్న విద్యార్థులును కాళిపాదుని యప్రియదర్శనమునుండి విముక్తులమగుదుమను నాశయు లేనివారైరి. యథాప్రకారముగ మురికిదుస్తులు ధరించిన కాళిపాదుఁడును వాని తేమగదియు మరల ప్రత్యక్షమయ్యెను. కళాశాల తెఱచునాటికి సరిగా ట్రంకుపెట్టెయుఁ గొన్ని చిల్లరవస్తువులును ఘూమశకటారోహణస్థానమునుండి కూలివాఁడొకఁడు మోసికొనిరాఁ గాళిపాదుని గది తాళముతీయఁబడినది. కూలివానికీయఁదగిన కూలివిషయమై కొంత వాగ్వాదము జరుగుటవలనఁ గాళిపాదుని యాగమనము మేడపైనున్న విద్యార్థులకుఁ దెలిసెను.

ట్రంకుపెట్టెయందుగల రాష్ట్రే యతిశ్రద్ధతో సిద్ధముచేసిన యూరంగాయలు, పచ్చళ్లును గలవు. అవి కొడుకుకొరకు తల్లి యతిప్రేమతోఁ బంపినవి. తాను లేనిసమయమున మేడమీది విద్యార్థులు శంకలేక తన గదిలోఁ బ్రవేశించి తన వస్తువులన్నియు సవరింతురని కాళిపాదుఁ డెఱిఁగినదే కావునఁ దల్లి పంపించిన పదార్థములు వారి బారినుండి తప్పించుట యెట్లోయని కాళిపాదుఁడు పరితపించుచుండెను. మాతృప్రేమ సూచకములగుటచే నా పదార్థములు వానికి మహార్ఘములైనవి. కాని నగరవాసులగు విద్యార్థులు గౌరవమునఁ జూచునవి కావు. పల్లెటూరివస్తువులు, వికృతాకారముగల మట్టికుండలు, మూకుళ్లు, గాజువిగాని, పింగాణివిగాని కావు. నాగరికులైన ధనవంతులు హేళనచేయఁదగినవి.

పూర్వము కాళిపాదుఁడు తన సామగ్రులను ప్రాఁత వార్తాపత్రికలతోఁ గప్పి పఱుపుక్రిందఁ బెట్టువాఁడు గదికి దాళము వేయుటయే యెఱుఁగఁడు. కాని యిప్పుడు విద్యార్థులవలని భయమున రెండునిమిషము లావలకుఁ బోయినను తలుపు తాళము వేయునలవాటుపడెను. దానివలన సైలనుకును, దక్కిన విద్యార్థులకును మఱింత కోపము హెచ్చెను. రాతిగుండెగల కసాయివానికైనను గన్నీరు దెప్పింపఁగల యీ దరిద్ర కాళిపాదుని గది రెండవ బంగాళా ధనాగారమువలె రక్షింపఁబడుచుండుట మేడపై వారికయుక్తముగాఁ గన్పడెను.

"వాని ఫోర్సిప్సోటులును, విలువగల దుస్తులును నితరులు దొంగిలింపకుండ జాగ్రత్తపడుచున్నాఁడా! యేమి" అని వారొండొరులనుకొనిరి.

గచ్చురాలిపోవుచున్న కాళిపాదుని గది యెన్నఁడును సైలను లోపలికి వచ్చి చూచలేదు. ఒడలిపై బట్టలేకుండఁ బోగదీపముదగ్గరఁ దదేకదృష్టితోఁ జదువుకొనుచుండెఁగా సాయంకాలమున సైలను మేడమీఁదికిఁ బోవుచుఁ గాళిపాదుని గదిసందు కొకసారి ముక్కు మూసికొని కటాక్షములు ప్రసరింపఁజేయుట కలదు. శ్వాసావరోధానుభవముకూడ వాని కాసమయమునందే కలుగుచుండెడిది. సైలనొకనాఁడు కాళిపాదుని గదివెదకి వాఁడెందుఁ దాచిన పెన్నిధానమేమికలదో యొకసారి చూడుఁడని తన స్నేహితులతో ననియె. వారికిని నట్లు చేయుట వినోదకరముగానే యుండెను.

కాళిపాదుఁడు గదితలుపుతాళము చవకరకపుఁ దాళము. అది యే చెవికైనను లోఁబడునంతటిది. సాయంకాలమునఁ గాళిపాదుఁడు పిల్లలకుఁ జదువు చెప్పుటకొఱకు బయటికిఁ బోయినకాలమం దిరువురు ముగ్గురు విద్యార్థులొక కరదీపికఁ గైకొని తలుపుతాళముఁదీసి గదిలోఁ బ్రవేశించిరి. పఱుపుక్రిందనున్న యూరుగాయలకుండలను గనుఁగొనుట కొక నిమిషమైనను నక్కరలేకపోయెను. కాని యవి కాళిపాదుఁడంత జాగ్రత్తతోఁ గాపాడఁదగినవిగా నుండలేదు. మఱికొంతసేపు వెదుకఁగా దిండుక్రింద తాళము చెవులొకటి కన్పడెను. ఆ చెవితో ట్రంకుపెట్టె తెఱచినంతటఁ గొన్ని కాగితములు, కలములు, పుస్తకములు నుండెను. చాల జుగుప్సతో వెదకుచుండ నందుఁ బ్రాఁత చేతిరుమాలొకటి కన్పించె. దాని చెంగునఁగట్టిన మూటవిప్పఁగా నందేబది రూపాయలనోటు కన్పించె. వారందఱును నీ రూపాయలకొఱకే వాడంత జాగ్రత్తగా నున్నాడనుకొనిరి.

ఇంతటి నీచసందేహమున గది నింతగా భద్రపఱచుచున్నాడని వానియందు మఱింత తిరస్కారభావంబును, గోపమును గలిగియుండిరి. అంతలో వాకిలఁ గాలిచప్పుడు వినఁబడెను. వేగఁ బెట్టెమూసి తాళమువైచి విద్యార్థులందఱును మేడమీఁదికిఁ బరువెత్తిరి. పరువెత్తుచు నేబదిరూపాయలనోటుమాట మఱచిపోక వెంటఁగొంపోయిరి. సైలను చాల సంతోషించెను. ఏబదిరూపాయలు వానికొక లెక్క కాపుగాని కాళిపాదునిదగ్గర నంతమాత్రము ధనమున్నదని యతఁడెన్నఁడును దలంపలేదు. క్రిందనున్న ఆ విచిత్రపురుషుఁడు నోటుపోయినదని తెలుసుకొని యేమిచేయునో చూతమని నిశ్చయించుకొనిరి.

పిల్లలకు చదువుచెప్పి కాళీపాదుఁ డింటికివచ్చుచు నాఁడు చాల నలసి యుండుటవలన గదిలో జరిగిన యల్లరి గుర్తింపలేకపోయెను. తలనొప్పి యధికమగుటచే వంటనే పరుండెను. మరునాఁడు బట్టలుతీసికొనుటకు ట్రంకుపెట్టె తెరవఁబోఁగాఁ దాళము తీసియున్నట్లుండెను. జాగ్రత్తకలవాఁడైనను వెనుకటిదినముననే దాళమువేయుట మరచిపోతినేమో? యని యూహించెను గాని మూతయెత్తిచూడఁగా వంచలి వస్తువులు తారుమారైయున్నవి. తరువాతఁ దల్లియిచ్చిన నోటు కన్పడకపోగా వాని గుండెలు కొట్టుకొనసాగినవి. ఏ మూలనైన నున్నదేమో? యను నాశతోఁ బెట్టె పదిసార్లు వెదకెను నోటు కన్పింపదు. అంతట మృతునివలెఁ బరుపుమీఁదఁ బడెను.

కొంతసేపటికి మేడ మెట్లమీఁద నడుగులచప్పుడును, మేడమీఁద కేకలి నవ్వులును వినఁబడినవి. ఇది దొంగలపనిగాదనియు, సైలను విద్యార్థులచేఁ జేయించినపనియనియు వారి నవ్వులవలన వానికి స్ఫురించెను. దొంగలే దొంగలించినయెడల వానికంతటి విచారమేయుండెడు. ఆ పడుచుకూళీలు చేసినపని కనుకనే వారు పాపపుఁజేతులతోఁ దన తల్లిని నవమానించిరని తలంచెను.

కాళీపాదుఁడు మేడమీఁదికేఁగుట కిదియే మొదటిసారి తలనొప్పి బాధయైనను సరకుసేయక కోపముచే నెఱ్ఱఁబారిన మొగముతోఁ బొక్కా యిసుము భుజములపై వ్రేలాడవైచుకొని వాఁడు మేడమీఁదికిఁ బరువెత్తెను. వాఁడాదివారమగుటవలన సైలను మిత్రబృందముతో నవ్వుమాటలాడుకొనుచు వసారాలోఁ గూర్చుండెను. కాళీపాదుఁ డకస్మాత్తుగా వారి యెదుటికిఁ బోయి "నా నోటు నాకిచ్చివేయుఁడు" అని బిగ్గరగా నడిగెను. నోటిమ్మని ప్రతిమాలినచో వారిచ్చియేయుందురు గాని కాళీపాదుని యాగ్రహముఁ జూచి వారిట్లనిరి.

విద్యా.—(బిగ్గరగా) ఏమన్నావు. నీ నోటా! నీ నోటేమిటి?

కాళీ.—మీరు నా పెట్టెనుండి తీసిననోటు (అని బిగ్గరగా నఱచెను.)

విద్యా.—ఏమి నీ ధైర్యము. మేము దొంగలమనుకొంటివా యేమి?

ఇట్లు కొంతవివాదము జరిగెను. ఆ సమయమునఁ గాళీపాదునిచేత నాయుధమే యున్నచో వారిలో నొకరిని జంపువాఁడే. వాని యాగ్రహమట్లున్నది. వారును వీఁడును గొంతసేపు పెనఁగులాడిరి. వారిలో నైదారుగురు కాళీపాదు నీడ్చుకొనివచ్చి వాని గదిలోఁ బడవైచిరి. సైలను మిత్రులతో "మీకీ నూరు రూపాయలనోటు వానిముందరఁ బడవైచి యీ కుక్కమొఱగులు మాన్పింపుడు"

అని యిచ్చెను. "వాని హెచ్చుకోపము నణఁగనిండు. తరువాత నే యీవచ్చును లెండి. వానివలన లిఖితరూపమగు క్షమాపణ రావలయును నందాక మీరు మాటలాడకుడు" అని బిగ్గరగా నందరును బల్కిరి.

సైలను సంఘమువారందరును యుక్తకాలమునఁ బరుండి నిర్మలచిత్తులకు వచ్చు గాఢనిద్రఁ జెందిరి. ఉదయమున వారు కాళిపాదుని వృత్తాంతమే మఱచిరి. కాని కొందరు వాని గదిప్రక్కనుండి పోవుచు గదిలో నెవరో మాటలాడుట విని "వాడు న్యాయవాదితో నోటు దొంగతనమునుగుఱించి యాలోచించుచున్నాడు కాబోలు" అని యూహించిరి. తలుపులోపల గడియ బిగించియున్నది, తలుపువాకిలినుండి వినఁగా నా మాటలు న్యాయవాదితో వారాలోచించు మాటలుగా విన్పడలేదు అవంతయుఁ బిచ్చికూతలుగా వినిపించినవి.

ఈ సంగతి వారు సైలనుతోఁ జెప్పిరి. వాడువచ్చి తలుపుదగ్గఱఁ జెవిబెట్టి నిలుచుండెను. "తండ్రీ! తండ్రీ!" యను మాటతప్ప మరేమియు వినఁబడలేదు. దానసైలను భీతుఁడయ్యె. ఏబదివేలరూపాయల నోటు పోయినదను విచారముచే కాళిపాదునకు పిచ్చియెత్తియుండవచ్చునని తలఁచి "కాళిపాద బాబూ" యని రెండుసారులు పిలిచెను గాని ప్రత్యుత్తరము రాలేదు. గొణ గొణ ధ్వనిమాత్రము వినబడెను. మఱల "కాళిపాదబాబూ తలుపుదీయుము. నీ నోటు కనపడినది"ని పిలచెను. గొణగొణధ్వనియే తప్ప నప్పటికిని ప్రత్యుత్తరము రాలేదు.

తాను చేయించిన పనివలన నింత ముప్పగునని సైలను తలంచియుండలేదు. సహచరులకు తన పశ్చాత్తాపము తెలుపలేదుగాని మదిలో ఖేదపడుచునుండెను. తలుపు పగులఁగొట్టవలయునని కొందరును, రక్షకభటులను పిలిపింపవలయునని కొందరును కర్తవ్యముపదేశించిరి. సైలను వెంటనే వైద్యుని పిలిపించి తలుపు పగులగొట్టించిచూడఁ గాళిపాదుఁడు స్మృతిలేక క్రిందఁబడియుండెను. మంచముమీదినుండి పరుపు క్రిందికి వ్రేలాడుచుండెను. అస్ఫుటముగ లోలోపల నేదియో గొణుగుకొనుచుఁ బడియున్న యతని నేత్రములును, మొగమును రక్తవర్ణముఁ గల్గియుండెను. వైద్యుఁడు వానిఁ బరీక్షించి యుపేక్ష చేయఁదగిన స్థితిలో లేడని చెప్పెను. బంధువులు సమీపమునున్నచోఁ బిలువనంపుఁడని హెచ్చరించెను.

సైలను బంధువులసంగతి నాకుఁ దెలియదని చెప్పుచు రోగిని మేడమీదికిఁ దీసికొనిపోయి రాత్రియుఁ బవలు తగిన యుపచారము జరుగుటకుఁ దగిన

యేర్పాట్లుచేయించి కొంత మంచుగడ్డ తెప్పించి వాని తలపైనుంచి స్వయముగ వానికి విసరుచుండెను.

ఇంతకుమున్న కాళీపాదుఁడు తన తలిదండ్రులపేరు గాని, గ్రామనామము గాని సైలను మున్నగువారికి తెలియకుండ దాచెను. వాఁడు వెక్కిరింపుమాట లాడుదురను భయముతప్ప దాచుటకు మరి యేమియు కారణములేదు. దానం జేసి కాళీపాదుని తల్లిదండ్రులపేరు విద్యార్థులెరుగరు. సైలను కాళీపాదునకు నుపచారములు చేయించుచు వాని తలిదండ్రులపేరు తెలిసికొనుటకు వేరు మార్గము కన్పడక వాని ట్రంకుపెట్టె తెరచి యందు నూలుఁబద్దతో కట్టఁబడిన యుత్తరములకట్టలు రెండును విప్పెను. అందు నొక కట్టలో దల్లివ్రాసిన యుత్తరములును, నొక కట్టలో దండ్రివ్రాసిన యుత్తరములును గలవు. సైలను తెలుఁగుమాని యా యుత్తరములు చదువనారంభించెను. చౌదరీవంశమనియు, శస్యారిగ్రామమనియు, తండ్రిపేరు భవానిచరుఁడనియు తెలియఁగనే సైలను శరీరము భయకంపములకుఁ దావలమయ్యెను. ఉత్తరములు మడిచి కాళీపాదుని ముఖము నిశ్చలముగాఁ జూచుచుండెను. సైలను స్నేహితులు కొందరు నీకును గాళీపాదునకును పోలికయున్నది సుమాయని పల్కినపుడు సైలను నమ్మక కోపపడుచుండువాఁడు నేడు నిజము తెలిసికొనియె. తనకును కాళీపాదునకును పోలికగల్గుటకుఁ దగిన కారణము కన్పడియె. తన పితామహుఁడైన శ్యామచరునకు భవానీచరుఁడను సవతితమ్ముడున్నట్లు వాఁడెరింగినదియే. తదనంతరచరిత్ర యేమియును వానికిఁ దెలియదు. భవానీచరునకు కాళీపాదుఁడు కుమారుఁడన్న సంగతియు తెలియదు. భవాని దరిద్రుఁడనియు నెరుఁగడు. కాళీపాదుఁడు తన పోష్యవర్గములో జేరుట కిష్టపడనందులకు మున్ను కలిగిన కోపము పోవుటయేగాక యింటిటి యాత్మగౌరవము నిల్పుకోఁగల్గినవాడు తనకు బంధువుడయ్యెనుగదాయని మరింత గర్వించెను.

కాళీపాదుఁ డింతకుమున్న తన మిత్రులందరిచే నవమానితుఁడుగావున వారున్న బసలోనుండుట కిష్టపడక మరియొక యిల్లద్దెకుదీసికొని యందుఁ గాళీపాదునుంచి భవానీచరుని పేర సైల నుత్తరమువ్రాసెను. ఉత్తరమందిన వెంటనే భవానీచరుఁడు కలకత్తాకు వచ్చెను. కుమారుని జబ్బు నయమగువరకు కావలసి నంత ద్రవ్యము వెచ్చింపుడని తాను ప్రోగుచేసిన ద్రవ్యమంతయు రాష్మణి భర్తచేతికిచ్చి పంపించెను. ఇల్లువదలి కలకత్తాకుబోవుట చౌదరీకుటుంబము లోని కులస్త్రీల కాచారముగాదు కావున కులదేవతలఁ బ్రార్థించుచు రాష్మణి యింటియొద్దనే యుండవలసివచ్చెను. భవానీచరుఁడు వచ్చునప్పటికిని కాళీ

పాదుఁడు స్మృతిలేకయే యుండెను. సంధిలో పదిసారులు "తండ్రి, తండ్రీ" యని పిల్చుటయేకాని యెంత ప్రయత్నించినను కాళిపాదుఁడు తండ్రిని గుర్తింపలేకపోయెను.

వైద్యుఁడు మరలవచ్చి జ్వరము తగ్గుచున్నదనియు రోగము నయమగుటకనుకూలమగు మార్పు కలిగినదనియుఁ జెప్పెను. కుమారుని రోగము నయముకాదను నధైర్యము భవానీచరున కించుకయు లేదు. కాళిపాదుఁడు జీవింపక మానడనియే వాని దృఢనిశ్చయము. ఉపచారముఁ జేయుచు దగ్గరనున్న సైలనును జూచి భవానీచరుఁడు మిగుల నబ్బురపడెను. బంధువుఁడుకాదని తలఁచుట మిగుల కష్టముగానుండెను. పట్టణములో పుట్టి పెరిగినవారికట్టి సౌజన్యముండునని తలఁచుచు తనవంటి గ్రామవాసుల గ్రామ్యాచారముల నిందింపఁదొడఁగెను.

క్రమముగా జ్వరముతగ్గి కాళిపాదునకు స్మృతివచ్చెను. గదిలో తన యొద్ద గూర్చున్న తండ్రిఁజూచి యాశ్చర్యపడియెను. కలకత్తాలో తానెంత హీనదశలో జీవించుచున్నదియును తండ్రికి దెలియునేమోయని భయపడెను. తనతండ్రి గ్రామ్యాచారములనుజూచి సైలనుమీదనున్న విద్యార్థులు పరిహసింతురేమోయని విచారించెను. చుట్టును బరికించి "స్వప్నావస్థలోనుంటినా యేమి?" యనుకొనుచు గదిని గుర్తింపలేకపోయెను. కాదని తలఁచుటకును తగిన శక్తి లేకపోయె.

తన్నుమంచి బసలోనికి తీసికొనివచ్చినది తన తండ్రియే యనుకొనియెను. తండ్రి దానికి గావలసిన వ్యయమెట్లు భరింపగలఁడోయనియు గణింపలేకపోయెను. తాను జీవించెదననియు జీవించినయెడల నితరులకు సహాయము చేయవలెననియు వాని మదిలోనున్న ముఖ్యాభిప్రాయము.

ఒకనాటి వేకువ భవానీచరుఁడొద్ద లేనితరి కాళిపాదునొద్దకు సైలను కొన్ని ద్రాక్షపండ్లుంచిన తట్టఁ దీసికొనివచ్చెను. కాళిపాదునకుఁ దాని యర్థము తెలియక "యిది పరిహాసమా యేమి?" యని సంశయించెను. అది తన తండ్రికి పరాభవమనియు నట్టి పరాభవము లేకుండ తండ్రినెట్లు రక్షింపగల్గుదునా యనియు నాలోచించుచుండగ సైలనా పళ్లెమును బల్లమీదనుంచి కాళిపాదుని కాళ్లుపట్టుకొని "బాబూ నేను చాల నపరాధముచేసితిని క్షమింపుమ"ని చాల దైన్యమునఁ బ్రార్థించెను.

కాళిపాదుఁ డులికిపడి మంచముమీదినుండి లేచి సైలను పశ్చాత్తాపము యథార్థమైనదనియే తలఁచి ప్రేమచే గరగిపోయెను.

కాళిపాదుఁ డారంభదశలో విద్యార్థులున్న బసలో బ్రవేశించినపుడు సుందరుఁడైన సైలనుం జూచి హృదయ మాకర్షింపఁబడుటచే నతఁడు నేఁడమీది నుండి తన గదిప్రక్కనుండి పోవునపుడు వాని సుందరముఖారవిందమును చూచుట కవకాశముండునో మాచుచుండువాఁడు గాఁడు. వానితో స్నేహము చేయుటకును, ప్రాణమైన నర్పించుటకును సిద్ధపడియేయుండెను కాని స్నేహ ప్రవేశమునకు సైలను దురహంకారప్రాకారము చోటిచ్చినది కాదు. నేఁడు ద్రాక్షపండ్లు తెచ్చియిచ్చి క్షమాపణ వేఁడుకొనిన సైలను ముఖపంకజము నిశ్చలముగఁ జూచి పశ్చాత్తాపసూచకములైన ద్రాక్షపండ్లు గ్రహించెను. తండ్రికిని వానికిని కలసిన యన్యోన్యస్నేహమును చూచి వినోదించెను. సైలను భవానీచరుని "తాతా" యని పిలుచుచు తాతగారితో హాస్యమాడుటకు మనుమనికిఁగల హక్కును పూర్తిగా నుపయోగించుచుండెను. ఆ హాస్యములో మొదటి విషయము దూరమునందున్న నాయనమ్మ. కాళిపాదునకు జబ్బు చేసినకాలమున మా నాయనమ్మ పంపించిన రుచిగల పచ్చళ్లన్నియు దొంగిలించి తినిసుమా యని తన హాస్యము తాతగారికి విన్నవించెను. దానికి కాళీపాదుఁడును సంతోషించెను. వస్తువులు దొంగిలింపఁబడినను తన చేసిన వస్తువులు రుచిగలవని మెచ్చుటయే వానికి పదివేలు. ఈ విధముగ నారోగ్యమును పొందుచున్న కాలమే కాళిపాదుని జీవితకాలములో నధికానందప్రదమైన కాలము. ఈ కేవల శుద్ధానందమందొక్క దోషముండెను. కాళిపాదునకు తన దారిద్ర్యమునందే యధికాభిమానము. దానం జేసి పూర్వము తమ కుటుంబ మధికైశ్వర్య మనుభవించినదని చెప్పుకొనుట కిష్టపడఁడు. భవానీచరునకట్లు చెప్పుకొనుచుండుటే పరమాదరము. అతఁడట్లు చెప్పునప్పుడు కాళిపాదుని మదికి కంపము కలుగుచుండును. భవానీచరుని జీవితకాలములో జరిగిన సంగతులలో మరణశాసన చౌర్యమే గొప్ప సంగతి. ఆ మరణశాసనము మరల దొరకునను దృఢవిశ్వాసము వానికి కలదు. దానిచే నతఁడు తద్విషయక ప్రసంగము చేయుచుండి మౌనీభావము నొందలేకపోయెను.

మరణశాసనవిషయికమగు మతిభ్రమ తండ్రికిగలదని తలఁచి కాళిపాదుఁడు తండ్రి ననుసరించుచుండువాఁడుగాని యిప్పుడాసంగతి సైలనునకు చెప్పునప్పుడు కాళిపాదుఁడు సిగ్గువడఁజొచ్చెను. సైలను మరణశాసన చౌర్య వృత్తాంతము వినునప్పుడు కొంత మనోవికారము చెంది యదంతయు నసంగత

మని నిర్ధారణచేయుటకు ప్రయత్నించుచుండెను. ఎట్టి వివాదము వచ్చినను భవానీచరుఁడు వివాదపడక యితరుల యభిప్రాయముతో నేకీభవించువాఁడే గాని మరణశాసనవిషయక చర్చవచ్చినప్పుడుమాత్రము వాని హృదయము వజ్రమువలె నిశ్చలమైయుండెడిది "మరణశాసనము వ్రాయుటవలన లాభము నొందుచుండినవారు మీరు దాయాదులే, పుత్రులుగారంటివా? కావున దాని కొఱకు పరితపింపవలదని కాళిపాదుఁడు తండ్రితోఁ జెప్పుచుండును. ఈ వివాదము పెద్ద ప్రొద్దుజరిగినప్పుడు సైలను వినలేక బయటికి పోవుచుండును. సైలను లేచిపోయినపుడెల్ల వానిమీఁద తండ్రికి దురభిప్రాయము కల్గునేమో యని కాళిపాదుఁడు పరితపించుచుండును. సైలకు గల బాంధవ్యమును కాళి పాదునకును తెలుపకుండ మరణశాసనవిషయకచర్చయే యడ్డువెట్టెను. తన తండ్రి తాతలు మరణశాసనము దొంగిలించినను దురభిప్రాయము లేదుగాని భవానీచరునిపట్ల నేదియో ఘోరమైన యన్యాయము జరిగినదనిమాత్రము సైలను తలఁచుచుండును.

ఇంకను కాళిపాదునకు సాయంకాలమునందు కొంచెము తలనొప్పి కొంచె ముష్ణాధిక్యము తిరుగుచునేయుండె. ఆ రోగచిహ్నలను లక్ష్యము చేయక విద్యావేతనము మరల సంపాదించి విద్యాభ్యాసముచేయవలయుననియే కాళిపాదుఁ డుత్సాహముపడుచుండెను. వైద్యుఁడు చదువవలదని కఠినమైన శాసనము చేసియుండినను దానిని లక్ష్యపెట్టక యేకతముగ చదువ నారంభించె. తన కారోగ్యస్థితి కలిగినదని తండ్రిని గట్టిగా నమ్మించి స్వగ్రామమునకుఁ బొమ్మనియె. భవానియు నిక్కడ భోజనసౌఖ్యములేక యింటికిపోవలెనని కోరికకలిగియేయుండెను గావున వెంటనే ప్రయాణమయ్యెను. బయలుదేర దలచిన దినమున నుదయముచూచి యాశీర్వదించిపోవుటకు భవాని కాళిపాదుని యొద్దకుఁ జనినప్పుడు వాని శరీరమునకు వేడితగిలి మొగమెఱ్ఱనై జబ్బుగా నున్నట్లు కనబడెను. గడచినరాత్రి యర్ధరాత్రమువరకు తర్కగ్రంథము పత్రము తరువాత పత్రము వల్లించుచునేయుండెను. మిగిలిన రాత్రియంతయు నిద్రపట్టక మేల్కొనియుండెను. దానంజేసి జబ్బు తిరుగఁబెట్టెను. వైద్యుఁడు సైలనుంబిలిచి రోగము తిరుగఁబెట్టినది, యిది ప్రాణాపాయకరము సుమాయని గట్టిగాఁ జెప్పెను. సైలను భవానివద్దకువచ్చి రోగికి తల్లి యుపచారమావశ్యకము కావున నామెను వెంటబెట్టుకొని రావలెనని చెప్పెను. సాయంత్రము నకే బ్రాహ్మణి తనంతనే వచ్చెను. ఆమె వచ్చినతరువాత కొన్ని గంటలు మాత్రమే కాళిపాదుఁడు జీవించియుండెను. ఈ దారుణకష్టమును భర్త

యెట్లు సహించునాయని యామె దుఃఖము దిగమ్రింగెను. ఆమె హృదయము మృతినొందిన కుమారునిపట్ల దుఃఖమును జీవించియున్న భర్తపట్ల దుఃఖమును భరింపలేక దైవమాయని దేవుని ప్రార్థించుచు నెట్లో భరింపగల్గెను. తరువాత దుఃఖభారంబున నలసి వారు స్వగ్రామము చేరునప్పటి కర్థరాత్ర మయ్యెను. రామ్మణికెట్లో నిద్రపట్టెను. భవాని నిద్రపట్టక పరుపుపై నట్టిటు దొరలుచు నిట్టూర్పువిడుచుచుండెను.

తరువాత కాళిపాదుఁడు బాల్యమున చదువుకొన్న గదిలోనికిఁబోయి వాడుపయోగించు కరదీపిక చేతఁబుచ్చుకొన్నప్పుడు చేతులు వణకెను. చిన్నతనమున తల్లి కట్టియిచ్చిన బొంత యిప్పుడు చిరిగి చికాకై సిరామరకలతో నొక కొయ్యబల్లమీఁదఁ బడియుండెను. గోడలమీద మసిబొగ్గుతో గీసిన క్షేత్రగణితసంబంధమైన బొమ్మలును, అంకగణితసంబంధములైన యంకెలును; మునుపు వాడుపయోగించిన చెప్పులజోడులో పోగా మిగిలిన రెండవ చెప్పింత కాల మదృశ్యమై ధూళితోనిండియున్న చీకటిగదిలో నొకమూల నిప్పుడు కన్పడెను. నేఁడదియే దాచదగిన గొప్ప వస్తువయ్యెను. భవాని దీపము గోడకూటిలోనుంచి బల్లమీఁదఁ గూర్చుండెను. కన్నులఁ దడిలేదు. ఊపిరి రాదు. శ్వాసావరోధము పోదు. ఇట్లు కొంత తడవుండి తూర్పువైపుననున్న నొక కిటికీ తెరచి యినుపచువ్వలను పట్టుకొని చీకటివైపు చూచుచుండెను. తుంపరలుగా కురియుచున్న వర్షములో బైటగోడ చిట్టచివర చెట్లగుంపుల యాకారముమాత్రము కన్పడుచుండెను. చేతులార పెంచిన పూలచెట్లొత్తుగా పెరిగియుండుటచూచి భవాని హృదయము స్వస్థానమునుండి లేచిపోయెను. రేపువచ్చు నెల్లుటవచ్చునని యిప్పుడెవ్వరికొరకును ప్రతీక్షింప నవసరములేదు గదా. వేసంగిసెలవులు వచ్చునుగాని యప్పుడీగదిలో గూర్చుండి యిందుండు బల్లలును కుర్చీలు నుపయోగించువారెవ్వరును రారుకదా, "అయ్యో నా ముద్దులబిడ్డా" యని యేడ్చుచు నక్కడ కూర్చుండెను. వర్షమధికముగా కురియు చుండెను. అప్పుడు గడ్డిలోనెండిన పారుటాకులమీద నడుగులచప్పుడు వినబడియె. భవానిహృదయము నిశ్చలముగానుండెను. వచ్చినది కాళిపాదుఁడేమోయని తలఁపరాని తలంపొకటి పుట్టెను. తోటఁ జూచుటకు కాళిపాదుఁడే వచ్చినాడనియు వర్షములో నెంత తడిసెనోయనియు భవానిహృదయము కంపించెను. అప్పుడెవ్వరో కిటికీ యినుపజువ్వలకెదుట నిమిషము నిల్చుండెను. తలగుడ్డచే కప్పియున్నందున వాని మొగము స్పష్టముగా గుర్తించుటకు వీలులేకపోయెను. కాని వాని పొడుగుమాత్రము కాళిపాదుని పొడు

గంతయే యుండెను. అంతట "ముద్దుబిడ్డా వచ్చినావా" యని తలుపుతీయుటకు భవాని పరుగెత్తెను. తలుపుతీసినంతట సంచు నిల్చియున్న నారన్నయును లేదు. ఆ వర్షములో తడియుచు భవాని తోట నాల్గువైపుల తిరిగెను. ఒక్క నిమిషము నిశ్చలముగ నుండి కంఠమెత్తి కాళిపాదా! కాళిపాదా! యని పిల్చెను. ఎవ్వరును కన్పడలేదు, యెవ్వరును పల్కలేదు. ఆ కేకవిని పశువుల కొట్టములోనున్న పరిచారకుడు లేచివచ్చి భవానితో మృదువుగా మాట్లాడి దానిని గదిలోనికి పంపించెను.

మరునాడుదయమున పరిచారికునకు గది తుడుచుచుండగా కిటికీ క్రింద నొక కాగితపుకట్ట కనుపించెను, వాడు దానిని భవానికిచ్చెను. విప్పి చూడగా నందొక ప్రాతకాగితము కన్పించెను ముక్కున సులోచనముం ధరించి కొన్ని పంక్తులు చదివి భవాని పరుగుపరుగున వచ్చి యా కాగితము రాఘవకిచ్చెను. "అదేమిటి" యని రాఘవ యడుగ నదె మరణశాసనమని భవాని చెప్పెను. దానిని నీ కెవరిచ్చిరని మరల నడుగ గడచినరాత్రి వాడే వచ్చి నాకిచ్చెననియె. దానితో నేమిచేయదలచినావని యడుగ దీనితో నాకేమియు నవసరములేదని చెప్పి ముక్కముక్కల క్రిందచింపివైచెను. "ఈ వార్త గ్రామములోనివారికి తెలియగనే బాగలుడు గర్వముతో తల యూపి కాళిపాదునిద్వారా మరణశాసనము మరల దొరకునని భవిష్యత్తు చెప్పలేదా" యనియెను.

కడచినరాత్రి పదిగంటల రైలుబండి వచ్చినప్పుడొక సుందరుడైన యువకుడు నా దుకాణమువద్దకువచ్చి చౌదరీగృహమునకు త్రోవచూపింపుమని యడిగెను. వానిచేతిలో నొక కాగితపుకట్టయున్నదని యా యూరనున్న చిల్లరవర్తకుడొకడు చెప్పెను. ఇది యనుమానపన్నమని బాగలుడు చెప్పెను.

## 10. నారాయణపుర జమీనుదారులు.

పూర్వము నారాయణపురంబున జమీనుదారులగు బంగాళీబాబులం కొందఱు కలరు. వారును రాజులుగావించు దుర్వ్యయమునందు ప్రసిద్ధులే. కోమలములగు సన్నని చెలచెఱంగుల యొరపుడు సైతము సైపలేని సౌకుమార్యము కలవారు. వారు బొమ్మపెండ్లిండ్లకు సైతము వేలకొలంది సొమ్ములు వ్యయ పఱచుచుండిరి. వారొక్క మహోత్సవసమయంబున రాత్రియందంబగలు సూర్య

రశ్మిని ధిక్కరింపఁజాలు వెల్తురుగల దివ్వెలు వెలిగించి వర్షధారలవలె వెండి తీవలు దిక్కులనిండ నిండునట్లు చేసిరట.

ఈ మహైశ్వర్య ప్రశంసయంతయుఁ జాలయేండ్ల క్రిందటిది. విషయ సుఖాసక్తులగు నీ బంగాళీల యైశ్వర్యము పెక్కువత్తులు వెలిగించిన తైలదీపిక వలెఁ గొంతకాలమునకే యంతరించెను. సంపదతోఁ బాటు జనసంఖ్యయు నశింపఁ దుట్టతుదకు వంశము పేరుపెట్టి "కైలాసబాబు" అనునాతం డొకండుమాత్రము మిగిలెను. వానికి యౌవనము రాకమున్నే పూర్వార్జితమగు ధనమంతయుఁ దగ్గిపోయెను. పోఁగా మిగిలిన ధనమతఁడు తన తండ్రి యుత్తర క్రియలకు వెచ్చించెను. స్థిరవసతి కొంచెముండెనుగాని యది యప్పులవారా క్రమించిరి. ఆక్రమింపఁగా మిగిలినది వాని జీవితోపాధికిఁ జాలకుండెను.

కైలాసబాబు నారాయణపురము వదలి కలకత్తా ప్రవేశించెను. విభవహీనమగు కైలాసబాబు గృహంబున నుండరాదని కాబోలు నతని కుమారుఁడు మృతిఁజెందెను, వానికొక కూఁతురుమాత్రము కలదు. కైలాసబాబు కుటుంబమంతయు మనుమరాలితోఁ గలసి యిద్దరుమాత్రమే.

మేము కలకత్తాలోఁ గైలాసబాబు గృహమునకుఁ బొరుగింటివారము. మా రెండిండ్లవారికిని విపరీత భేదము కలదు. మా తండ్రి స్వయంకృషివలన ధనమార్జించి చేయఁదగినదానికంటె నెక్కువగ నొక గవ్వయైనను నెచ్చింపక గర్వమూరుఁడై యుండువాఁడు కష్టపడువాఁడు. కూలివానివంటి దుస్తులు ధరించువాఁడు. బడాయికై ద్రవ్యము వెచ్చించి లేనిపోని బిరుదములు సంపాదింప నిచ్ఛలేనివాఁడు. ఆయనకు నే నేకపుత్రుఁడను. కృతజ్ఞుఁడను. ఇంతటి లోభియైనను, నా తండ్రి నాకు మంచి విద్య నేర్పించి స్వతంత్రజీవనముఁ జేయఁదగినవానిఁగా నన్నుఁ జేసెను. నా తండ్రి నాటి సంపదయేకాని పూర్వార్జితము నాకేమియు లేదని వచించుటకు, నాకు దప్పు లేదు. అభిమానమును లేదు. గొప్ప ధనవంతులైన పూర్వుల పేళ్లుగల వంశవృక్షపత్రములకంటె గరగరలాడు ధనపత్రములు పెట్టెలో నుండుటే నాకుఁ జాల ప్రియము. సర్వస్వముపోయి పూర్వపుఁ బ్రతిష్ఠమాత్రముఁ జెప్పుకొనుచు, బడాయిమాటలు మాటాడుచు, లోకమును విశ్వసింపఁజేయ బ్రయత్నించుచున్న కైలాసబాబునందుమాత్రము నాకేమియు గౌరవములేదు. నేనుదప్ప గైలాసబాబునం దితరులెవ్వరు నగౌరవముఁ జూపువారులేరని నాకుఁ దెలియఁదగినదే, కైలాసబాబుకంటె సర్వజనప్రియుఁడగు నింకొక గృహస్థునిఁ గనుఁగొనుట కష్టము. నిరపాయచరిత్రకలవాఁడన నాతఁడే. అందఱి సుఖదుఃఖములను సమానముగఁ బంచుకొనువాఁడు.

అందఱికిని దగినంత చేతనైన సాయముఁజేయుటకు వెనుదీయఁడు. బాలురు గాని, వృద్ధులుగాని యెవ్వరైనను జబ్బుగనపడితో కుశలప్రశ్నము సేయు వాఁడు. వారివారి యింటివ్యవహారములు తీరికయుండ చెప్పువారున్నచో విసుగులేకుండ వినువాఁడు. ఏ స్నేహితుఁడు కన్పించినను బలాత్కారముగ నాపి, "నిన్నుఁజూచి చాలకాలమైనది, నీవు కన్పడుటచే నేఁడు సుదినము. నీ శరీరములోఁ గులాసాగానున్నదా? శశికేలాగునున్నది? మీ తండ్రిగారు కుశలులైయున్నారా? మధుసూదనుని కొడుకునకు జ్వరము తప్పియున్నదట నీకేమైనను తెలిసినదా? చంద్రశేఖరుని కేలాగున్నదో నీవు వింటివా? హరిచరణబాబునుజూచి పెక్కుదినములైనది. నీకెన్నఁడేనఁ గన్పడుచుండెనా? ఆయన శరీరమారోగ్యవంతమై యున్నదని తలంచెదను. మీ యింటివాఁడు వాండ్రందఱును నారోగ్యవంతులైయున్నారా?" అని లేనిపోని సంగతులడుగు చుండువాఁడు.

చాల దుస్తులు లేకున్నను కైలాసబాబు చిన్నఁదనము ముతకిలేని బట్టలుకట్టుకొనియే కన్పించువాఁడు. వీధినుండి యింటికేఁగగ వెంటనే యతఁడు చొక్కాయములు, గోళ్లు మొదలగు దుస్తులు గాలిలో నారఁబెట్టి మడిచి పెట్టెలో పెట్టి దాచును. తాను గూర్చుండు తివాసి యొడిలో నిఁడఁబెట్టి దుమ్ముదులిపి జాగ్రత్తగానుంచును. ఆతఁడు గదియంత విశాలమైనది కాకున్నను, నందున్న కుర్చీలు మొదలగు కొయ్యసామానులు కొంచెమైనను, నవియేమాత్రనష్టములేకుండ బాగుచేసికొనుచుఁ గావలసినప్పుడుపయోగించుకొనును. అతని యా చిన్నయిల్లు చూచిన వారిందులకని నందున్న సామానులే మఱియొకచోట నింకను జాలనున్నవని మాత్రము సూచించుచుండును. పరిచారికులు లేనందున సేవకవృత్తియంతయుం దలఁపు మూసికొని తానే చేసికొనుచుండువాఁడు. పూర్వార్జితమగు ధనము లేకపోయినను వెండి పన్నీరుబుడ్డియు, సత్తరుపెట్టెయు, బంగారుపళ్లెరమును, విలువైన శాలువయుఁ, దలగడ్డయుఁ, బూర్వవైభవమును సూచించు మఱికొన్ని దుస్తులును మిగిలియున్నవి. అవి కొన్ని యుచితసమయంబుల ధరించి నారాయణపురాధికారుల జగద్విఖ్యాతమగు ప్రతిష్ఠను గొంతవఱకు నిలుపుకొనునట్లు చేయువాఁడు. ఎవ్వరితోడనైనను స్నేహితులతో మాటలాడునపుడు వంశాభిమానము వెల్లడిసేయుచుఁ బ్రౌఢముగా బడాయితో మాటలాడు నాచారమొకటియున్నను, కైలాసబాబునకది గర్వసూచకము కాకయే యుండెను. మిత్రులందఱును నతండట్లు మాటలాడునపుడు మఱింత వంశాభిమానము వెల్లడిసేయునట్లు సంభాషణము హెచ్చించుచుండుటతనికి మఱింత వినోదమగుచుండెను. ఇరుగు

పొరుగువారు కొందఱికిఁ "గైలాసబాబు" అని పిలువక యతనిని "ధాకూరు దాదా" యని పిలుచుటభ్యాసమయ్యె.

ఈ "ధాకూరుదాదా యింటికి నిత్యము కొందరు స్నేహితులకుఁ గొంత సేపువచ్చి కూర్చుండుటలవాటు. వారిలో నొక మిత్త్రుఁడు దాదాగారూ! గయనుండి నేఁడు నాకు పొగాకొకరు పంపించిరి. అది రుచ్యముగానున్నదో లేదో యొకసారి చూచి చెప్పుఁడు" అని చేతికందీయ చాల బాగున్నదని నుడువుచు "మా నారాయణపురమున నున్నపుడు మేము కాల్చుపొగాకు తులమొక యాఱు రూప్యములకు వెలకలది. అందు నాయొద్ద నేమాత్రమో మిగిలియున్నది. మీరెవ్వరేని జూచెదరా?" యని దానినొక రెండు గడియలు వర్ణించి, యెవ్వరైన నేదీ! చూతము కొంచెము తెప్పింపుఁడనినఁ దాళపుఁజెవి యెక్కడనో మా సేవకుఁడు పాఱవైచెనని ప్రత్యుత్తరము చెప్పుచుండుట వారి కెల్లరకు క్రొత్తకాదు.

సేవకులకు వస్తువులప్పగించినయెడల నా వస్తువు లెందుంచునోగాని సమయమునకు మనకుఁ గన్పడవు. మా సేవకుఁడు గణేశుఁడు మిగుల తెలివితక్కువ వాఁడు. "అయినను వానిని పనినుండి తొలగించుటకు నా మనసొప్పదు" అని దాదాగారు మిత్త్రులతోఁ జెప్పుచుండుటయుం గ్రొత్తకాదు. కైలాస బాబు మాటలయందలి సత్యము నిలుపుటకు గణేశుఁడను సేవకుఁడొకఁడు మాఱు మాటాడక యతని నిందావాక్యములు సహించుచుండును. "పోనిండు, మీ పొగాకు చాల మంచిదగుటచే మేము పీల్చలేము. అది వెదకించుటకు మీకుఁ బరిశ్రమ యెందులకు" అని యొక మిత్త్రుఁడు పలుకగ సమయమునకు మాట దక్కదని విసుగుకొనుచు మిత్త్రులెవరిండ్లకు వారు పోవునపుడు కైలాసబాబు ద్వారమువఱకు సాగనంపి యక్కడ నిలువఁబడి "మిత్త్రులారా! మీరందరు మా యింటికి విందుకు రావలయు నెప్పుడు వచ్చెదరు"ని యడుగగాఁ గొంద రిప్పుడు కాదనియు, కొందరు ముందాలోచించెదమనియు, కొందరు వర్షా కాలమువచ్చువఱకు విందుమాట తలపెట్టకుడనియు, వేళాకోళముగా పల్కినను, బాబుమాత్రము నిజమనియే యెంచుకొనువాఁడు. వర్షర్తువువచ్చినప్పుడు మఱల నొక కొంటెమిత్త్రుఁడు మీ యింట విందెప్పుడని యడుగగ "వర్షములు కొంత తగ్గనీ" యని మఱియొక్కఁడును, వేసఁగికాలమయిన మఱియు మంచిదని యింకొకఁడును పల్కుచుందురు. ఈ విధముగా కైలాసబాబునింట మిత్త్రులకు ప్రతిదినము మితిలేని వినోదములు జరుగుచుండును.

మఱికొందరు మిత్రులు "దాదాగారూ! మీరు కాపురమున్న యిల్లు మిగులఁ జిన్నది, మీ గౌరవమునకుఁ దగినది కాదు. దానికై మేము మిగులఁ బాధపడుచున్నాము. కలకత్తాలో నింతకంటె పెద్దయిల్లు సంపాదించుట దుస్సాధ్యము. మేము చిరకాలమునుండి దానికై ప్రయత్నించుచున్నాము"ని బాబుతోఁ బ్రస్తావింప నతఁడును పెదవి విఱుచుచు, "ఈ యిల్లే చాలు. దూరముగఁ బోయిన మీవంటి మిత్రుల సహవాసము దొరకదు"ని చిఱునగవుతో బదులు చెప్పుచుండును. కాని తరువాత కైలాసబాబుకొరకు కలకత్తాలో నిల్లు వెదకు తెలివితక్కువవాఁడా మిత్రకోటిలో నెవ్వఁడు నుండఁడనియే నా నమ్మకము.

మనుష్యుఁడు యౌవనవంతుఁడై యుండునప్పుడు తెలివితక్కువవాఁడగుట కంటె నేరములేదు. అట్లగుట మానవుని జీవితములో చేయు నేరములన్నిఁటి కంటె గొప్ప నేరము. ఆలోచింపగా కైలాసబాబు మూర్ఖుఁడు కాఁడు. సాధారణముగఁ బ్రతివాఁడును వానితో మాటలాడుటకు సిద్ధపడును. వాఁడు సిద్ధపడకపోయినను బాబు మాటాడింపక మానఁడు. కాని నారాయణపురి ప్రతిష్ఠను గురించి బాబు చెప్పు సంగతులన్నియు ప్రపంచజ్ఞానరహితములనుటకు సందియములేదు. కాని యట్టి సంగతులు చెప్పుచుండినను ప్రేమచే నెవ్వరు నెదురు చెప్పక వినుచుండుటచే నతనికి నతిశయోక్తులు మఱింత చెప్పుట యలవాటు పడియె. అతఁడు వినుచుండ నారాయణపురిచరిత్ర నెంత గొప్పగా నెవ్వరు చెప్పుచుండినను "సత్యము" "సత్యమ"ని తలయూచుచుండునేగాని యిది యెవ్వరును విశ్వసింపరనిమాత్రము కలలోనైన తలఁపఁడు.

ఇంత మంచివాఁడైన కైలాసబాబునందు నాకు ద్వేషముండుటకుఁ గారణమేమని నేను నెమ్మదిగఁ గూర్చుండి నెమ్మది యోజించి నా మనోవృత్తులును, నా యభిప్రాయములును పరిశీలింపగా నొక్క కారణము కన్పడినది. అది మీకు స్పష్టపఱచెదను. నేనొక భాగ్యవంతుని కుమారుఁడనైనందునఁ గళాశాలలో చదువక కాలము వ్యర్థముచేయవలసినదే. కాని యట్లుచేయక చాల కష్టపడి విద్యనభ్యసించి ప్రాయము ముదరక పూర్వమే కళాశాలలో ఎమ్.ఏ., బిరుదము సంపాదించితిని. నా విషయమై నేను చెప్పుకొనినచో నాత్మస్తుతి దోషముండిన నుండవచ్చునుగాని యసత్యదోషముండదు. నా ప్రవర్తన నిర్దుష్టమైనది, నా రూపము చాల రమణీయమైనది. కావున పెండ్లికెదిగిన యాఁడుపిల్లలుకల తల్లిదండ్రులలో పెక్కుమందిచే వంగదేశపు బాలురలో నేననుకూలుఁడైన వరుఁడనని భావింపఁబడుటకు సందేహములేదు. అట్టి దృఢాభిప్రాయము నాకునుఁ గలదు. అందుచేత పెండ్లిబజారునందు నాకు మంచివెల

రాఁబట్టుకొనవలయునని నిశ్చయించుకొంటిని. నేను వరింపఁదలచిన కన్యకను మనమునఁ జిత్రించినవుషతిసుందరియు, చదువరియునగు నొక ధనిక కన్యక నా మనోనేత్రమునకెదుటఁ గాన్పించెను. నలుప్రక్కలనుండి పిల్లలనిచ్చెదమని కబుర్లు వచ్చుచుండెను. చాలసొమ్ము కట్నముగానిచ్చెదమని చెప్పసాగిరి. ఈ సంబంధములలో నా కనురూపమైన సంబంధమున్నదా లేదా యని సమబుద్ధితో వాని గుణదోషముల నాలోచించుచుంటిని. కాని నా కనుగుణమైన కన్నె యొక్కతెయు కన్పడలేదు. అనంతమైన యీ భూమండలమునం దపరిమితమైన కాలమందు నా సౌందర్యమునకు, నా తెలివికిఁదగిన కన్యక పుట్టఁగూడదాయను నాశతోనుంటిని. కాని యీ దుష్కాలమందల్పమైన యీ నవీన వంగదేశమునందు నా మనోభావములకుఁ దగిన కన్యక పుట్టుట సందేహమే.

ఈలోపల నేర్పరులైన తెలిదండ్రులచే నా గుణవర్ణన మనేకపత్త్రములలో చేయఁబడి యనేక రాగములతోఁ బాడబడుచుండెను. వారి కన్యకలు నాకు ప్రియులైనను కాకపోయినను వారుచేయు సపర్యలుమాత్రము నాకప్రియములు గావు. నేనంతటి గుణవంతుఁడను గనుక నింత ప్రయత్నము నాకై చేయవలసినదే యనుకొంటిని. భక్తులు ప్రార్థింపనివరములను దేవతలీయకపోయినను వారు పూజలుమాత్రము మెలపించుకొనువారని గ్రంథములలో వినుచుందుముగదా. నేను నట్టి దేవతలవంటి వాఁడనైతిని.

ఠాకూరుదాదాకొక మనుమరాలుమాత్రమే యున్నదని వెనుక చెప్పియుంటిని. ఆ బాలికను చాలపర్యాయములు చూచితిని. ఆ పిల్ల యందగత్తెయని నేనెప్పుడు ననుకొనలేదు. ఆమె ముందు నాకు సహధర్మచారిణియగునను యూహయు నా మనమునం దెన్నఁడును జనించలేదు. ఏదో యొకదినమున కైలాసబాబు తన మనుమరాలి నుచితపూజలతో నాకు సమర్పించునను నిశ్చయముతోనుంటిని. ఇంతవఱకున్నే యేల సమర్పింపలేదని నాకు చాలఁ గోపముకల్గెను. అదియే నాకు నా కప్రియము పెరుగుటకు రహస్యకారణము.

“నారాయణపురముబాబు లెన్నఁడు నెవ్వరిని నేదియుఁ గోరువారు కారు” అని దాదాగారు పెక్కుసార్లు మిత్రులతో ననుచుండుట నేనెఱుంగుదును. మనుమరాలివివాహార్థమైయున్నను దాదా వంశసంప్రదాయమును నతిక్రమింపఁడు. ఈ అహంభావమొకటియే నా అహంకారమునకుఁ గారణము. నా యహంకారము నాలోపలనే జీర్ణించుచు బయటఁబడకుండుటకు నా సుగుణసంపదయే హేతువు.

తలయును మొఱవులనుసరించునట్లు, నా కోపమును వేళాకోళపుఁ జేష్ట లనుసరించుచుండును. దానంజేసి యా కైలాసబాబుమీఁద నా కోపము శాంతింపఁజేసికొనుటకొక చమత్కారమైన యుపాయము స్ఫురించెను. స్ఫురించిన యుపాయము నుపయోగింపకుండ నూరకోలేనైతిని.

కైలాసబాబు స్నేహితులలోఁ జాలమంది సుధ్యాసుతుఁడుగా వించి యతని వంశాభిమానమును హెచ్చించుచుండిరని యింతకుమున్నే చెప్పితినిగదా! ఉపకారవేతనమును గ్రహించుచున్న యొక దేశీయ బాబుతో, "వంగదేశ రాజప్రతినిధియొద్ద నొకనాఁడు మీ ప్రశంస వచ్చినది. ఆయన మీ వంశమర్యాదను మిగులఁ గొండాడెను. వంగదేశమునకంతకును గాశీరాజుగారి కుటుంబ మును మీ కుటుంబమును జాల మర్యాదవంతులనియు మీ యింటికొకసారి వచ్చి మీ దర్శనము జేయవలయుననియు నాతోఁ జెప్పెను" అని ప్రశంసింపఁగా, కైలాసబాబా స్వర్గస్థుండు కన్పడినపుడెల్ల "గవర్నరుగారు కుశలులా? వారి భార్య సౌభాగ్యవతిగానున్నదా! నేను వారి దర్శనమునకుఁ బోవలయునను కొన్నను దీరికలేకున్నది. ఈసారి మీరు వెళ్ళినపుడు నా వందనములు వారి కందఁ జేయుఁడు" అని చెప్పుచుండును.

ఇది యిట్లుండ నేనొకనాఁడు మంతనముగ కైలాసబాబుతో "బాబూ నేను నిన్న గవర్నరుగారిం జూడఁబోతిని. వారు నేటి మధ్యాహ్నమున మూఁడుగంటలకు మీ యింటికి వత్తురట. మీ వంశమర్యాద లెఱిఁగినవారగుట నొకపరియైనను మీ దర్శనముఁ జేయుకుండుట యపరాధముగ భావించుచున్నారు. మీకుఁ దొరుగిట్లే కదా! ఈ వృత్తాంతము వారితో విన్నవింపుఁడు' అని నాతో సెలవిచ్చినారని నమ్మకము పుట్టునట్లు నుడివితిని. అతఁడు తెల్లవాఁడైనను నా చెప్పినదంతయు బూటకమని తలఁచునుగాని నమ్మకుండెను. బాబు మాత్రము సంతోషించెను. ఇంతకుమున్నీవృత్తాంత మింకొక మిత్రునివలన విన్నదియేకావున నతఁడు నా మాటలు నమ్మకుండుటకుఁ గారణములేదు. గాని యతని హృదయము మిగుల సంక్షోభించెను. ఇంటికివచ్చిన పెద్దమను ష్యునితో మాటలాడుట కాంగ్లభాషరాదే! యని గొప్ప విచారమునకు మొదయిం చెను. అది గుర్తించి నేనును, "కులీనులైనవా రాంగ్లభాష చదువరు. చదువకుం డుటయే వారికి మర్యాద" అను సంగతి గవర్నరుగా రెఱుంగుదురనియు బంగాళభాషవచ్చిన యింకొక యధికారి వారివెంట వచ్చుననియుఁ జెప్పి యతని భయము కొంత పోనడంచితిని.

పగలు రెండు యామములైనది. కొందరుద్యోగములకుఁ బోయిరి. కొందఱు నిద్రించుచుండిరి. రెండు గుఱ్ఱములబండి యొకటి కైలాసబాబుగారి యింటి యెదుట నిలుపఁబడెను. ఇరువురు వేత్రధారులైన సేవకులు లోపలికిఁ బోయి, "గవర్నరుగారు దయచేసినార"ని మనవిచేసిరి. కైలాసబాబును నప్పుల వాండ్ర వాఁతఁబడకుండ మిగిలిన ప్రాఁతగుస్తులు ధరించుకొని సిద్ధుఁడై యుండుటంజేసి యామాట వినినవెంటనే ద్వారముకడ కెదురుగాఁబోయి గవర్నరుగారి వేసమును ధరించివచ్చిన నా మిత్త్రునిఁ జూచి వంగివంగి జోహారులు గావించుచు నభిముఖముగా నుండియే వెనుకకడుగులిడుచుఁ దన చిన్నగదిలోనికిఁ దీసుకొనివచ్చి ప్రాఁతశాలువ పఱచియుంచిన యొక కొయ్యకుర్చీపైఁ గూర్చుండఁబెట్టెను. పిదపఁ దుగకరాజులను వ్యావహారికభాషయగు "నురుదు" బాసలో గంభీరముగ నుపన్యసించి తనయింట మిగిలిన ప్రాఁతయాస్తియగు మొహరీలదండను బంగరుపళ్లెరమునం దునిచి కానికగా సమర్పించి వెండి పన్నీటిబుడ్డితోఁ బన్నీరుచల్లి యత్తరువు బుడ్డిలోని యత్తరు వాయన చేతిరుమాలను రాచి తమవంటి ప్రభువులకుఁ దగినమర్యాదఁ జేయఁదగినది నారాయణపురమేయనియు నీ యూర వైదేశికునివలె నుంటిననియుఁ బెక్కుసార్లు తన యతృప్తినిఁ దెలియఁబఱచెను.

పొడుగైన పట్టు దొరటోపీ ధరియించిన నా మిత్త్రుఁడగు దొంగగవర్నరుగారును తలయూఁచి తన సమ్మతిని జూపించెను. ఇంటనున్నపుడు టోపీ లేకుండుటయే యాంగ్లేయుల యాచారమని నేను చెప్పనక్కఱలేదు. కాని నా మిత్త్రుఁడు నిజస్వరూపము బయలఁబడునేమోయని యట్లు చేయలేదు. ముసలివాఁడగు కైలాసబాబును వానిసేవకుఁడు గణేశుఁడును యాంగ్లేయాచారము నెఱుఁగరు. పదినిమిషములకాల మట్లు గడచినపిమ్మట గవర్నరుగారు లేచిరి. వేషధారులైన సేవకులు శిష్టాచారముచొప్పున మొహరీలపేరును, బంగారుపళ్లెమును, ప్రాఁతశాలువయును, వెండిపన్నీరుబుడ్డియు, నత్తరువు పెట్టెయుఁ గైకొని బండిలోనుంచిరి. ఇది గవర్నరుగారి యాచారము కాఁబోలునని కైలాసబాబు ఫుల్కుఫుల్కున చూచుచు నూరకుండెను.

నేను ప్రక్కగదిలోనుండి జరిగినదంతయుఁ గన్గొనుచుంటిని. పెచ్చు పెరిగివచ్చు నవ్వు నాపుకొనుటకై నా తాతలు దిగివచ్చిరి. ప్రక్కలు నొప్పి పెట్టినవి. అయినను నవ్వాగలేక యింకొక గదిలోనికిఁ బరుగెత్తితిని. అందుఁ గుండెపగులునట్లేడ్చుచున్న యొక బాలికను చూచితిని. ఆమె నా యట్టహాసముఁ జూచి కఱ్ఱవలె నిలువఁబడి విశాలములైన నల్లని నేత్రములనుండి విద్యు